లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక

# జనబలం

ప్రజలే ప్రభువులు

డిసెంబర్ 2019 రూ.10/-




# యువత భవితతో చెలగాటం

## భారత విద్య, వైద్య విధానాలపై అంతర్జాతీయ అధ్యయనకారుల హెచ్చరిక






**అవినీతి నిరోధానికి ప్రభుత్వ కార్యాలయాల్లో, పాలనా వ్యవస్థలో చేపట్టాల్సిన చర్యలు, యువత ఉపాధి, విద్యార్థులు-ప్రభుత్వం-సమాజం అంశాలపై హైదరాబాద్‌లో నిర్వహించిన వేర్వేరు కార్యక్రమాల్లో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్**



ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

సంపుట 22 సంచిక 12
డిసెంబర్ 2019

సంపాదకవర్గం
బండారు రామ్మోహనరావు
శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్
దూసనపూడి సోమసుందర్

## జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

## చందాదారులకు విజ్ఞప్తి

చాలా మంది చందా గడువు ముగిసినా జనబలం పత్రికను మీకు ప్రతీనెలా పంపుతున్నాము.అట్టివారు తప్పక తమ చందాను వెంటనే పునరుద్ధరించుకోగోరుతున్నాము. చందా డబ్బును Foundation for democratic reforms పేరున జనబలం కార్యాలయంనకు పంపగలరు.

## లోపలి పేజీల్లో...

12 ‘నాణ్యమైన విద్యనందించలేక తెలుగు మాధ్యమం ఓడు’ అంటున్న ఆంధ్ర పాలకుడు

23 అమ్మ భాషకే ‘నోబెల్ సాహిత్య’ అందలం

25 సుప్రీంకోర్టు తీర్పుతో అయోధ్య వివాదానికి భరతవాక్యం పలకాలి

27 ఏడు పదుల్లోకి భారత రాజ్యాంగం..

కార్యాలయ చిరునామా : తులిప్స్ అపార్ట్‌మెంట్స్ 6-3-655, ఫ్లాట్ నెం 407, సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక, సోమాజిగూడ, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288
Email: janabalam.loksatta@gmail.com, loksattaudyamasamstha@gmail.com


## కార్టూన్ కార్నర్




## జనబలంలో ప్రకటన రేట్లు

| | |
|---|---|
| **కలర్‌పేజీ:** | **10,000** |
| **ఇన్‌సైడ్‌పేజీ బ్లాక్ అండ్ వైట్ :** | **5,000** |
| **ఫుల్‌పేజీ బ్లాక్ అండ్ వైట్ :** | **2,000** |
| **సగం పేజీ బ్లాక్ అండ్ వైట్:** | **1,000** |

ప్రకటన రుసుము, ప్రకటనకు సంబంధించిన ఫొటోలు, సమాచారం ప్రతినెలా 20వ తేదీ లోపుగా మాకు అందేలా పంపించగలరు. చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను



**చిరునామా: సంపాదకుడు, జనబలం, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక,**
*తులిప్స్ అపార్ట్‌మెంట్స్, 6-3-655, ఫ్లాట్ నెం 407, సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక,*
*సోమాజిగూడ, హైదరాబాద్-500 082*

జనబలం
డిసెంబర్ 2019
లోక్‌సత్తా ఉద్యమ సంస్థ
మాసపత్రిక

సంపాదకీయం

# ఆంగ్ల మాధ్యమంతో పిల్లల చదువులు గట్టెక్కేనా?

ప్రభుత్వ పాఠశాలల్లో ఇక నుంచి ఆంగ్ల మాధ్యమంలో మాత్రమే బోధన జరగాలన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిర్ణయం పూర్తిగా అనాలోచితమైనది. బోధనామాధ్యమం చుట్టూ రాష్ట్రంలో జరుగుతున్న చర్చ అసలు విషయాన్ని పక్కదారి పట్టిస్తున్నది. పాఠశాల విద్యా నాణ్యత, పిల్లల తరగతి వారీ సామర్థ్యాలు, అభ్యసనా స్థాయిలు, నైపుణ్యాలువంటి అంశాలపై జరగాల్సిన చర్చ రాజకీయ రచ్చగా మారింది. రుజువులు, ఆధారాలు, అనుభవాల మదింపుతో సంబంధంలేకుండా చర్చను భావోద్వేగాల చుట్టూ తిప్పుతున్నారు. మాధ్యమాన్ని, భాషా పరిజ్ఞానాన్ని కలగాపులగం చేసి, ఆంగ్లాన్ని ఉపాధితో ముడిపెట్టి ప్రభుత్వ పెద్దలు వాదిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థించే మేధావులు, లబ్ధిదారులు చర్చలో ధనిక, పేద కుల వివక్ష, ప్రభుత్వ- ప్రైవేటు రంగ అంశాలను జోడిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుపడుతున్న వారిపై సాక్షాత్తు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన మంత్రివర్గ సహచరులు ఎదురు దాడి చేస్తున్నారు. మీ పిల్లల్ని ఏ మాధ్యమంలో చదివించారంటూ సమస్యకు నైతిక కోణాన్ని తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఆంగ్ల మాధ్యమాన్ని వ్యతిరేకిస్తున్నవారు మాతృ భాషా పరిరక్షణ, మాతృభాషలో బోధనావశ్యకత వంటి అంశాల ఆధారంగా వాదనలు చేస్తున్నారు. దాంతో విద్యారంగం నేడు ఎదుర్కొంటున్న సంక్షోభం గురించిన పలు అంశాలు చర్చకు రావడంలేదు. సరైన పరిష్కారం దిశగా వ్యవహారం సాగడం లేదు.

భాష, మాధ్యమం, విద్యా నాణ్యత, నైపుణ్యం వంటి అంశాల్లో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు చేస్తూ వచ్చిన తప్పులనే జగన్‌మోహన్‌రెడ్డి మరింత దూకుడుగా కొనసాగిస్తున్నారు. గతంలో ఉన్నత, సాంకేతిక విద్యలో మాత్రమే ఉన్న ఆంగ్ల మాధ్యమాన్ని చంద్రబాబు ఉన్నత పాఠశాలల వరకూ తెచ్చారు. దానినే జగన్ ప్రాథమిక పాఠశాలల వరకూ తెస్తున్నారు. గతంలో ఆంగ్లమాధ్యమం ప్రవేశపెట్టిన సక్సెస్, మున్సిపల్ స్కూళ్లలో తెలుగు మాధ్యమం కూడా సమాంతరంగా ఉండటంతో మాధ్యమం ఎంపిక విషయంలో పిల్లలకు స్వేచ్ఛ ఉంది. తాజా నిర్ణయం వల్ల పిల్లల తల్లిదండ్రుల ఎంపిక స్వేచ్ఛ ప్రాథమిక స్థాయి నుంచే ఎగిరిపోయింది. మొత్తం పిల్లలంతా నిర్బంధంగా ఆంగ్ల మాధ్యమంలో మాత్రమే చేరాల్సి ఉంటుంది.

అమలులో ఉన్న ఆంగ్లమాధ్యమం ఫలితాల విశ్లేషణ జరగకుండా నిర్ణయాలు చేయడం అర్థరహితం. మాధ్యమంతో సంబంధం లేకుండానే పాఠశాల పిల్లల అభ్యసనా సామర్థ్యాలు అధ్వాన్నంగా ఉన్నాయని 'అసర్' వంటి నివేదికలు పదే పదే వెల్లడించాయి. గత పదిహేను సంవత్సరాలుగా ప్రతి ఏటా పిల్లల సామర్థ్యాలను అధ్యయనం చేస్తూ వచ్చిన అసర్ నివేదికలు పాఠశాల విద్యలోని విభిన్న కోణాలను అందులోని సమస్యలను వెలుగులోకి తెచ్చాయి. అసర్ నమూనాలో వేర్వేరు మాధ్యమాల విద్యార్థులు, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు వేర్వేరు ఆర్థిక సామాజిక నేపథ్యాలు కలిగిన వారూ ఉన్నారు. 2018 అసర్ నివేదిక ప్రకారం మనరాష్ట్రంలో మూడవ తరగతి విద్యార్థుల్లో రెండో తరగతి స్థాయి పాఠ్యాంశాన్ని చదవలేనివారు 77.6శాతం ఉన్నారు. ఐదో తరగతిలోకి వచ్చాక రెండో తరగతి స్థాయి పాఠ్యాంశాన్ని చదవలేనివారు 40.3 శాతం ఉండగా, ఎనిమిదో తరగతిలోకి వచ్చినా రెండో తరగతి పాఠాన్ని చదవలేనివారు 22 శాతం ఉన్నారు.

ఐదో తరగతి చదువుతూ ఓ చిన్నపాటి భాగహారం చేయలేనివారు 60.7శాతం ఉంటే ఎనిమిదో తరగతిలోకి వచ్చాక కూడా అదే భాగహారం చేయలేనివారు 52.4శాతం ఉన్నారు. మూడో తరగతి చదువుతూ రెండంకెల తీసివేత చేయలేనివారు 61.6శాతం ఉన్నారు. ఏ మాధ్యమంలో చదువుతున్నారనే దానితో నిమిత్తం లేకుండా పిల్లలందరి సామర్థ్యాలు నాసిగా ఉంటున్నాయి. తెలుగు మాధ్యమంలో చదువుతూకూడా తరగతి వారీ సామర్థ్యాలు సాధించలేని పిల్లలను మనం నిర్బంధంగా ఆంగ్లమాధ్యమంలోకి మారిస్తే పరిస్థితి మరింత దిగజారుతుందనే వాస్తవాన్ని గమనించాలి.

ప్రైవేటు ఆంగ్లమాధ్యమ పాఠశాలల్లో ప్రమాణాలు మెరుగ్గా వుంటాయన్న సార్వత్రిక భావన కూడా భ్రమ మాత్రమేనని 'అసర్' అధ్యయనం తేల్చి చెప్పింది. అభ్యసనా సామర్థ్యాల విషయంలో ప్రైవేటు-ప్రభుత్వ పాఠశాలల పిల్లల మధ్య ఉన్న వ్యత్యాసం స్వల్పం మాత్రమే. పిల్లల కుటుంబాల ఆర్థిక, సామాజిక, విద్యా నేపథ్యాల కారణంగా మాత్రమే అటువంటి వ్యత్యాసం ఏర్పడుతోంది తప్ప వారి మాధ్యమం కారణం కాదు. బడిలో పిల్లలకు లభించే అభ్యసనానికి తోడు అదనపు తోడ్పాటు పొందే పిల్లలు మాత్రమే రాణిస్తున్నారు. అటువంటి అదనపు తోడ్పాటు పొందని పిల్లలు వెనుకబడిపోతున్నారు. ఈ విషయాన్ని అసర్ ఆధారాలతో రుజువు చేసింది. పది సంవత్సరాల పాటు బడికి వెళ్లిన తర్వాత కూడా మన పిల్లలు ప్రాథమిక భావనలలో కనీస అవగాహన లేకుండా ఉంటున్నారు. భాష, గణితం అంశాలను పక్కన పెట్టి సాధారణ అంశాలను చూస్తే మన పిల్లల స్థాయి దయనీయంగా ఉందని తేలింది. 14-16 వయో వర్గం పిల్లల్లో 51శాతం మంది ఒక గడియారంలోని వేర్వేరు సమయాలను చూసి, వాటి మధ్య వ్యత్యాసం ఎన్నిగంటలు వుంటుందో లెక్కించి చెప్పలేక పోవడం మన చదువుల్లోని డొల్లతనాన్ని వెల్లడిస్తోంది. మన చదువులు ఇంత అధ్వాన్నంగా వుండటానికి గల కారణాలపై సహేతుకమైన చర్చ జరగడంలేదు. దాంతో సమస్యకు పరిష్కారాలు కూడా దొరకడం లేదు. మన రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలల్లో అతికీలకమైన సమస్యల్లో మల్టీగ్రేడ్ తరగతులు ఒకటి! రెండు, మూడు తరగతుల పిల్లల్ని కలిపి కూర్చోబెట్టే మల్టీగ్రేడ్ క్లాసులో బోధనాభ్యసన ప్రక్రియ ఎంత అరకొరగావుంటుందో చెప్పనక్కర్లేదు. మన రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాల్లో మల్టీగ్రేడ్ క్లాస్‌లు ఉన్న పాఠశాలలు 2010లో 55.2శాతం ఉండగా, 2018 నాటికి వాటి సంఖ్య 63.4 శాతానికి పెరిగింది. మల్టీగ్రేడ్ తరగతులను సమస్య పరిష్కరించకుండా బోధనామాధ్యమం మారిస్తే ఒరిగేదేముంటుంది. పిల్లల గైర్హాజరు, ఉపాధ్యాయులపై పడుతున్న బోధనేతర పనుల భారం, సిలబస్ భారం వంటివి మరికొన్ని సమస్యలు.

ఉపాధికి ఆంగ్ల మాధ్యమం అవసరం అనేవారు మన ప్రభుత్వోద్యోగాలు కేవలం రెండు శాతం మాత్రమేనన్న వాస్తవాన్ని విస్మరిస్తున్నారు. గుమాస్తా ఉద్యోగాలు మినహా మిగిలిన ఉద్యోగాలలో భాషాజ్ఞానం గురించిన సమస్యలేనే లేదు. రైల్వే ఉద్యోగాలకు సంబంధించి 72 కేటగిరీల్లో ఇంగ్లీషు పరీక్షను ఎత్తేసారు. సివిల్స్, బ్యాంకింగ్ పరీక్షల్లో తెలుగు మాధ్యమాన్ని అనుమతించారు. 2017లో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా 1600 పీవో పోస్టుల కోసం పరీక్ష నిర్వహిస్తే 20లక్షల మంది పోటీ పడ్డారు. వారంతా ఆంగ్లమాధ్యమ విద్యార్థులే. పరీక్షలో 40 మార్కులకు ఇంగ్లీష్ ప్రశ్నాపత్రం ఇచ్చారు. ఎంపికైన వెయ్యిమందికి ఒక్క మార్కురాలేదని తేలింది. ఉద్యోగాలకు పరీక్షలు రాసే మన పిల్లల ఆంగ్ల చదువుల బండారం ఇదీ. చదువుల వల్ల మాధ్యమం వల్ల నైపుణ్యాలు రావని పలు అధ్యయనాలు తేటతెల్లం చేశాయి.

ఆంగ్లమాధ్యమంలో చదివినప్పటికీ ఇంజనీరింగ్ ఎంబీఏ, పీజీ విద్యార్థులకు ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలు ఉండటం లేదని టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ అధ్యయనంలో వెల్లడైంది. మన ఇంజనీరింగ్ పట్టభద్రుల్లో 3 శాతం మందికి మాత్రమే అవసరమైన నైపుణ్యాలున్నాయని తెలిపింది.

మన బడుల స్థితిగతులు, పిల్లల సామర్థ్యాలు వంటి అంశాలను పక్కనబెట్టి ఆంగ్ల మాధ్యమం మాత్రమే సమస్యలన్నింటినీ పరిష్కరిస్తుందని చెప్పడం అర్థరహితం. పాఠశాల విద్యని సమూలంగా ప్రక్షాళన చేయకుండా ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టడం చిట్కా వైద్యం మాత్రమే. ఈ ప్రయోగం వికటించకుండా ఒకే సమగ్ర వ్యూహంతో విద్యా ప్రమాణాలు మెరుగుపరిచే విధానాన్ని రూపొందించుకోవడం ఉత్తమం. ఆంగ్ల మాధ్యమంతోనే ముందుకు వెళ్లాలని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం భీష్మిస్తే ఓటు బ్యాంకు రాజకీయాలకు పనికొస్తుందేమోగాని పిల్లల చదువులకు మాత్రం ఏమీ ప్రయోజనం లేదు.

డి. సోమ సుందర్

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ
మాసపత్రిక

# యువత భవితతో చెలగాటమాడుతున్న భారత విద్య, వైద్య విధానాలు

## అంతర్జాతీయ అధ్యయనకారుల హెచ్చరిక




ప్రపంచంలో ఏ తరంలో లేనంత గొప్ప సాంకేతిక పరిజ్ఞానం, అపార అవకాశాలు మన ముందున్నా కూడా.. ఈవేళ్టి కంటే నిన్నే బాగుంది, నిన్న కంటే మొన్నే బాగుంది, మన తరం కంటే పాతతరాల వాళ్లే హాయిగా బతికారు అని మనలో అనేకమందిమి తరచూ నిట్టూరుస్తున్నామంటే అందుకు మూలం– 'ప్రభుత్వాల పాత్రను మనం స్పష్టంగా అర్థం చేసుకోవటం, ఆ బాధ్యతల్ని సక్రమంగా నెరవేర్చేలా పాలకుల మీద ఒత్తిడి తేలేకపోవటం'లో ఉంది.

గాంధీగారు, ఆయన తన వారసులుగా ప్రకటించిన నేతలూ చెప్పారు కాబట్టి మన దేశంలో ప్రజాస్వామ్యం కావాలని కోరుకున్నాం గానీ.. ప్రజాస్వామ్యం, ఆధునిక ప్రజాస్వామ్య ప్రభుత్వం చేయాల్సిన పనులపై మన దేశ ప్రజల్లో చాలామందికి స్పష్టత లేదని సాంప్రదాయ రాజకీయ పార్టీలు బాగా పసిగట్టాయి. ఈ లోపాన్ని పాచికగా చేసుకుని.. కేవలం వచ్చే ఎన్నికల్లో ఎలాగోలా ఎలా గెలవాలి? అనే కోణంలో మాత్రమే రాజకీయం, పాలన చేయటం మొదలుపెట్టాయి. యువత, దేశ భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నాయి.

అధికారంలోకొచ్చిన పార్టీ/కూటమి నేతలు ప్రభుత్వం పేరుతో అధికారాన్ని కేంద్రీకరించుకుని తమ ఇష్టమొచ్చిన పనుల్ని చేస్తున్నారు, దైవాంశసంభూతులమన్నట్లు, తమ సొంత సొమ్మేదో దానం చేస్తున్నట్లు ప్రజల పన్నుల డబ్బును అసంబద్ధ, తాత్కాలిక పథకాలకు పందేరం చేస్తున్నారు, వీలున్నంత మేర దోచేస్తున్నారు, ఫిరాయింపుల్ని ప్రోత్సహిస్తున్నారు, అధికార యంత్రాంగాన్ని అడ్డం పెట్టుకుని జనం నెత్తిన పెత్తనం చెలాయిస్తున్నారు.

'ప్రజలు వాళ్లంతట వాళ్లు చేసుకోగలిగిన పనుల్ని ప్రభుత్వం చేయనక్కర్లేదు, ప్రైవేటు వ్యక్తులు, సంస్థలు పోటీపడి ముందుకొచ్చి చేసే పనుల్నీ ప్రభుత్వం చేయనక్కర్లేదు, మంచి ప్రభుత్వం అంటే 'తక్కువ ప్రభుత్వం, ఎక్కువ పాలన' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా పలుమార్లు నొక్కి వక్కాణించారు'

.. మరి ఇలా చాలా పనుల్ని ప్రజలు, ప్రైవేటు సంస్థలే చేసుకోగలిగినప్పుడు ప్రభుత్వం ఎందుకిక? గుమాస్తాలు, యంత్రాల్లా ఉద్యోగులకు జీతాలివ్వటానికి, ప్రజలకు తాత్కాలిక తాయిలాల్ని పందేరం చేయటానికా?

అసలు ప్రభుత్వం అనేదాన్ని మనం ఎందుకు ఏర్పాటు చేసుకుంటున్నాం?

ఆధునిక ప్రజాస్వామ్యంలో ప్రజలకు ప్రభుత్వం ఏం

చేస్తుంది, ఏం చేయాలి?

.. స్వతంత్రం వచ్చి ఏడు దశాబ్దాలు దాటిపోయినా చర్చించని ఈ ప్రశ్నలపై భారతదేశం ఇప్పటికైనా మాట్లాడుకోవటం మొదలుపెట్టాలి. సరైన జవాబుల్ని గుర్తించాలి, వాటిని పాలనలో, రాజకీయంలో భాగం చేసుకోవాలి.

ఓటుకిచ్చే డబ్బులకు, తాత్కాలిక తాయిలాల పథకాలకు, కుల, మత దురభిమానాలకు మనం లొంగిపోయి పార్టీలకు అధికారాన్ని కట్టబెడుతున్నాం కాబట్టి.. నేతలు ఈ ప్రశ్నల్ని తప్పించుకోవటానికే ప్రయత్నిస్తారు. కానీ ఎన్ని ఉచితాల్ని తీసుకుంటున్నా, ఓటుకు నోట్లు తీసుకుంటున్నా, కులం, మతం, ప్రాంతం వంటి వాటిని రాసుకుని పూసుకున్నా.. సమస్యలు పెరగటమే తప్ప తగ్గడం లేదని ఉక్కిరిబిక్కిరవుతున్నది మనం. కాబట్టి మనమే సమస్య మూలాన్ని గుర్తించాలి. ఆలస్యం చేస్తున్నకొద్దీ.. పీల్చే గాలి దగ్గర్నుంచి జీవితంలో ప్రతి అడుగూ దుర్భరమయ్యే దశలోకి నెట్టబడతాం.

ఓటు, స్వేచ్ఛ మాత్రమే ప్రజాస్వామ్యం కాదని, ప్రభుత్వాల చేత తమకు అవసరమైన పనుల్ని చేయించుకునే అవగాహన, సామర్థ్యం కూడా ప్రజలకు ఉండాలని చైతన్యపరిచేందుకే, యువతను క్రియాశీల భాగస్వాముల్ని చేసేందుకే.. ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్)/లోక్‌సత్తా ఆధ్వర్యంలో 'ఆచరణలో పరిపాలన' (గవర్నెన్స్ ఇన్ యాక్షన్) పేరుతో ప్రసంగ చర్చా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

మన దేశంలో పాలన, ప్రజాస్వామ్యం ఆచరణలో ఎలా ఉన్నాయో ప్రామాణికంగా చర్చించేందుకు, వైఫల్యాలకు ఆచరణసాధ్యమైన నిర్దిష్ట పరిష్కారాలనందించే ఆలోచనలను ప్రోత్సహించేందుకూ 'గవర్నెన్స్ ఇన్ యాక్షన్' ఒక వేదికగా పనిచేస్తుంది.

ఎఫ్‌డీఆర్ ఆధ్వర్యంలో అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కి) సహకారంతో ఎం. భోజిరెడ్డి, ఇ.వి రామిరెడ్డిల పేరు మీద ఈ కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నారు.

తొలి కార్యక్రమం నవంబర్ 14న హైదరాబాద్ 'ఆస్కి' ప్రాంగణంలో జరిగింది.

ప్రభుత్వం చేయాల్సిన ప్రధానమైన పనుల్లో నుంచి విద్య, ఆరోగ్యం అనే రెండింటిని తొలి కార్యక్రమానికి ఎంపిక చేశారు.

ప్రభుత్వం అనగానే.. తొలుత చేయాల్సింది ప్రతి బిడ్డకూ ప్రపంచంలో ఎక్కడైనా బతకగల మంచి చదువును, ప్రతి కుటుంబానికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని ఆర్థికభారం లేకుండా అందించటం!

### మానవ వనరుల అభివృద్ధిలో

### వైఫల్యమే నేటి భారత్ వైఫల్యం

దేశంలో యువ జనాభా పెరుగుతోందని, అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యాలను అందించకపోతే మానవ వనరుల అభివృద్ధి కుంటుపడి దేశం ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయ, పాలనాపరంగా మూల్యం చెల్లించాల్సి వస్తుందని ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ గత 23 ఏళ్ల నుంచి పలు కార్యక్రమాల ద్వారా ఎలుగెత్తి హెచ్చరిస్తూనే ఉన్నారు. కానీ ఈ రెండు మౌలిక రంగాల్లో తెలుగు రాష్ట్రాలు, మన దేశం సాధించిన ప్రగతి ఇప్పటికీ చాలా పేలవం, అధ్వాన్నం. ఈవేళ దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభానికి మూలం విద్య, ఆరోగ్య రంగాల్లోని అధ్వాన్న ప్రమాణాల్లోనే ఉంది. మానవ వనరుల అభివృద్ధి లేకపోవటంతో నూతన ఉత్పత్తుల తయారీ సామర్థ్యం, ఉన్న ఉత్పత్తుల కొనుగోలుశక్తి పడిపోయాయి. దేశంలో లౌకికవాదానికి ముప్పు వాటిల్లిందని, సమాజంలో పరస్పర అపనమ్మకం పెరిగిందని, ఇది ఆర్థికవ్యవస్థను కూడా దెబ్బతీస్తోందని గగ్గోలు పెడుతున్న మన మేధావులు, సామాజిక కార్యకర్తలు, రాజకీయ ప్రముఖుల్లో పలువురు కూడా ఈ రెండు రంగాల వైఫల్యమనే పాపంలో భాగస్వాములే. విద్య, ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా ఆర్థిక సంక్షోభానికి, ఛాందసవాదం బలపడటానికి వీరు కూడా కారకులే.

## విద్య: సత్య నాదెళ్ల, ఇంద్రా నూయీలను చూపించి మభ్యపెడుతున్నారు

మన దేశంలో విద్యారంగాన్నే తీసుకుంటే, సత్య నాదెళ్ల, ఇంద్రా నూయీలను మనమే ప్రపంచానికి అందించామని గర్వంగా చెప్పుకుంటుంటాం. కానీ అలాంటివాళ్లు వేళ్ల మీద లెక్కపెట్టగలిగినంతమందే ఉన్నారని, దేశ జనాభాలో అత్యధికులు కనీస ప్రమాణాలు లేని విద్యను పొందుతున్నారని మాత్రం గుర్తించలేకపోతున్నాం. 74 దేశాల మధ్య విద్యాప్రమాణాల మీద చేసిన 'పీసా' సర్వేలో మన దేశానికి 73వ స్థానం లభించింది. ఇక 'అసర్' సర్వేల్లో దేశ వ్యాప్తంగా మన చదువులు అత్యంత నాసిరకంగా ఉన్నాయని ప్రతి ఏటా తేలుతోంది. 5వ తరగతి విద్యార్థుల్లో 50 శాతం మంది 2వ తరగతి వాచకాన్ని కూడా చదవలేరని 2018 అసర్ సర్వే తెలిపింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, జాతీయ స్థాయిలోని ప్రభుత్వాలు చేయించిన సర్వేల్లోనూ ఇవే దిగజారుడు ప్రమాణాలు! మనది ఇంకా అభివృద్ధి చెందుతున్న దేశమే కదా, విద్యారంగానికి డబ్బుల్లేవేమో అన్న భావన చాలామందిలో ఉందికానీ, అది వాస్తవం కాదు. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర లాంటి రాష్ట్రాల్లో ఒక్కో విద్యార్థి మీద ఏడాదికి రూ. 70,000కు పైగా ఖర్చు పెడుతున్నారు. తెలంగాణలో ఈ మొత్తం ఇంకా ఎక్కువ. ఈ ఏడాది నుంచి ఏపీలో ఈ ఖర్చు ఇంకా పెరుగుతోంది. తల్లిదండ్రులు ఎగబడి తమ పిల్లల్ని చేరుస్తున్న చాలా ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల కంటే కూడా ప్రభుత్వం పెడుతున్న ఈ డబ్బు ఎంతో ఎక్కువ. ప్రభుత్వం ఒక పక్క ఇలా

విద్యారంగం మీద ఖర్చును పెంచుకుంటూ పోతుంటే, మరోపక్క ప్రైవేటు స్కూళ్ల వైపు విద్యార్థులు మళ్లటం కూడా పెరుగుతోంది. ఇంతా చేసి పలు ప్రైవేటు స్కూళ్లలోనూ చదువులు బాగా లేవని అసర్ సర్వేల్లో తేలింది. భారీ ఫీజులు వసూలు చేసే స్కూళ్లలో, ఉపాధ్యాయులు, యాజమాన్యం సేవాభావంతో పట్టించుకునే పాఠశాలల్లో, తల్లిదండ్రులకు మంచి చదువుండి పిల్లలకు ఇంటి వద్ద బోధించే సందర్భాల్లోనూ మంచి చదువు అబ్బుతోంది కానీ.. మిగిలిన కోట్లాదిమంది పిల్లలకు పనికొచ్చే చదువు అందటం లేదు. ఒక తరాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యతలో మన విద్యావ్యవస్థ ఘోరంగా విఫలమవుతోంది. ప్రైవేటు స్కూళ్ల నుంచి పిల్లల్ని ఆకర్షించటానికి చౌకబారు ఎత్తుగడలు, ప్రచార వ్యూహాలు వేయటం తప్పించి.. విద్యలో ప్రమాణాల్ని పెంచేందుకు మాత్రం పాలకులు ప్రయత్నించటం లేదు.

**ఆరోగ్యం: కేటాయింపులు తక్కువ,**

**వాటిని ఖర్చు చేసే పద్ధతి కూడా లోపభూయిష్టం**

ఆరోగ్య సంరక్షణ రంగంలోనూ ఇదే పరిస్థితి. విద్యలో పలుచోట్ల అవసరానికి మించి ఖర్చు పెడుతున్నా ఫలితాలు రాని పరిస్థితి ఉంటే, ఆరోగ్య రంగంలో ఫలితాలకు తగ్గంత కూడా ఖర్చు చేయటం లేదు. మన కంటే జీడీపీలో ఎంతో వెనుకబడి ఉన్నాయని మనం తరచూ డబ్బా కొట్టుకునే దేశాల కంటే కూడా అతి తక్కువ మొత్తాన్ని మనం ప్రజారోగ్యానికి ఖర్చు చేస్తున్నాం. కేవలం వైద్య చికిత్స ఖర్చులు భరించలేక ఏటా కోట్లాదిమంది పేదలుగా మారుతున్నారు. దేశ ఆరోగ్య వ్యయంలో 65 శాతాన్ని ప్రజలే జేబుల్లో నుంచి పెట్టుకుంటున్నారు. జాతీయాదాయంలో కేవలం 1.2 శాతాన్ని ఖర్చు పెట్టటం పెద్ద పాలనా వైఫల్యమైతే, ఆ పెట్టే ఖర్చును కూడా సరైన రీతిలో ఖర్చు చేయకపోవటం ఇంకా దారుణ వైఫల్యం. ఉదాహరణకు, ఇన్సూరెన్స్ ఆధారిత ప్రజారోగ్య విధానం వల్ల అమెరికాలో ఖర్చు విపరీతంగా అవుతోంది. ఆ మేరకు తగిన ఆరోగ్య సేవలు కూడా అందటం లేదు. అమెరికా అంటే సంపన్న దేశం కాబట్టి.. ఏదోకరకంగా నిభాయించుకుంటోంది, యూఎస్ కంటే ఎన్నో రెట్లు తక్కువ ఆదాయం ఉన్న మన దేశంలో ఈ రకంగా ఇన్సూరెన్స్ చుట్టూ ఆరోగ్య సేవల్ని తిప్పితే ఆరోగ్య సంక్షోభం ఇలాగే కొనసాగుతూ ఉంటుంది. అందుకే ఆరోగ్యశ్రీ వచ్చి 12 ఏళ్లయినా ఇప్పటికీ తెలుగు రాష్ట్రాల్లో ఆరోగ్యం అందటం లేదు. ఆరోగ్యశ్రీ మోడల్‌లోనే బీమా ఆధారితంగా తృతీయ స్థాయి వైద్యం చుట్టూ జాతీయస్థాయిలో తీసుకొచ్చిన ఆయుష్మాన్ భారత్ ఆశించిన ఫలితాలనివ్వలేక పోతోంది.

అమెరికాలాగా జీడీపీలో 18 శాతం ఖర్చు పెట్టనక్కర్లేదు, బ్రెజిల్, దక్షిణాఫ్రికా, చైనాల్లాగా 5 శాతం దాకా కూడా ఇవ్వనక్కర్లేదు.. కేవలం మరో 1 శాతం నిధుల్ని పెంచితే చాలు. నాణ్యమైన విద్య, ఆరోగ్యం కోసం దాదాపు రెండున్నర దశాబ్దాలుగా కృషి చేస్తున్న ఎఫ్‌డీఆర్, లోకసత్తా.. అందుకోసం మనకున్న బడ్జెట్లలోనే ప్రభుత్వాలు ఏం చేయాలో రాష్ట్రాలు, జాతీయ స్థాయిలో ఇప్పటికే స్పష్టంగా దేశం ముందు ఉంచాయి. కొద్దిపాటి అదనపు వ్యయంతో, సరైన పద్ధతులను చేపట్టటంతో ప్రజలపై భారం లేకుండా అందరికీ నాణ్యమైన వైద్య సేవల్ని అందుబాటులోకి తెచ్చే పరిష్కారాలున్నా ప్రభుత్వాలు పందేరానికి, ఆర్భాటపు ప్రచారానికి తప్ప ప్రజలకు ఖర్చులేని మంచి ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వటం లేదు.

ఈ నేపథ్యంలో.. భారత్‌లో అత్యధిక యువజనాభా పెనుభారంగా మారకుండా సదవకాశం కావాలంటే– ఎంత వేగంగా వీలైతే అంత వేగంగా ఆరోగ్యం, విద్య రంగాలను బాగు చేయాలి! అందుకే తొలి ప్రసంగ చర్చా కార్యక్రమాన్ని 'యువ జనాభా అత్యధికంగా ఉండటమనే సదవకాశాన్ని మనం జారవిడుచుకుంటున్నామా? దేశ భవిష్యత్తుకు కీలకమైన మానవ వనరులను అభివృద్ధి చేసే విద్య, ఆరోగ్యంలో భారత్ ఎక్కడుంది?' అంశంపై నిర్వహించారు.

అంతర్జాతీయ మేధావులు ప్రొఫెసర్ లాంత్ ప్రిచెట్, ప్రొఫెసర్ జెఫ్రీ హామర్‌లు ఇందులో పాల్గొని విలువైన విశ్లేషణల్ని, పరిష్కారాల్ని అందించారు.

**ప్రిచెట్, హామర్‌ల గురించి..**

ప్రొ. ప్రిచెట్.. అభివృద్ధికి సంబంధించిన అనేక అంశాలపై విస్తారంగా అధ్యయనాలు, రచనలు చేశారు. ప్రస్తుతం ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలోని బ్లావెట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌లో 'రైజ్' పరిశోధనా డైరెక్టర్‌గా ఉన్నారు. అంతకుముందు అంతర్జాతీయ అభివృద్ధి పద్ధతులపై హార్వర్డ్ యూనివర్సిటీలోని కెన్నడీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌లో పనిచేశారు. 'సామర్థ్యం ముందు.. ఆ తరువాతే మంచి విధానం' అనే వాదన నేపథ్యంలో.. మన దేశంలో విద్యావిధానం రూపకల్పనపై ఆయన ఎఫ్‌డీఆర్, ఆస్కి కార్యక్రమంలో ప్రసంగించారు.

ప్రొ. హామర్.. ప్రిన్స్‌టన్ యూనివర్సిటీలోని ఉడ్రోవిల్సన్ స్కూల్‌లో ఆర్థికాభివృద్ధిపై విజిటింగ్ బోధకులు. ఆయన ప్రధానంగా దక్షిణాసియా దేశాలకు సంబంధించి అభివృద్ధి, ప్రజా ఆర్థికం, ఆరోగ్యంపై పరిశోధనలు చేశారు. ప్రస్తుతం.. భారతదేశంలో ఆరోగ్య సేవల నాణ్యత, నాణ్యమైన వైద్య ఆరోగ్య సేవల్ని అందించటంలో ఎదురవుతున్న అవరోధాలు, మెరుగైన జవాబుదారీతనంతో ప్రజలకు మెరుగైన సేవలను అందించటంపై కృషి చేస్తున్నారు. మనదేశంలోని ఆరోగ్య విధానంపై హామర్ ప్రసంగించారు. వికేంద్రీకరణ, పాలన, విద్య, ఆరోగ్య విధానాలపై ఈ ఇద్దరు ప్రపంచస్థాయి నిపుణుల విలువైన విశ్లేషణ, సూచనలు ఎక్కువమందికి చేరాలని, విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లాలని, లోతైన, ఆలోచనతో కూడిన చర్చకు దారితీయాలని ఈ ప్రసంగ కార్యక్రమాలకు పౌర సమాజ నేతలు, ఆలోచనాపరులతోపాటు మీడియా సంపాదకుల్ని,

సీనియర్ జర్నలిస్టులను కూడా ఆహ్వానించారు.

**ఇప్పుడున్న రీతిలోనే వ్యవహరిస్తామంటే..**

**ఇండియాలో మంచి విద్యకు 150 ఏళ్లు పడుతుంది: ప్రిచెట్**

ఇప్పుడు చేస్తున్నట్లే 'చూద్దాంలే', 'తొందరేముంది.. నెమ్మదిగా, క్రమక్రమంగా చేద్దాంలే', 'జీడీపీ పెరిగితే అన్నీ సర్దుకుంటాయి' అనుకుంటే.. భారతదేశంలో విద్యాప్రమాణాలు 'పీసా' సర్వేలో పాల్గొంటున్న దేశాల స్థాయికి (ఇంతకుముందే పేర్కొన్నట్లు, ఈ సర్వేలో భారత్‌కు 74 దేశాల్లో 73వ ర్యాంకు వచ్చింది. అయితే లోపాలేమిటి అని సమీక్షించుకోకుండా.. ఇక మీదట ఈ సర్వేలో పాల్గొనబోమని భారత సర్కారు ప్రకటించింది. లోక్‌సత్తా జేపీ, కొందరు విద్యావేత్తల నుంచి విమర్శలు వెల్లువెత్తటంతో ఎట్టకేలకు 2021లో పీసా సర్వేలో పాల్గొంటామని తెలిపింది. అయితే సమగ్రంగా కాకుండా, కొన్ని మినహాయింపులతో భారతీయ విద్యార్థులు సర్వేలో పాల్గొంటారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి) చేరుకోవటానికి కనీసం 150 ఏళ్లు పడుతుందని ప్రొఫెసర్ లాంత్ ప్రిచెట్ అన్నారు. ఇది కూడా చాలా సానుకూల ధోరణితో అంచనా వేస్తే పట్టే సమయమన్నారు.

**ప్రిచెట్ వెల్లడించిన ఇతర అంశాలు:**

- ఇండియాలో దాదాపు పిల్లలందరూ స్కూలుకు వెళ్తున్నారు.
- స్కూళ్లలో విద్యార్థుల సంఖ్యలో, ఏటా వాళ్లు పాసై పై తరగతికి వెళ్తుండటంలో భారతదేశం ప్రశంసనీయ ప్రగతిని సాధించింది. పిల్లలందరూ పాఠశాలల్లో చేరే కార్యక్రమం.. భారత్‌లో పెద్దఎత్తున విజయవంతమైంది.
- స్కూళ్లలో చేర్చటం ఇప్పుడు సమస్య కాదు. సమస్యల్లా– ఆ పాఠశాలల్లో అందే విద్య.. అంటే, అభ్యసనం, సామర్థ్యాలు, నైపుణ్యాలు అధ్వాన్నంగా ఉండటం!
- ఇండొనేషియాలో ఇలా ఎన్‌రోల్‌మెంట్ కోసం 14 ఏళ్ల పాటు ఓ పెద్దకార్యక్రమాన్ని నిర్విరామంగా చేశారు. అంతకుముందుకన్నా, మూడు రెట్లు ఎక్కువ నిధుల్ని ఖర్చు పెట్టారు. అయితే చివరికి సామాన్య అంకగణిత సామర్థ్యం కూడా కొరవడిన యువతను తయారుచేశారు.
- స్కూలుకెళ్లటం, మార్కులు, ర్యాంకులనే భారత్‌లో సక్సెస్‌గా చూస్తున్నారిప్పుడు. దీన్నుంచి.. మంచి ప్రమాణాల విద్య చుట్టూ సక్సెస్‌ని పునర్నిర్వచించటం చాలా కష్టమైన పనిగా తయారైంది.
- అభివృద్ధి చెందిన దేశాలను అలా ఉంచి, అభివృద్ధి చెందుతున్న దేశాలతో పోల్చి చూసినా కూడా ఇండియాలోని స్కూళ్లలో పిల్లలు నేర్చుకుంటున్న విద్య పరమ నాసిరకంగా ఉంది.



- మానవ వనరుల అభివృద్ధిలో భారతదేశం అట్టడుగున కాంగో, ఆఫ్గనిస్థాన్, రువాండా, బంగ్లాదేశ్‌ల సరసన ఉంది.
- కింది స్థాయి నుంచి పైస్థాయి వరకూ ఇదేరకమైన దిగజారుడు విద్యాప్రమాణాలు.
- మూస ధోరణి, బలవంతపు విధానాలను రుద్దటంతో పిల్లలు స్వేచ్ఛగా వికసిస్తూ చదువుకోలేక పోతున్నారు. 19వ శతాబ్దపు స్థాయి విద్యాప్రమాణాలే కొనసాగుతున్నాయి.
- కొన్నేళ్లుగా బడికెళ్తున్న యుక్తవయస్కుల్లో కూడా నైపుణ్యాలు దిగ్భ్రమ కలిగించే స్థాయిలో ఉన్నాయని అసర్ 'బ్యాక్ టూ బేసిక్స్' నివేదిక తెలియజేస్తోంది.
- ఒక చిన్న పేరా చదవమని ఓ ఆర్థిక సర్వేలో భాగంగా అడిగితే.. అందులో భారత్ కంటే కెన్యా, ఇండొనేషియా, రువాండా మెరుగ్గా ఉన్నాయి.
- భారత్‌లో బుకర్, నోబెల్ వంటి ప్రపంచస్థాయి పురస్కారాల్ని

అందుకున్నవారు ఉన్నప్పటికీ.. ఇక్కడ సాధారణ ప్రజానీకంలో కాస్త డబ్బున్నవారికి కూడా ప్రపంచస్థాయి చదువు అందటం లేదు.

- మితిమీరిన సిలబస్‌తో తక్కువ చురుకైన విద్యార్థులు నేర్చుకుంటున్నది దాదాపు శూన్యం.
- ఎంత ఎక్కువసేపు స్కూల్‌లో ఉంటే, అంత చదువు అందుతుంది అనే భ్రమ ఇక్కడి విద్యావిధానంలో కనిపిస్తుంది. తేలిగ్గా అర్థమయ్యే పాఠాలు, బోధన లేకపోవటంతో పలువురు పిల్లలు వేగంగా నేర్చుకోలేకపోతున్నారు. నేర్చుకోవటంలో వెనుకబడుతున్నందున పాఠశాలకు రావటం కూడా మానేస్తున్నారు (డ్రాపవుట్లు).
- స్కూల్‌లో విద్యార్థి అభ్యసన సామర్థ్యం పెరగకపోగా, ఏయేటి కాయేడు అధ్వాన్నంగా తయారవుతోంది.
- ఎనిమిదేళ్లపాటు స్కూలు చదువున్న 14-18 సంవత్సరాల మధ్య వయసుగల విద్యార్థుల్లో దాదాపు 73 శాతం మంది గడియారం చూసి సమయాన్ని అర్థం చేసుకుని రెండు వేళల మధ్య వ్యవధి ఎంతో చెప్పలేకపోయారు. ఎనిమిది కన్నా ఎక్కువ సంవత్సరాలపాటు స్కూలులో చదువుకున్న ఈ వయసు వారిలో కూడా 60 శాతం దాకా ఈ సమయం లెక్క చెప్పలేకపోయారు.
- మౌలిక అభ్యసనం చాలా నాసిరకంగా ఉంది.
- డాష్‌బోర్డులు, డేటా, డేటా విశ్లేషణ, కఠిన నిబంధనలతో పై నుంచి పర్యవేక్షణలు, నియంత్రణలతో నాణ్యమైన చదువు రాదు. వసతులు, నిర్వహణ వంటి వాటిల్లో విజయవంతమైన సామర్థ్యాలనే విద్యాబోధనకు కూడా వర్తింప చేస్తూ విజయానికి సంస్థలు ప్రయత్నిస్తున్నాయి. కానీ, దీని వల్ల ఏమీ ప్రయోజనం కలగడం లేదు.
- ప్రజాదరణ పొందుతున్న పద్ధతి గదా అని మార్చుకోవటానికి సంస్థలు ఇష్టపడటం లేదు.
- కానీ, దీన్నుంచి విద్యాసంస్థల్ని వెనక్కి తెచ్చి కొత్త సక్సెస్ వైపు మళ్లించాల్సి ఉంది. 21వ శతాబ్దపు స్థాయికి విద్యాప్రమాణాల్ని పెంచాల్సి ఉంది.
- మూస పద్ధతిలో, నచ్చిన రీతిలో కాకుండా సరైన అధ్యయనాలు, ఫలితాలు, సాక్ష్యాలు ఆధారంగా ప్రభుత్వాలు దేశీయ పరిస్థితులకనుగుణంగా విద్యావిధానాల్ని రూపొందించాలి, సక్రమంగా అమలు చేయాలి. ప్రైవేటు భాగస్వామ్యాన్నిస్తూనే నాణ్యమైన విద్య లక్ష్యంగా స్థానిక ప్రభుత్వాలకు కూడా విద్యాసంస్థల నిర్వహణలో భాగస్వామ్యం కల్పించాలి.

## 100 ఏళ్ల క్రితం ఆ దేశాలు చేసిన పనుల్ని నాటి కంటే నాసిరకంగా ఇప్పుడు ఇండియాలో ప్రజారోగ్య రంగంలో చేస్తున్నారు: హామర్

అంటువ్యాధులు, జనాభా నియంత్రణ, పోలియో నివారణలో భారతదేశం గణనీయ ప్రగతిని సాధించినా.. దేశంలోని ప్రజారోగ్య వ్యవస్థ, ముఖ్యంగా ప్రాథమిక ఆరోగ్య రంగం అధ్వాన్నంగా ఉందని ప్రొఫెసర్ జెఫ్రీ హామర్ అన్నారు. ప్రజారోగ్యంలో భారత్ వైఫల్యం కేవలం డబ్బు వ్యయానికి సంబంధించి మాత్రమే కాదన్నారు. ఆ చేస్తున్న ఖర్చును కూడా సరైన రీతిలో, అవసరమైన చోట ఖర్చు చేయకపోవటం సంక్షోభాన్ని పెంచుతోందన్నారు. ఇండియా ఇప్పుడు మాట్లాడుతున్న ఆరోగ్య సేవలు, స్వచ్ఛత, తల్లీబిడ్డల మరణాల రేటు తగ్గింపు వంటి వాటిని సంపన్న దేశాలు ఎప్పుడో 100 ఏళ్ల క్రితం, ఆధునిక సర్జికల్ విధానాలేవీ అందుబాటులో లేనప్పుడే సాధించాయన్నారు. అది కూడా ఈవేళ భారత్ సాధిస్తున్న దాని కంటే ఎక్కువ విజయవంతంగా సాధించాయన్నారు. ఉద్యోగాల కల్పన కోసం బయటి నుంచి పెట్టుబడులను రప్పించాలని భారత్‌లో పాలకులు ఆరాటపడుతున్నారని, కానీ సరైన మురుగునీటి పారుదల వ్యవస్థ, పారిశుద్ధ్యం పట్టని పాలనా వ్యవస్థ, దోమలు, కాలుష్యం ఉంటే ఎవరు ఇక్కడికొచ్చి పెట్టుబడులు పెట్టాలనుకుంటారని హామర్ ప్రశ్నించారు. ఇవన్నీ ప్రభుత్వం చేయాల్సిన పనులేనని గుర్తుచేశారు. ప్రైవేటు పెట్టుబడులు, స్వేచ్ఛామార్కెట్లను ప్రోత్సహించే ముందు ప్రభుత్వం చేయాల్సిన పనులు సక్రమంగా చేయాలని స్పష్టం చేశారు. ఒక వ్యక్తి ఎంత సంపన్నుడైనా ఇతరులతో సంబంధం లేకుండా అన్ని పనులూ చేసుకోలేడని, ఆ వ్యక్తి జీవితంలోని అంశాలు సమాజాన్నీ ప్రభావితం చేస్తుంటాయని అన్నారు. అందువల్ల ఉమ్మడిగా చేసుకోవాల్సిన అంశాల మీద దృష్టి పెట్టటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ప్రజలకు కావలసిన ఉమ్మడి అవసరాలను నెరవేర్చేందుకు తాను చేయాల్సిన పనులు చేశాక ప్రభుత్వం మిగిలిన పనుల మీద దృష్టి పెట్టాలన్నారు. కానీ ఇండియాలో ఇందుకు విరుద్ధంగా ప్రభుత్వం తాను చేయల్సిన అసలు పనుల్ని వదిలేసి కొసరు పనుల మీద ఎక్కువ దృష్టి పెడుతోందన్నారు. ఈ వైఫల్యమే ఆరోగ్య రంగంలో సమస్యల్ని పెంచుతోందన్నారు. భారత్‌లో సెలవులు, అనధికార గైర్హాజరు పేరిట సగటున ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో 40 శాతం మంది వైద్యులు విధులకు దూరంగా ఉంటున్నారన్నారు. ప్రభుత్వరంగంలో డాక్టర్లు రోజుకి 39 నిమిషాలే రోగులను పరీక్షిస్తున్నారని, ఒక రోగితో మాట్లాడే సమయమూ తగ్గుతోందని అన్నారు. జర్మనీలో ఒక పేషెంట్‌కు డాక్టర్ 6 నిమిషాలు కేటాయిస్తుంటే, ఇండియాలో చూస్తే సరాసరిన ఆ సమయం 1 నిమిషం మాత్రమే ఉందన్నారు. కొన్ని సందర్భాల్లో కేవలం ఒక ప్రశ్నతోనే వైద్య చికిత్స ముగిస్తున్నారన్నారు. ప్రభుత్వ డాక్టర్‌కి.. సర్టిఫికెట్ లేకుండా గ్రామాల్లో వైద్యం చేసే వారికి.. నాటు వైద్యం చేసేవారికి మధ్య ప్రజలు పెద్ద తేడా చూడని పరిస్థితి భారత్‌లో నెలకొందన్నారు. ఇన్సూరెన్స్ ఆధారిత వైద్య సేవలు భారత్‌లో

ప్రభుత్వానికి భారంగా మారే అవకాశం ఉందని, ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయాలని, ఈ పోటీ వల్ల వైద్య చికిత్సల రేట్లు తగ్గే అవకాశముందని అన్నారు.

### హేమర్ వివరించిన మరికొన్ని అంశాలు:

- భారతదేశంలో ప్రజల ఆరోగ్య స్థాయి గత యాభై ఏళ్లలో గణనీయంగా మెరుగుపడింది గానీ, ఇందులో సర్కారు వారి ప్రజారోగ్య విధానం పాత్ర బహు స్వల్పం.
- ఉన్న వనరులేమిటో, తన సామర్థ్యం ఎంతో అంచనా



లేకుండా అన్నీ తానే చేయాలని ప్రభుత్వం ప్రయత్నించటం ఆరోగ్య రంగంలో ఓ పెద్ద సమస్య.
- ప్రజాధనాన్ని సద్వినియోగం కోసం అనుసరించాల్సిన మౌలిక సూత్రాల్ని ఆరోగ్య రంగంలో అరుదుగా మాత్రమే పాటిస్తున్నారు.
- ఈ సూత్రాల్ని సక్రమంగా పాటిస్తే, ప్రజారోగ్య ప్రణాళిక గాడిన పడుతుంది. ముఖ్యంగా, రెండు పరిణామాలు చోటు చేసుకుంటాయి.
- మొదటిది, రక్షిత మంచినీరు, పారిశుద్ధ్యం, దోమలు వంటివి నియంత్రించటం, అంటువ్యాధుల పర్యవేక్షణ, నియంత్రణ వంటి సాంప్రదాయ వ్యాధి నివారణ చర్యలు పటిష్టంగా జరుగుతాయి.
- రెండోది, మోయలేని ఆరోగ్య ఖర్చుల భారం నుండి ప్రజల్ని రక్షించటానికి సమగ్ర చర్యలు చేపట్టే అవకాశాలు మెరుగవుతాయి. ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యసేవలను గణనీయంగా బాగుచేయటానికి, ప్రైవేటు రంగంతో పోటీ పడేలా చేసి అంతిమంగా తక్కువ ఖర్చుతో మెరుగైన ప్రజారోగ్యాన్ని అందించటానికీ అవకాశాలు పెరుగుతాయి.

### పెరటి చెట్టు లోక్‌సత్తా, అంతర్జాతీయ నిపుణులూ చెబుతున్న అంశాలు చిట్టచివరి పౌరుని దాకా చేరాలి: జేపీ

మార్కెట్ ప్రభావానికి కుంగిపోకుండా మార్కెట్లో పోటీపడేలా దేశంలోని ప్రతి బిడ్డకూ, ప్రతి కుటుంబానికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యాలను అందించే శక్తి ప్రైవేటు రంగానికి ఉండదని, ఈ బాధ్యతను ప్రభుత్వమే చేపట్టాలని డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. స్వయంగానో, ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతోనో ప్రభుత్వమే పూర్తిగా ఈ రంగాల్లో జవాబుదారీగా ఉండాలన్నారు. కానీ ప్రభుత్వాలు వరుస వైఫల్యాల తర్వాత కూడా చేసిందే చేస్తూ మార్పు వస్తుందని ప్రజల్ని మభ్యపెడుతున్నాయి తప్ప.. విద్య, వైద్య ప్రమాణాలు పెంచేలా విధానాలలో మార్పుల్ని చేయటం లేదన్నారు. దీనివల్ల డబ్బు వృధా అవుతూ పేదరికం, వివక్ష అలాగే కొనసాగుతున్నాయన్నారు.

గవర్నెన్స్ ఇన్ యాక్షన్ సమావేశంలో ప్రారంభోపన్యాసం చేయటంతోపాటు ఆ తర్వాత కొన్ని ప్రశ్నలపైనా, అనంతరం మీడియాతోనూ జేపీ మాట్లాడారు.

మంచి విద్యకు పునాదిగా ఉండే పాఠశాల విద్యలో ఫలితాలను బేరీజు వేయటం లేదని జేపీ అన్నారు. పేదరికం నుండి బైటపడేయగల, వివక్ష లేకుండా ఎదిగే అవకాశాలను అందించగల విద్యాప్రమాణాలను పెంచకుండా తాత్కాలిక తాయిలాల్ని, ఉచితాల్ని పందేరం చేయటానికి ప్రభుత్వాలు మొగ్గు చూపుతున్నాయన్నారు. మన దేశం ఫార్మా రంగంలో ప్రపంచ ఖ్యాతి గడించిందని, హైదరాబాద్ నగరం చుట్టుపక్కలే తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఔషధాల్ని తయారు చేస్తున్నారని, ఇండియా నుంచి వెళ్లిన అనేకమంది వైద్యులు సంపన్న దేశాల్లోనూ గొప్ప గుర్తింపు పొందారని.. అయినా మనలో చాలామందికి మందులు, వైద్య సేవలు అందుబాటులో ఉండని దుస్థితి నెలకొందని అన్నారు. రోగమొస్తే ఒళ్లుతోపాటు ఇల్లు కూడా గుల్లవుతుందని పేద, మధ్యతరగతివారు వణికిపోతున్నారన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థికి చదువు అందించకపోవటం, చికిత్స ఇచ్చి బతికించే అవకాశమున్నా వైద్యసదుపాయాలు కల్పించకపోవడం అతిపెద్ద పాపాలన్నారు. పెరటి చెట్టులా ఎప్పటి నుంచో లోక్‌సత్తా చెబుతున్న విషయాలను, ఈవేళ అంతర్జాతీయ మేధావులు చెబుతున్న విషయాలనూ పట్టించుకోవాలని, నాణ్యమైన, మంచి ప్రమాణాల విద్య, ఆరోగ్యాలను అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం అమలు చేయాల్సిన విధానాలపై అట్టడుగు పౌరుని దాకా చర్చ జరగాలని, వాటిని సాధించుకునే కార్యాచరణలో వివిధ పార్టీల్లోని ఆలోచనాపరులు సహా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జేపీ కోరారు.

విద్య, వైద్య రంగాల ప్రస్తుత స్థితిని – మనకున్న వనరుల పరిధిలోనే తీసుకురాగల మార్పులను పోలుస్తూ ఆస్కి ఛైర్మన్ పద్మనాభయ్య మాట్లాడారు. సభికులు అడిగిన కొన్ని ప్రశ్నలపై స్పందించారు.

పలువురు విద్య, వైద్య రంగ ప్రముఖులు, ఔత్సాహికులు, ఎఫ్‌డీఆర్ అధ్యయన బృంద యువత తదితరులు 'గవర్నెన్స్ ఇన్ యాక్షన్' తొలి కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 'నాణ్యమైన విద్యనందించలేక తెలుగు మాధ్యమం ఓడు' అంటున్న ఆంధ్ర పాలకుడు

**బాగా డబ్బున్నవారి స్థాయిలోనివి, కొన్ని ట్రస్టులు, యాజమాన్యాల ప్రత్యేక శ్రద్ధ ఉన్న స్కూళ్లు మినహాయిస్తే చాలా ప్రైవేటు పాఠశాలల్లో ఇంగ్లీషు మాధ్యమం ఉన్నా ఎందుకు పిల్లలకు మంచి చదువు అందటం లేదు? అనే వాస్తవిక ఆలోచన చేస్తే చాలు.. అసలు సమస్య తెలుగు మాధ్యమం కాదని తేలిగ్గా అర్థమవుతుంది. మంచి ప్రమాణాల విద్య అంటే.. ప్రపంచంలో ఎవరితోనైనా పోటీపడి, ఎక్కడైనా ఉపాధిని పొందగల (ఇంగ్లీషు ప్రావీణ్యం కూడా ఇందులో భాగమే) సామర్థ్యాన్ని వికసింప చేసుకోవటం, పెంపొందించుకోవటం! తెలుగుకు అన్యాయం చేసినవాళ్లలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఒకరు. కానీ ఆయనకు సంబంధించి ఇక్కడ వేరే పార్శ్వం కూడా ఉంది. చంద్రబాబు మంచి ఇంగ్లీషు మాట్లాడలేరు. చంద్రబాబు ఇంగ్లీషుపై ఇటీవల ఆంధ్రప్రదేశ్ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి కూడా వ్యంగ్యాస్త్రాలు సంధించారు. బాబు ఆంగ్లం మీద అనేక జోకులు ఇప్పటికే ఉన్నాయి. 'వాట్ ఐయాం సేయింగ్ ఈజ్' వంటి ఆయన ఊతవాక్యాల మీద వ్యాసాలే వచ్చాయి. కానీ ఇప్పటికీ వంద రెండొందల పదాల్లో మాత్రమే ఆంగ్లం మాట్లాడే చంద్రబాబు.. ఏపీలో ముఖ్యమంత్రిగా, ప్రతిపక్షనేతగా, జాతీయ స్థాయిలో ప్రముఖ రాజకీయవేత్తగా, కొన్ని అంశాల్లో మంచి పాలనాదక్షుడిగా ఎలా పేరు తెచ్చుకోగలిగారు? దేశ, విదేశీ వాణిజ్య ప్రముఖులతో ముఖాముఖి సమావేశాల్లో, దావోస్ వంటి చోట్ల ప్రసంగాల్లో ఎలా తనదైన ముద్ర వేయగలిగారు?.. ఈ ప్రశ్నల్ని కాస్త ఇంగితజ్ఞానంతో ఆలోచించి ఉంటే, ఆంగ్ల ప్రావీణ్యానికున్న పరిమితి, నాణ్యమైన విద్య ఆవశ్యకత ఏమిటో ఏపీ ప్రభుత్వానికి, ప్రభుత్వ ఇంగ్లీషు మీడియం వాదనకు అడ్డగోలుగా మద్దతు లంకిచ్చుకున్నవారికీ అర్థమయ్యేది.**

2020 విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చదువులు పూర్తిగా ఇంగ్లీషు మాధ్యమంలోనే ఉంటాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. ప్రకటన దశ నుంచే ఇంగ్లీషు జోరు కనిపించేలా తెలుగు పత్రికల్లో కంటే ఘనంగా ఆంగ్ల మీడియాలో ఫుల్‌పేజీ యాడ్ ఇచ్చారు. తొలుత 6వ తరగతి వరకూ, ఆ తర్వాతి ఏడాది నుంచి క్రమంగా ఆపై తరగతులకు కూడా ఆంగ్లంలో నిర్బంధ బోధన ఉంటుందని వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తెలిపింది.


నాడు-నేడు పేరుతో గత పాలకుల కంటే తానెంతో మెరుగని చెప్పుకోవాలని ముఖ్యమంత్రి జగన్ తహతహలాడుతున్నారుగానీ.. తెలుగు మాధ్యమం విషయంలో ఆయన తీసుకున్న నిర్ణయం, నాడు ప్రత్యర్థి తెలుగుదేశం వారు చేసిన తప్పిదాన్ని కొనసాగించే రీతిలోనే ఉంది. గత పాలకులకంటే వేగంగా, ఎక్కువ తీవ్రతతో తెలుగును కుంగదీస్తున్నారు తాజా ముఖ్యమంత్రి. తెలుగు మాధ్యమాన్ని ఎత్తిపారేయాలనే ఆలోచనకు గతంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం శ్రీకారం చుడితే.. జగన్ ప్రభుత్వం దానికి ఆకారమిస్తోంది.

తెలుగుదేశం పార్టీ ప్రస్తుత జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తెలుగును వీలైనంత నిర్వీర్యం చేయటానికి ఉన్న అన్ని అవకాశాల్నీ వినియోగించుకున్నారు. తెలంగాణ ఉద్యమం 2009లో ఉధృతంగా మొదలయ్యాక లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ పలు సందర్భాల్లో అన్నారు: 'తెలంగాణలో అధికార కేంద్రీకరణ, అవినీతి పాలన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ఆజ్యం పోశాయి. 1956లో ఆంధ్రప్రదేశ్ అవతరణ సమయంలో నిర్ణయానికనుగుణంగా ఏర్పాటైన ప్రాంతీయ బోర్డుల్ని నిర్వీర్యం చేయకుండా నిధులు, అధికారాలతో బలోపేతం చేసి ఉంటే, జిల్లా ప్రభుత్వాలను ఏర్పాటు చేసి ఉంటే.. ప్రత్యేక రాష్ట్రం ఆలోచనే ప్రజల్లో కలిగేది కాదు. ప్రజల మధ్య బంధాన్ని పెంచేందుకు కనీసం మాతృభాషయిన తెలుగు భాషను పెంచి పోషించేందుకు కూడా సరైన ప్రయత్నం చేయలేదు. ఎన్.టి రామారావు ముఖ్యమంత్రి ఉన్నప్పుడు కొంతకాలం తెలుగు కోసం తపనపడ్డారు. పల్లెటూళ్లలో దృశ్య శ్రవణ బోధన వంటి ప్రయత్నాల్నీ చేశారు. వివిధ కారణాల వల్ల ఆ కృషి క్రమంగా మందగించింది. ఆయన తర్వాత కొందరు సామాజిక ఔత్సాహికులు తప్ప పాలకులు అసలు తెలుగును పట్టించుకోవటమే మానేశారు. భాష మన దేశాన్ని కలిపి ఉంచే బొద్దుతాడు, భాష ప్రాతిపదికన ఏర్పడిన తొలి రాష్ట్రం

ఆంధ్రప్రదేశ్, తెలుగు మాట్లాడేవారు ఉండే ప్రాంతం తెలంగాణ.. అనే సోయి, ఆత్మవిశ్వాసం ప్రజల్లో లేకుండా పోయేలా తెలుగును నిర్వీర్యం చేస్తూ వచ్చారు. తెలంగాణ ప్రజల్లో పరాయి భావన పెరగటానికి కేంద్రీకృత, అవినీతి పాలనకు తోడు తెలుగును నిర్లక్ష్యం చేయటం కూడా ఓ పెద్ద కారణం".. ఈ రకంగా పరిపాలన, రాజకీయం తీరు తెలంగాణ ప్రజల్లో పరాయి భావనను ఎలా పెంచిందో శ్రీకృష్ణ కమిటీకి ఇచ్చిన నివేదికలో కూడా జేపీ వివరంగా పేర్కొన్నారు.

తెలుగు పట్ల చంద్రబాబు వ్యతిరేకతకు కొన్ని ప్రత్యేక కారణాలు కూడా కనిపిస్తాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారి అధికారంలోకి వచ్చినప్పుడు చంద్రబాబు నాయుడుకి పార్టీలో తప్ప ప్రజల్లో పెద్ద పట్టు లేదు. రామారావుకి అన్యాయం చేసి చంద్రబాబు దొడ్డిదారిన అధికారంలోకి వచ్చారనే భావన ప్రజాస్వామ్యవాదుల్లోనే కాకుండా సామాన్య ప్రజల్లో కూడా ఉండేది. అందువల్ల ఎలాగైనా రామారావు ముద్రను చెరిపేసి తనదైన ముద్రను వేసుకోవటానికి చంద్రబాబు శాయశక్తులా ప్రయత్నించటం మొదలుపెట్టారు. ఆ క్రమంలో ఆయన తెలుగుకు కూడా ఎసరు పెట్టారు. ప్రపంచీకరణ వేగం కూడా ఆయనకు అనుకూలించింది.

ఒక పాలసీ మంచిదా, కాదా? పాశ్చాత్య దేశాల్లోని మంచి విధానాల్ని మన రాష్ట్ర పరిస్థితులకనుగుణంగా ఎలా వినియోగించుకోవటం?.. అనే ఆలోచన చేయకుండా గుడ్డిగా ఆంగ్లము, పాశ్చాత్యము వైపు చంద్రబాబు మొగ్గు పెంచుకుంటూ పోయారు. పేరు మార్చటం కుదరలేదు గానీ, లేకుంటే పార్టీకి కూడా తెలుగుదేశం పేరును తీసేసి చంద్రబాబు వేరే పేరు పెట్టేవారు. రాష్ట్ర విభజన జరిగాక కూడా అందుకు కారణమైన ఇతర అంశాలను నిర్లక్ష్యం చేసినట్లే, తెలుగును సుసంపన్నం చేసే కృషిని కూడా విస్మరించారు. పూర్తి ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్ని ఒక కేటగిరీగా ఏర్పాటు చేయటానికి పరిమితం కాకుండా, రాష్ట్రంలోని మొత్తం ప్రభుత్వ స్కూళ్లను ఆంగ్లీకరించేందుకు మునిసిపాలిటీల్లో పైలెట్ ప్రాజెక్టును చేపట్టారు. తెలుగును చంద్రబాబు పట్టించుకోలేదని ఆయన కుమారుడు, మాజీ మంత్రి లోకేష్ స్వయంగా ట్వీట్ చేసి మరీ ఒప్పుకున్నారు. ఇటీవల వైఎస్ జగన్ నిర్ణయాన్ని విమర్శించే క్రమంలో ఆయనీ ఒప్పుకోలు చేశారు. మేం ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెడతామంటే మీ సొంత పత్రికలో అన్ని విమర్శలు చేశారు, ఇప్పుడేమో మీరే తెలుగును ఎత్తేస్తున్నారు అంటూ లోకేష్ విమర్శించారు. ఆ తర్వాత తూచ్ అంటూ మళ్లీ తెలుగు మాధ్యమం కూడా ఉండాలని తండ్రితోపాటు తాను కూడా డిమాండ్ చేశారనుకోండి! తన గురించి స్వయంగా తానే చెప్పుకున్నట్లు.. చంద్రబాబు సీజనల్ పొలిటీషియన్. కాబట్టే తెలుగుపై తనకున్న వ్యతిరేకత పెద్దగా చర్చనీయాంశం కాకుండా జాగ్రత్త పడేవారు. అవసరమనుకుంటే నాలుగు ముక్కలు తెలుగు గురించి ఘనంగా మాట్లాడి అప్పటికి విమర్శల నుంచి తప్పించుకునేవారు. దీనికితోడు విదేశాలకెళ్లి నివాసముంటుండటం వల్ల తెలుగు మీద కొంత బెంగటిల్లి ప్రాధాన్యతనివ్వటం తప్పించి.. మాతృభాష గురించి తెలుగువారికి పెద్ద పట్టింపు, అవగాహన కలేకపోవడం వల్ల ఆయనకు ఈ విషయంలో పెద్ద సమస్యలు ఉత్పన్నం కాలేదు.




ఆ తర్వాత తాజాగా అధికారంలోకి వచ్చిన వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముసుగులో గుద్దులాట లేదంటూ తెలుగు మాధ్యమాన్నే ప్రభుత్వ పాఠశాలల నుంచి ఎత్తేస్తున్నట్లు ప్రకటించారు. తనకున్న భారీ మెజారిటీ, తన వ్యక్తిగత స్వభావం రీత్యా ఈ రకంగా నిర్ణయాలు ప్రకటించటం తన హక్కు, స్టయిలు అన్నట్లు ముఖ్యమంత్రి జగన్ తెలుగు విషయంలో కూడా వ్యవహరిస్తున్నారు. తెలుగుదేశంలో తెలుగు

అనే పదాన్ని, చంద్రబాబు విజన్ 2020ని మరపించేరీతిలో తన ప్రభుత్వ 2020 కార్యాచరణ ఉండాలని తాజా ముఖ్యమంత్రి భావిస్తున్నట్లు కనిపిస్తోంది. ఎన్‌టీఆర్‌ను రివర్స్ చేయాలని చంద్రబాబు ఆలోచిస్తే, మరింత మొరటుగా చంద్రబాబును, వీలుంటే ఎన్‌టీఆర్‌ను కూడా రివర్స్ చేసి తెలుగుదేశం ఆనవాళ్లు కూడా లేకుండా చేయాలని జగన్ ఆకాంక్షిస్తున్నారు. పనిలోపనిగా తెలుగుదేశంకు మద్దతుగా కనిపిస్తున్న జనసేన వ్యవస్థాపకుడు పవన్ కళ్యాణ్‌ను కూడా తూర్పారపడుతున్నారు. ఆయనకు మూడు పెళ్లిళ్లు, నలుగురైదుగురు పిల్లలు వంటి భాషతో కుమ్మేశారు. ఉప రాష్ట్రపతిగా ఉన్న మరో నాయుడుగారు వెంకయ్య నాయుడిని కూడా వేలెత్తి ప్రశ్నించారు. పార్టీలు, కులాలకు మాత్రమే ఈ గొడవ పరిమితమైతే, ఎలాగోలా పోతారు మనకెందుకు అని వదిలేయచ్చు. కానీ ఈ అంశం వారి వ్యక్తిగతానికి పరిమితం కాదు. లోతైన అంశాలు ఇందులో ఉన్నాయి. దీర్ఘకాలిక ప్రభావం చూపే ఓ అంశం పట్ల ఇలా సంకుచితంగా, తాత్కాలిక ధోరణితో, మితిమీరిన పక్షపాత ధోరణితో ముఖ్యమంత్రి జగన్ వ్యవహరించటాన్ని చర్చించాలి, ప్రశ్నించి తీరాలి.

తెలుగుపై ఆరోపణల విషయంలో చంద్రబాబు బృందం నైతికతను ప్రశ్నించవచ్చుగానీ.. ఆ తప్పిదం కేవలం చంద్రబాబుకే పరిమితం కాదని కూడా మనం గుర్తించాలి. 1956లో రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచీ తెలుగు విషయంలో వైఫల్యాన్ని అంగీకరించాలి.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన దగ్గర్నుంచి, ముఖ్యంగా ఎన్‌టీఆర్ హయాం నుంచీ పాలకులు తెలుగును నిర్లక్ష్యం చేస్తూ వచ్చారు. తెలుగుకు తెగులు, టెల్గు అనే వ్యంగ్య పద ప్రయోగాలు దశాబ్దాల క్రితం నుంచే తెలుగునాట ప్రాచుర్యంలోకి వచ్చాయి. ప్రపంచ విద్యా, ఉపాధి రంగాల్లో వస్తున్న ఆర్థిక, సాంకేతిక మార్పుల్ని గుర్తించి స్పందించటంలో, తెలుగు భాషకున్న సామర్థ్యాన్ని వాటికి తగ్గట్టు మలిచే ముందుచూపును ప్రదర్శించటంలో పాలకులు విఫలమయ్యారు. అణగారిన, పేద ప్రజలకు మంచి చదువు అందితే ఎక్కడ బాగుపడిపోతారోనన్న కుట్రపూరిత ధోరణితో ప్రభుత్వమే స్వచ్ఛందంగా మంచి చదువు అందకుండా చేస్తూ, ఆ క్రమంలో తెలుగును కూడా నాశనం చేస్తూ వచ్చింది. ప్రభుత్వమే ఇంగ్లీషును పరోక్షంగా ప్రోత్సహిస్తూండటంతో.. విద్యలో విజయానికి నిర్వచనాన్ని ఇంగ్లీషు మాధ్యమానికనుగుణంగా మార్చి వినియోగించుకోవటంలో ప్రైవేటు విద్యావ్యాపారులు పోటీపడి విజయం సాధించారు. వైద్యరంగంలో కూడా ఇదే రకంగా ప్రభుత్వ వైఫల్యాల్ని అడ్డగోలుగా ఉపయోగించుకుంటూ ప్రజల సొమ్ముల్ని ప్రైవేటు, కార్పొరేట్ శక్తులు పిండుకుంటున్నాయి. ఫలితంగా.. వలస పాలన కాలం నుంచి మొదలైన ఇంగ్లీషు మోజు ఈవేళ తెలుగునాట పరాకాష్ఠకు చేరుకుంది.

తలో దెబ్బకు తెలుగు కునారిల్లిన ఇటువంటి పరిస్థితుల్లో పగ్గాలు చేపట్టిన వైఎస్ జగన్‌కు.. తెలుగుకు పూర్వవైభవం తేవటం పెద్ద సవాలేననటంలో సందేహం లేదు. కానీ అసాధ్యం కాదు, పైగా అవసరంగా నెరవేర్చాల్సిన బాధ్యత కూడా! తన స్వభావం, తనకున్న ప్రజాతీర్పుతో అనేక పెద్ద నిర్ణయాల్ని ఎవరి ఇష్టాఇష్టాలతో ప్రమేయం లేకుండా అలవోకగా తీసుకున్న ముఖ్యమంత్రికి.. ప్రజలకు పనికొచ్చే ఒక అంశం మీద బలమైన నిర్ణయం తీసుకోవటం అసాధ్యమేమీ కాదు. స్థానికంగా ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, పోలవరంలో రివర్స్ టెండరింగ్ వంటి అంశాల్ని అలవోకగా ప్రకటించిన ముఖ్యమంత్రికి రాష్ట్ర భాష మాతృభాష తెలుగును పరిరక్షించే చర్యలు తీసుకోవటం అసాధ్యమా?.. కావలసిందల్లా కాస్త రాజకీయ సంకల్పం, దూరదృష్టి. ప్రజల బలహీనతల్లో తెంపరితనాన్ని ఆయుధంగా ఉపయోగించుకునేవాడు కాదు.. ప్రజల్లోని మంచి లక్షణాలను ప్రేరేపించి సరైన దిశలోకి మళ్లించేవాడు నాయకుడంటే.

## నవంబర్ 1న రాష్ట్రావతరణ దినోత్సవాల్ని నిర్వహించి మరీ..

కానీ నాయకత్వ లక్షణాలకు భిన్నంగా తెలుగు విషయంలో జగన్ వ్యవహరిస్తున్నారు. నవంబర్ 1వ తేదీన నూతన ఆంధ్రప్రదేశ్ అవతరణను జరిపిన ముఖ్యమంత్రి.. ఆ తేదీ భాషాప్రయుక్త రాష్ట్రాలను ఏర్పాటు చేసిన తేదీ అని, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మరో ఏడు రాష్ట్రాలు ఆరోజున భాష ప్రాతిపదికన ఏర్పడ్డాయని తెలియదనట్లు వ్యవహరిస్తున్నారు. అదేమంటే, మీ పిల్లలు ఏ మాధ్యమంలో చదువుతున్నారు? అని ప్రశ్నిస్తున్నారు. ముఖ్యమంత్రి అంటున్న మాటనే విద్యాశాఖా మంత్రి ఆదిమూలపు సురేష్ కూడా అడుగుతున్నారు. తెలుగు పట్ల గతంలో చంద్రబాబు వైఖరిని దునుమాడిన పౌర ప్రముఖులు, ఆలోచనాపరులు.. తెలుగుకు పర్యాయపదమే ఆంధ్ర అని తెలంగాణ ఉద్యమ సమయంలో వాదించిన పెద్దమనుషులు కూడా ఇదేతీరుగా మాట్లాడుతున్నారు.

## సెంటిమెంట్ కాదు.. మాతృభాషకు-నాణ్యమైన విద్యాబోధనకు ఉన్న అవినాభావ సంబంధమే అసలు అంశం

ఇక్కడ విషయం కేవలం అమ్మభాష అనే సెంటిమెంట్ కాదు. మాతృభాషకు, నాణ్యమైన పాఠశాల విద్యాబోధనకు ఉన్న అవినాభావ సంబంధం అసలు సమస్య.

ప్రాథమిక స్థాయిలో అమ్మభాషలో విద్యాబోధన వల్ల విషయ పరిజ్ఞానంతోపాటు భావోద్వేగాలను హేతుబద్ధతతో అనుసంధానం చేసుకునే శక్తి, వ్యక్తిత్వం, సృజనాత్మకత కూడా

పెరుగుతాయని యునెస్కో వంటి అంతర్జాతీయ సంస్థల శాస్త్రీయ మార్గదర్శకాలు, మనస్తత్వ శాస్త్రవేత్తల సూత్రీకరణలు తేటతెల్లం చేస్తున్నాయి. ఇంట్లో మాట్లాడుకునే భాషలో విద్య నేర్చుకోవటం, ఇంటాబయటా మాట్లాడుకునే భాష చుట్టూ అల్లుకున్న సంస్కృతీ సంప్రదాయాలు, పండుగల చుట్టూ పదాల్ని, పాఠాల్ని అన్వయించుకుంటూ సమాజంతో సంబంధాల్ని ఏర్పరచుకోవటం వల్ల మంచి విద్యకు, వ్యక్తిత్వ వికాసానికి బలమైన పునాదులు ఏర్పడతాయి. ప్రభుత్వం మంచి విద్యను ఎలా అందించాలో ఆలోచించకుండా మంచి విద్యను అందించటానికి ఉపకరణంగా ఉండే మాధ్యమాన్ని తప్పుపట్టటం.. ఆడ లేక మద్దెల ఓడు అన్న చందంగానే ఉంటుంది.

## సాధారణ ప్రజల్లాగే మీరూ చేతులెత్తేస్తే పదవుల్లో ఉండటమెందుకిక?

విద్యావ్యవస్థను ప్రక్షాళనను వ్యక్తులుగా చేయలేక తమ పిల్లల్ని కొంతైనా మెరుగైన చదువు వస్తుందన్న ఆశతో సాధారణ, మధ్యతరగతి ప్రజలు ఇంగ్లీషు మీడియం ఉన్న స్కూళ్లకు పంపుతున్నారు. అందులోనూ ప్రైవేటు స్కూళ్లకు పంపుతున్నారు. 'మీ పిల్లల్ని ఏ మీడియంలో చదివిస్తున్నారు?' అని వైఎస్ జగన్, మంత్రులు ప్రశ్నించినవాళ్లు తమ పిల్లల్ని కార్పొరేట్, ఇంటర్నేషనల్ స్కూళ్లలోనే చదివిస్తుండవచ్చు, కానీ వాళ్లలో కూడా ఎక్కువమంది ప్రభుత్వ స్కూళ్లలో తెలుగు మీడియంలో చదువులు బాగా ఉంటే అక్కడే చదివించటానికి మొగ్గు చూపరా? వ్యక్తులుగా చేయలేని పనిని చేయటానికే ప్రభుత్వాన్ని ఎన్నుకున్నది. మీరు చేయటం లేదు కాబట్టి మేమూ చేయం అంటే.. ఆకాడికి ముఖ్యమంత్రి, విద్యామంత్రి పదవుల్లో ఉండటం ఎందుకు? అవినీతివ్యతిరేక పోరాటం చేసేవారిని.. మీరు ఎప్పుడూ లంచాలివ్వలేదా అని రీతిలో అడిగే పాలకుల్ని ఏమనాలి? ప్రజలు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదవకుండా ప్రైవేటు స్కూళ్లలోకి పంపుతున్నది ఇంగ్లీషు మీడియం లేకపోవటం వల్ల అన్నది పైకి కనిపించే కారణమే. దాని వెనుక అసలు విషయం– చదువుల్లో నాణ్యత లేకపోవటం.

## చాలా ఇంగ్లీషు మీడియం ప్రైవేటు స్కూళ్లలో కూడా చదువేమీ గొప్పగా లేదు

వాస్తవానికి చాలా ప్రైవేటు స్కూళ్లలో కూడా చదువు గొప్పగా ఏమీ రావటం లేదు. వైఎస్ జగన్, చంద్రబాబు నాయుడు, వెంకయ్య నాయుడు, పవన్ కళ్యాణ్ లాంటి వారి పిల్లలు, మనవళ్లు, మనవరాళ్లు చదివే పెద్ద స్కూళ్లలో చదువులు బాగానే ఉంటాయి. అలాంటి అవకాశాల్ని అందుకునే శక్తి మన ప్రజల్లో నూటికి పది, పదిహేను మందికే ఉంటుంది. మిగిలినవాటిలో పలు ప్రైవేటు స్కూళ్లలో చదువు అధ్వాన్నంగా నాసిరకంగా ఉంటుంది. ప్రభుత్వ, ప్రైవేటు తేడా లేకుండా చాలా స్కూళ్లలో మంచి చదువు అందటం లేదని 'అసర్' వరుస సర్వేలతోపాటు ఏపీ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం చేయించిన సర్వేలు కూడా వెల్లడిస్తున్నాయి.

## విజన్ డాక్యుమెంట్-2029లోనే పేర్కొన్న ఏపీ గత ప్రభుత్వం

ఏటా వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నట్టు లెక్కలు చూపుతున్నా.. ఆంధ్రప్రదేశ్‌లో విద్యాప్రమాణాలు తీసికట్టుగా ఉన్నాయని ఏపీ గత ప్రభుత్వం రూపొందించిన విజన్– 2029 డాక్యుమెంట్ తెలిపింది.

"ప్రధానంగా పాఠశాల స్థాయిలో విద్యాప్రమాణాలు తీసికట్టుగా ఉన్నాయి. మూడు, ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఒకటో తరగతి పుస్తకం కూడా చదవలేని స్థితిలో ఉన్నారు. ఇలా రాష్ట్రంలో 37 శాతం మంది ఉన్నారు. కర్నూలు, కృష్ణా జిల్లాల్లో ఒకటో తరగతి పుస్తకం చదవలేని విద్యార్థులు ఏకంగా 49 శాతం చొప్పున ఉన్నారు. ఆ తర్వాత గుంటూరు జిల్లాలో 44 శాతం మంది, విజయనగరం జిల్లాలో 42 శాతం మంది ఉన్నారు. వీరంతా మూడు, ఐదు తరగతులు చదువుతున్నవారే" అని డాక్యుమెంట్‌లో పేర్కొన్నారు.

ఇటీవల ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా ఆధ్వర్యంలో ఏపీలో చేసిన 'విద్యాయాత్ర'లో, అంతకుముందు లోక్‌సత్తా జేపీ రాష్ట్రంలో చేసిన సురాజ్య యాత్రలో కూడా ఇవే అంశాలు నిగ్గుతేలాయి. మాస్ కాపీయింగ్ లేకపోతే ర్యాంకులు, మార్కులు కూడా హుళక్కి అని ఈ సర్వేల్ని బట్టి వెల్లడవుతుంది. కానీ ప్రైవేటు పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియంలో చదువు చెప్పటం, ఏదోకరకంగా మార్కులు, ర్యాంకులు బాగా రావటం తల్లిదండ్రుల్ని ఆకర్షిస్తోంది.

## జబ్బు ఒక చోట ఉంటే, చికిత్స మరో చోట చేస్తున్నారు

కాబట్టి.. మంచి ప్రమాణాల చదువును అందిస్తూ, విద్యలో సక్సెస్‌కి నిర్వచనాన్ని మార్చి చూపిస్తే మాధ్యమంతో పనిలేకుండా ప్రజలు ప్రభుత్వ స్కూళ్లలోకి వచ్చి చేరతారు. ఇది పూర్తిగా ప్రభుత్వం చేయగలిగిన పని. చేయాల్సిన పని కూడా. జబ్బు ఒక చోట ఉంటే, చికిత్సను ఇంకో చోట చేస్తున్న చేతగాని వైద్యునిలా వైఎస్ జగన్ వ్యవహరిస్తున్నారు. భవిష్యత్తులోనైనా విద్యాప్రమాణాలతో తెలుగు మాధ్యమానికి ఆదరణ పెరిగి తెలుగు నిలదొక్కుకునే అవకాశాలు లేకుండా తెలుగును తుంచేసే నిర్ణయం తీసుకున్నారు. మాతృభాషలో చదువుకోవటం మెరుగైన విద్యకు, విద్య లక్ష్యాల్లో ఒకటైన వ్యక్తిత్వ వికాసానికి, సామరస్య సమాజ నిర్మాణానికి కూడా దోహదం చేస్తుందని విశ్వసనీయ అధ్యయనాలతోపాటు నూతన జాతీయ విద్యావిధానం ముసాయిదా స్పష్టంగా తెలియజెప్పింది. పైగా తెలుగు కొత్తదనాన్ని, కొత్తపదాల్ని ఇముడ్చుకోలేని పనికిమాలిన భాష కాదు. జవం, జీవం, అందం, వడి, రీవి, జాతీయాలు మెండుగా ఉండి కొత్తకు నిండుగా ఆహ్వానం పలికే అద్భుత అజంత భాష.

వలసపాలకులు సైతం కీర్తించిన భాష. వీటన్నిటినీ పట్టించుకోకుండా తన నిర్ణయాన్ని విమర్శించే వారిని ముఖ్యమంత్రి ఎగతాళి చేస్తున్నారు.

**తెలుగును పెంచుతున్న పత్రికల్నీ ఎకసెక్కాలాడుతున్నారు**

తెలుగును పంచేందుకు, పెంచేందుకు కృషి చేస్తున్న పత్రికలపై కూడా ముఖ్యమంత్రి ఎకసెక్కాలాడుతున్నారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి వంటి పత్రికల ద్వారా తెలుగు భాషాసంపదను పెంచుకున్నవారిలో, భావాల్ని వికసింప చేసుకున్నవారిలో ఈ రచయిత కూడా ఒకరు. ముఖ్యంగా ఈనాడు పత్రిక చేసినది చిన్న కృషి కాదు. బూదరాజు రాధాకృష్ణ గారి లాంటి వారు ఎంతో శ్రమ తీసుకుని, కొత్త పదాల్ని, పదబంధాల్ని, పదకోశాల్ని సృష్టించి తెలుగును సజీవంగా, సతత హరితంగా ఉంచే ప్రయత్నం చేశారు. ఆ కృషి జరుగుతున్నప్పుడు ప్రస్తుత ఏపీ ముఖ్యమంత్రికి వార్తాపత్రిక




చదవటం కూడా తెలిసుండదేమో! ఇటీవలి సంవత్సరాలలో ఈనాడు సంస్థ యాజమాన్యమే 'తెలుగు వెలుగు' పేరుతో ప్రత్యేకించి తెలుగు కోసం ఓ పత్రికను తెస్తున్నారు. పిల్లల్లో తెలుగు భాష ద్వారా సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు 'బాల భారతం' అనే మరో పత్రికను తెస్తున్నారు. వీటి ప్రభావం కూడా ముఖ్యమంత్రికి తెలిసి ఉండకపోవచ్చు. పాఠశాలల్లో 1వ తరగతి నుంచి పూర్తిగా ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలన్న ఆలోచన వెనుక ఒక ఏకపక్ష అభిప్రాయంతోపాటు విషయం పట్ల అవగాహనాలోపం కూడా కనిపిస్తోంది. కాస్త గత చరిత్రను, శాస్త్రీయ విశ్లేషణల్ని, ప్రపంచ దేశాల అనుభవాలను తెలుసుకుని, అనుభవజ్ఞుల మాటల్ని ఆలకించి, రాబోయే తరాల వారికి జవాబుదారీగా ఉండాలన్న ముందుచూపుతో వ్యవహరించి నిర్ణయాలు తీసుకుంటే.. ఇలాంటి తప్పుడు నిర్ణయాలు, ఇంత బాధ్యతారహిత ఆరోపణలు, బుకాయింపులు ఉండవు.

**సంపన్నులు కూడా ముందు విద్యాప్రమాణాల్ని చూసుకున్నాకే ఆంగ్ల మాధ్యమం గురించి ఆలోచిస్తున్నారు**

చదువును బాగు చేయకుండా ఇంగ్లీషు మాధ్యమంలోనూ చదువు రాదు. బాగు చేస్తే తెలుగు మాధ్యమంలోనూ పిల్లలు ఎగబడి చదువుతారు. బాగా వైద్యం చేసే డాక్టర్ దగ్గరికి కులం, మతం చూడకుండా పేషెంట్లు వస్తారు. డబ్బున్నవాళ్లు కూడా మంచి వైద్యం అందుతుంటే ప్రభుత్వాస్పత్రులకు వెళ్తున్న ఉదాహరణలు కనిపిస్తున్నాయి. అలాగే మంచి బోధన ఉందంటే, ప్రభుత్వ స్కూళ్లు ఏ మీడియంలో ఉన్నా ప్రజలు వస్తారు. సంపన్నులు కూడా కేవలం ఇంగ్లీషు మీడియం స్కూళ్లు గదా అని తమ పిల్లల్ని చేర్చటం లేదు. మంచి ప్రమాణాల విద్య అందుతోందా లేదా అన్నదే వారి మొదటి ప్రాధాన్యత కూడా. ఆ తర్వాతే ఇంగ్లీషు మీడియం గురించిన ఆలోచన. ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో ఆంగ్ల మాధ్యమమే ప్రధానంగా ఉండటంతో అదసలు చర్చనీయాంశం కూడా కావటం లేదు. వైఎస్ జగన్, చంద్రబాబు లాంటి వాళ్లు తమ పిల్లల్ని బాగా చదువు చెప్పని ఆంగ్ల మాధ్యమం స్కూలుకు పంపుతారా? డబ్బున్నవారిని అనుకరించటమే అభివృద్ధి అనుకుంటున్న అణగారిన వర్గాలవారు, అగ్రకులాల్లోని పేదలు ఇంగ్లీషును మాత్రం తీసుకుని, విద్యాప్రమాణాల అంశాన్ని విస్మరిస్తున్నారు. విద్యాప్రమాణాల గురించి ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు మాట్లాడకపోవటం, ఆ డిమాండ్ రాజకీయానికి కేంద్రబిందువు కాకపోవటం, కుల వివక్ష ఇంకా సమాజంలో బలంగా ఉండటం వల్ల.. ఈ అవగాహనారాహిత్యం నిర్నిరోధంగా పేద, బలహీన వర్గాల్లో కొనసాగుతోంది.

**పలు ఇంగ్లీషు మీడియం ప్రైవేటు స్కూళ్లలో కూడా మంచి చదువెందుకు అందటం లేదు? అన్న వాస్తవిక ఆలోచన చేస్తే చాలు..**

బాగా డబ్బులున్నవారి స్థాయి స్కూళ్లు, కొన్ని ట్రస్టులు, యాజమాన్యాల ప్రత్యేక శ్రద్ధ ఉన్న స్కూళ్లు మినహాయిస్తే చాలా ప్రైవేటు స్కూళ్లలో ఇంగ్లీషు మాధ్యమం ఉన్నా రాష్ట్రంలోని పిల్లలకు మంచి చదువు ఎందుకు అందటం లేదు? అనే వాస్తవిక ఆలోచన చేస్తే చాలు.. అసలు సమస్య తెలుగు మాధ్యమం కాదు అని తేలిగ్గా అర్థమవుతుంది. మంచి ప్రమాణాల విద్య అంటే.. ప్రపంచంలో ఎవరితోనైనా పోటీపడి, ఎక్కడైనా ఉపాధిని పొందగల (ఇంగ్లీషు ప్రావీణ్యం కూడా ఇందులో భాగమే) సామర్థ్యాన్ని వికసింప చేసుకోవటం, పెంపొందించుకోవటం.

**చంద్రబాబు ఉదాహరణ**

చంద్రబాబు ఇంగ్లీషుపై ఇటీవల ఆంధ్రప్రదేశ్ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. నిజమే! చంద్రబాబు మంచి ఇంగ్లీషు మాట్లాడలేరు. ఆయన ఆంగ్లం మీద

అనేక జోకులు ఇప్పటికే ఉన్నాయి. 'వాట్ ఐయాం సేయింగ్ ఈజ్' వంటి ఆయన ఊతవాక్యాల మీద వ్యాసాలే వచ్చాయి. కానీ ఇప్పటికీ వంద రెండొందల పదాల్లో మాత్రమే ఆంగ్లం మాట్లాడే చంద్రబాబు.. ఏపీలో ముఖ్యమంత్రిగా, ప్రతిపక్షనేతగా, జాతీయ స్థాయిలో ప్రముఖ రాజకీయవేత్తగా, కొన్ని అంశాల్లో మంచి పాలనాదక్షుడిగా ఎలా పేరు తెచ్చుకోగలిగారు? దేశ, విదేశీ వాణిజ్య ప్రముఖులతో ముఖాముఖి సమావేశాల్లో, దావోస్ వంటి చోట్ల ప్రసంగాల్లో ఎలా తనదైన ముద్ర వేయగలిగారు?.. ఈ ప్రశ్నల్ని కాస్త ఇంగితజ్ఞానంతో ఆలోచించి ఉంటే, ఆంగ్ల ప్రావీణ్యానికున్న పరిమితి, నాణ్యమైన విద్య ఆవశ్యకత ఏమిటో ఏపీ ప్రభుత్వానికి, ప్రభుత్వ ఇంగ్లీషు మీడియం వాదనకు అడ్డగోలుగా మద్దతు లంకిచ్చుకున్నవారికీ అర్థమయ్యేది.

## నిరక్షరాస్యత, డ్రాపవుట్ల సమస్యకు కూడా తెలుగు మాధ్యమంలో నాణ్యమైన చదువులే పరిష్కారం

తెలుగునాట నిరక్షరాస్యత కూడా పెద్దసంఖ్యలోనే ఉంది. అక్షరాస్యతను పెంచేందుకు బోలెడు ఖర్చు చేస్తున్నా ఇంకా కోటీ 35 లక్షలమందికి కనీస అక్షర జ్ఞానం లేదని ఏపీ ప్రభుత్వ విజన్ డాక్యుమెంట్-2029 పేర్కొంది. నిరక్షరాస్యులు ఎక్కువగా కర్నూలు జిల్లా (13.44 లక్షల మంది), గుంటూరు (13.38 లక్షలు), తూర్పు గోదావరి (13.15 లక్షలు) జిల్లాల్లో ఉన్నారని, వీరిలో అత్యధికులు 15 ఏళ్లు పైబడినవారేని చెప్పింది (సాక్షర భారత్ కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వం సేకరించిన వివరాలు ఆధారంగా విజన్ డాక్యుమెంట్ ఈ అంశాల్ని విశ్లేషించింది). తెలుగు మీడియంలో నాణ్యమైన చదువులు అందించటమే ఈ సమస్యకు కూడా పరిష్కారం. ప్రాథమికోన్నతంలో డ్రాపవుట్ల సమస్యకు కూడా ఇదే మంచి పరిష్కారం. వైఫల్యాల్ని సరిదిద్దే ప్రయత్నం చేయకుండా కాడి పారేస్తూ తెలుగు మీడియాన్ని ప్రభుత్వమే ఎత్తివేయటం మాతృభాష శక్తిని వికసింపచేయటంలో తన చేతగానితనాన్ని ప్రభుత్వం తానే ఒప్పుకోవటమవుతుంది.

## ఒక సబ్జెక్టుగా తెలుగుంటే చాలనే వాదన ఇంగ్లీషుకు వర్తించదా?

ఇంగ్లీషు చదువులు వద్దని ఎవరూ అనరు. భవిష్యత్తులో ఊపందుకోనున్న 4.0 పారిశ్రామిక విప్లవంలో ఉపాధి పరంగా ఇంగ్లీషు కీలకావసరం అన్న ముఖ్యమంత్రి మాటల్ని ఎవరూ కాదనలేరు. టెక్నాలజీలో ఉపాధి పరంగా ఆంగ్ల భాష ప్రాధాన్యత గణనీయంగానే ఉంటుంది. కానీ ఆంగ్ల ప్రావీణ్యానికి, ఆంగ్ల మాధ్యమానికి సంబంధం లేదు, మాతృభాషలో తొలి దశ విద్యాభ్యాసానికి, నాణ్యమైన విద్యకు మాత్రం సంబంధం ఉంది. కచ్చితంగా ఇంగ్లీషును కూడా ఒక సబ్జెక్టుగా నేర్చుకోవాలి కానీ, మాధ్యమంగా తెలుగు ఉంటే ఇంగ్లీషు రాదని, తెలుగు మాధ్యమంలో చదువుకోవటం వల్లే అణగారిన, పేద వర్గాల ప్రజలు నష్టపోతున్నారని చెప్పటం పూర్తిగా వారిని మోసం చేయటమే, మాతృభాష భవిష్యత్తుతో చెలగాటమాడటమే. చంద్రబాబు తెలుగు వ్యతిరేకధోరణిని తీవ్రంగా విమర్శించి, ఇప్పుడు తెలుగు మీడియం ఎత్తివేయాలన్న జగన్ నిర్ణయాన్ని సమర్థిస్తూ తెలుగును ఒక సబ్జెక్టుగా బోధిస్తే చాలని సన్నాయి నొక్కలు నొక్కుతున్న పక్షపాత ఆలోచనాపరులు.. అదే సూత్రాన్ని ఇంగ్లీషుకు ఎందుకు అన్వయించాలనుకోవటం లేదు? ఒక సబ్జెక్టుగా ఉన్నా తెలుగుకు ధోకా లేనప్పుడు.. ఇంగ్లీషును అనర్గళంగా మాట్లాడటానికి, అర్థం చేసుకోవటానికి ఒక సబ్జెక్టుగా ఉంటే చాలదా?

## విదేశాలకు వెళ్లేవారికి కూడా

'తెలుగు మాధ్యమంలో నాణ్యమైన చదువు + ఇంగ్లీషు లాంగ్వేజి' ఫార్ములా భేషుగ్గా సరిపోతుంది. డబ్బున్నవాళ్ళ, ఏదోకరకంగా కాస్త మంచి చదువు వచ్చిన తల్లిదండ్రులున్న కొద్దిశాతం మంది పిల్లల్ని మినహాయిస్తే అత్యధిక శాతం పిల్లలు 'సరైన చదువు అందే ఏర్పాటు లేక' నష్టపోతున్నారు తప్ప, తెలుగు మాధ్యమం వల్ల కాదు. ఇంగ్లీషు మీడియం ద్వారానో, మరోరూపంలోనో పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో ఏదోకరూపంలో చదివేలా చేయటం, ప్రైవేటు పాఠశాలల వైపు మళ్లకుండా చేయటం తప్ప వారికి మంచి ప్రమాణాల చదువులు అందించే బాధ్యతను మేం పట్టించుకోం అంటే.. అది తీవ్ర నేరపూరిత పాలనే అవుతుంది. ఇప్పుడున్న రీతిలోనే, అధ్వాన్న విద్యనందించటంలోనే ప్రైవేటు రంగంతో పోటీపడి ప్రభుత్వ స్కూళ్లను కాపాడతారన్న మాట! చదువు సరిగా లేనప్పుడు ఏ స్కూలయితేనేం?.. క్షమార్హం కాని ఈ నేరం విషయంలో గత ప్రభుత్వాల్లాగే జగన్ ప్రభుత్వం కూడా వ్యవహరిస్తోంది. పైగా ఏపీలో చదువుకున్నవాళ్లలో అత్యధికులు తెలుగు రాష్ట్రాల్లోనే ఉండే అవకాశాలు ఎక్కువ. ఇతర రాష్ట్రాలకో, విదేశాలకో వెళ్లేవారికి కూడా నాణ్యమైన విద్యతోపాటు ఒక సబ్జెక్టుగా ఇంగ్లీషును సరిగా నేర్చుకుంటే లింక్ లాంగ్వేజ్‌గా సరిపోతుంది. త్రిభాషా సూత్రంలో భాగంగా హిందీయో, మరోటో కూడా జోడిస్తే మరీ మంచిది.

## బొత్స, పుష్పశ్రీవాణిల వ్యాఖ్యలకీ ఇదే సమాధానం

ఇంగ్లీషు మాధ్యమ చదువు లేకపోవటం వల్ల మూడు సార్లు మంత్రిగా పనిచేసినా పాలనలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నానని ఏపీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి, మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. మంత్రివర్యులారా! మీకు ఇంగ్లీషు రాకపోవటానికి తెలుగు మాధ్యమం కారణం కాదు. నాణ్యమైన విద్యను, అందులో భాగంగా ఆంగ్ల సబ్జెక్టును సరిగా నేర్చుకోకపోవటం. స్పోకెన్ ఇంగ్లీషు శిక్షణ లేకపోవటం. ఇంగ్లీషు మాధ్యమం ఉండి ఉంటే మీకు అదనంగా సబ్జెక్టు

పరిజ్ఞానం వచ్చి ఉండేదని గ్యారంటీ ఏమీ లేదు. రాజును మించిన రాజభక్తిని ప్రదర్శించి ఏదో లబ్ధి పొందాలనే యావ లేకుండా.. ఇంగ్లీషు రాకపోయినా, మంత్రి కాగలిగే సామర్థ్యం మీకు సమకూరటానికి తెలుగు మాధ్యమంలో చదువుకోవటమే కారణమనే సానుకూల ఆలోచన చేసి ఉంటే మీకు విషయం ఇంకా బాగా అర్థమై ఉండేది. బొత్సగారూ, మరోమాట. మీకు విధి నిర్వహణలో ఆంగ్ల పరిజ్ఞానం లేకపోవటం ఇబ్బందిగా మారుతుంటే, ఎందుకు తెలుగును పాలనాభాషగా మార్చేందుకు మూడుసార్లు మంత్రిగా ఉండి కూడా ప్రయత్నం చేయలేదు? పాఠశాలల విద్యను, ఆంగ్లాన్ని బాగా బోధించే పద్ధతుల్ని మెరుగుపరిచేందుకు ఎందుకు ప్రయత్నించలేదు? మాతృభాషని, ఆంగ్ల పరిజ్ఞాన బోధనని రెంటిలోని వైఫల్యాల్నీ మీలాంటి వాళ్లు చూస్తూ మౌనంగా ఊరుకోవటం వల్లే ఈవేళ చేయని నేరానికి తెలుగు భాష శిక్ష అనుభవిస్తోంది. పొరుగు రాష్ట్రాల్లో, ఇతర దేశాల్లో కూడా తెలుగు మీడియం చదువులున్నాయన్న ఇంగితం కూడా లేకుండా మాట్లాడేస్తున్నారు.

## తర్జుమా సాంకేతికత, యంత్రాల వినియోగం వల్ల ఏ భాషయినా ఒకటే అవుతుంది

రాబోయే కొన్నేళ్లలో ప్రజల్లో చైతన్యం వచ్చి, పరిస్థితుల ప్రభావం వల్లో విద్యలో సక్సెస్‌కి నిర్వచనం మారి, విద్యాప్రమాణాలు కొంత మెరుగుపడవచ్చు. దానికి ఇంగ్లీషు మాధ్యమం కారణం కాదు అని అర్థమైనా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. కాబట్టి, తెలుగు భాష పట్ల తాను సరిదిద్దలేని తప్పిదానికి పాల్పడకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విజ్ఞతతో వ్యవహరించటం అవసరం. విద్యలో నాణ్యత పెంచటానికి మాతృభాషలో ప్రాథమిక విద్య ఒక ప్రాథమిక సూత్రం. ఆంగ్లాన్నే రాబోయే కాలంలో మాతృభాషగా, ఆంధ్రప్రదేశ్‌ను ఆంగ్లప్రదేశ్‌గా చేయాల్సినంత పనికిమాలిన భాష కాదు తెలుగు! పాలనలో తెలుగు వినియోగాన్ని పెంచటం, ఉద్యోగావకాశాలకు ముడిపెట్టటం అసాధ్యం కాదు. తర్జుమా సాంకేతికత, యంత్రాల ద్వారా పని అవకాశాలు కూడా పెరుగుతున్నాయి. ముమ్ముందు భావం, విషయం ప్రధానమవుతుంది తప్ప భాష ఏదయినా ఒకటే అవుతుంది.

## ప్రభుత్వ ధోరణి వల్ల తెలుగుతోపాటు పండుగలు, సంస్కృతి కూడా దెబ్బతినే ప్రమాదముంది

ఆంగ్ల మాధ్యమాన్ని తెలుగునాట తల్లిదండ్రులు కోరుకుంటున్నారన్న సాకుతో ప్రభుత్వమే తెలుగు అక్కర్లేదు అనే సంకేతాన్నిచ్చేలా తెలుగు మీడియాన్ని ఎత్తేయాలని నిర్ణయించుకుంటే అది తీవ్ర నష్టదాయక సంకేతాన్ని పంపుతుంది. పాలకుల ఆదరణలేని భాషలు అంతరించి పోవటానికి చరిత్రలో అనేక ఉదాహరణలున్నాయి. ప్రభుత్వమే అధికారికంగా తెలుగు అక్కర్లేదు అనే ధోరణి వల్ల, ముమ్ముందు తెలుగు పత్రికలకు కొత్త పాఠకులు కూడా తగ్గిపోయే అవకాశం ఉంది. పత్రికలు లేకపోతే ఇప్పుడున్న మాత్రం తెలుగు కూడా మిగిలే అవకాశాలు తగ్గిపోయే ప్రమాదముంది. మాట్లాడే భాషగా కూడా తగ్గిపోతూ మ్యూజియం పీస్‌గా మిగిలిపోవచ్చు. కాబట్టి పార్టీ రాజకీయ దృష్టి, వ్యక్తిగత విశ్వాసాలతో కాకుండా, శాస్త్రీయంగా, చారిత్రక, భవిష్యత్ దృష్టితో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవహరించాలి.

## మంచి ప్రమాణాలలో గణితం, తార్కికత, విశ్లేషణ, సమన్వయం, సృజనాత్మకత కీలకం

సరిగా ఇంగ్లీషు రానివారి చేత బోధించటం వల్ల ఇంగ్లీషు మాధ్యమంలో బోధనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి కాబట్టి.. తెలుగు మాధ్యమం ఎత్తివేయటం తగదనే వాదనలు కూడా విషయాన్ని కొంతమేర పక్కదోవ పట్టించేవే. ఈ సమస్య తాత్కాలికమైనదే. ఆ వైఫల్యాన్ని సాంకేతిక బోధనా పద్ధతుల యుగంలో అధిగమించటం కాస్త అటూఇటుగా సాధ్యమే. కానీ మౌలిక సమస్యల్లా నాణ్యమైన విద్యను అందించటం, మాతృభాషలో బోధనకు–నాణ్యమైన విద్యాబోధనకు మధ్య గల అవినాభావ సంబంధం, సుదీర్ఘకాల మనుగడకు కావలసిన అన్ని అర్హతలూ గల తెలుగు భాషను కాపాడుకోవటం! మంచి ప్రమాణాల విద్యను అందిస్తే, ఆ మాధ్యమం తెలుగా, ఇంగ్లీషా, గతంలో అక్కడ ఏ మతం రాజు పరిపాలించాడు, అక్కడ మసీదుండేదా, మందిరముండేదా అనే చర్చలతో సంబంధం లేకుండా.. అందరికీ వృత్తి నైపుణ్యాలు, జీవన వికాసం లభిస్తాయని, ప్రపంచంలో ఎక్కడైనా బతికే, ఎదిగే సామర్థ్యం సొంతమవుతుందని లోక్‌సత్తా జయప్రకాష్ నారాయణ్ అందుకే చెబుతుంటారు. గణితం, తార్కికత, విశ్లేషణ, సమన్వయం, సృజనాత్మకత వంటి వాటితో మంచి విద్య అందిస్తుంటే, విద్వేషాలు, భాషా భేదాల స్థాయిలో ఆలోచనలు ఎందుకుంటాయిక?

## ఎన్నికల మేనిఫెస్టోకన్నా రాజ్యాంగం పవిత్రమైనది

ఎన్నికల సమయంలో వైసీపీ తరపున హామీ ఇచ్చారు కాబట్టి జగన్ తెలుగు మాధ్యమం ఎత్తివేత నిర్ణయాన్ని అమలు చేస్తున్నారనే వాదనను పలువురు పదే పదే వినిపిస్తున్నారు. అయ్యలారా, అమ్మలారా! ఎన్నికల మేనిఫెస్టో కన్నా ప్రజలకు, పార్టీలకు రాజ్యాంగం పవిత్రమైనది. ఎన్నికల హామీ కన్నా, రాజ్యాంగం మీద చేసిన ప్రమాణం విలువైనది. ప్రజలకు రాజ్యాంగం ప్రసాదించిన హక్కులకు, సాధికారత హామీకి భంగం కలిగించే రీతిలో ఎన్నికల హామీ ఉన్నప్పుడు దాన్ని సరిచేసుకుని ప్రజలకు నచ్చచెప్పటం సరైన పాలకులు చేయాల్సిన పని. ప్రజలకు నష్టం వచ్చినా సరే, మాట తప్పను మడం తిప్పను అంటే.. అది రాచరికం, మూర్ఖత్వం అవుతుంది. ఈ అంశాన్ని సెప్టెంబర్ 'జనబలం' సంచికలో, అంతకుముందు 'లోక్‌సత్తా

టైమ్స్' సంచికల్లో కూడా సవివరంగా పేర్కొన్నాం.

## తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్ని కొనసాగిస్తూ విద్యను బాగు చేయండి, తెలుగును ప్రోత్సహించండి

వీటన్నిటి దృష్ట్యా ప్రభుత్వం తెలుగు భాషను ప్రోత్సహించటంతోపాటు, విద్యావ్యవస్థను బాగు చేయటం మీద పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలి. సాంకేతికాభివృద్ధికి దీటుగా భాషాభివృద్ధిని ప్రోత్సహించాలి. యాసలతోపాటు భాషాభివృద్ధికి, పదాల్ని సాంకేతికతలో భాగం చేయటానికి సుదీర్ఘకృషి అవసరమే అయినా, ఈ తరంలోనే ఈ కృషిని చేయగల భాషావేత్తలు, నిపుణులు పత్రికారంగంలో కూడా ఉన్నారు. జగన్ సొంత పత్రికలో కూడా ఈ యజ్ఞంలో భాగస్వాములు కాగల సామర్థ్యం, అనుభవం కలవారున్నారు. ఇప్పుడున్నట్లే తెలుగు మాధ్యమాన్ని, ఆంగ్ల మాధ్యమాన్ని కొనసాగిస్తూనే.. విద్యాప్రమాణాల పెంపును ఒక సవాలుగా చేపట్టాలి. ఆంగ్లాన్ని ఒక సబ్జెక్టుగా టింగ్లిష్‌లా కాకుండా సరైన అధ్యాపకులతో, అవసరమైతే మూక్ క్లాసుల ద్వారానైనా నాణ్యతతో నేర్పించటాన్ని ఇందులో భాగం చేయాలి. తెలుగును పాలనలో, ఉపాధి అవకాశాల్లో ప్రోత్సహించాలి.

అలాగే మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా పదాలు కొరవడటంతోపాటు తెలుగు భాషకు ఇంకో సమస్య కూడా ఉంది. ఇందులో రాసేవారి సంఖ్య తక్కువగా ఉండటంతోపాటు.. అందులో కూడా అందరికీ వర్తించేవీ, అందరినీ ఆలోచింపచేసేవీ, ప్రపంచ స్థాయిలోనివి అనిపించే ఆలోచనలు కూడా తక్కువ ఉంటున్నాయి. సరైన సృజనాత్మక ఆలోచనలు, భావాలు లేకపోవటం కూడా తెలుగును కృశింప చేస్తోంది. ఇలాంటి ఆలోచనలు రాసే కొద్దిమందిలో కూడా ఎక్కువమంది ఇంగ్లీషు నుంచి కాపీ చేసి రాస్తున్నారుతప్ప.. ప్రపంచస్థాయి అనుభవాలను స్థానిక పరిస్థితులకనుగుణంగా మలచి, అన్వయించి ప్రామాణికంగా ఇచ్చే ప్రయత్నం చేయటం లేదు. దీంతో, ఈ గొడవంతా ఎందుకు, ఇంగ్లీషు ఒరిజినల్‌లోనే చదువుకోవచ్చు అనే భావన కూడా పెరుగుతోంది. ఈ వైఫల్యాన్ని అధిగమించటానికి నాణ్యమైన విద్యను ప్రోత్సహించటంతోపాటు పుస్తక ప్రచురణల్ని, చదివే అలవాటును ప్రోత్సహించటం కూడా అవసరం. ఈ చర్యలన్నీ చేపడితే చాలు.. ఆంగ్ల మాధ్యమం పట్ల మోజున్న వారు కూడా క్రమంగా వాస్తవాలు గ్రహించి నాణ్యమైన విద్యను, ఆంగ్ల ప్రావీణ్యాన్ని వేర్వేరు అంశాలుగా గ్రహించి నిర్ణయాలు తీసుకునే పరిస్థితి వస్తుంది. తెలుగు మీడియంలో మంచి చదువుల్ని అందిస్తే తమ పిల్లల్ని అందులోనే చదివించాలని ఎవరో కొద్దిమంది మినహా ఏ తల్లిదండ్రులు మాత్రం కోరుకోరు?

ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం మాత్రమే ఉండేలా చేయటం వల్ల ప్రైవేటు శక్తుల నుంచి ఒత్తిడి పెరుగుతోందని, శత్రువులు ఎక్కువవుతున్నారని జగన్ అంటున్నారు. ఇంగ్లీషు భాషలో నేర్చుకున్నా చదువురాకపోతే ప్రైవేటు స్కూళ్లు ఇంకా చెలరేగిపోయి ప్రభుత్వ పాఠశాలలు ఇంకా పతనమవుతాయన్న కోణాన్ని చూడటానికి ఆయన ఇష్ట పడటం లేదు. ప్రైవేటు శక్తులకన్నా కూడా ప్రభుత్వ విధానాలలోని లోపాలు, చిత్తశుద్ధిలేమే పాఠశాల చదువులకు పెద్ద శత్రువు! వైఎస్ జగన్ ప్రభుత్వానికున్న పెద్దసవాలల్లా.. ప్రజల్లో ఇంగ్లీషు మీడియం పట్ల అసంబద్ధంగా పెరిగిపోయిన మోజు! ఇంతకుముందే చెప్పుకున్నట్లు- ప్రజలకు నచ్చినా నచ్చకున్నా, ఎంత బలమైన శక్తులు సవాలు చేసినా కీలక నిర్ణయాలు తీసుకుని అమలు చేస్తున్న ముఖ్యమంత్రికి.. ప్రజలకు నిజంగా ఉపయోగపడే ఓ నిర్ణయాన్ని వారికి నచ్చచెబుతూ అమలు చేయటం అసాధ్యమా? విద్య, ఉపాధి అవకాశాల్లో తెలుగు మాధ్యమంలో చదువుకున్న వారికి మార్కులు కలపటం వంటి ప్రోత్సాహకాలనివ్వటం ప్రభుత్వం చేతుల్లో పనే. ప్రభుత్వాలు ఏ పనులు చేయాలో ఇంకా స్పష్టతలేని సమాజానికి వారి వాస్తవ ప్రయోజనాలేమిటో తెలియచెప్పి, ఆ దిశగా వారిని మళ్లించటం మంచి పాలకుడి బాధ్యతల్లో భాగమే.


## రాజకీయ, మత రంగు పులుముకున్నందున నిపుణుల ప్రామాణిక నివేదిక తీసుకోండి

ఈవేళ తెలుగు రాష్ట్రాలు, యావత్ దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక సవాళ్లకు మూలం నాణ్యమైన విద్య, ఆరోగ్యాన్ని అందించి మానవ వనరులను అభివృద్ధి చేయకపోవటంలో ఉంది. ఈ విషయాన్ని 23 ఏళ్ల క్రితం లోక్‌సత్తాను ప్రారంభించినప్పటి నుంచి జయప్రకాష్ నారాయణ్ చెబుతూనే వస్తున్నారు. మంచి ప్రమాణాల విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన, స్థానిక స్వయంపాలన, మౌలిక వసతులు, ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాల్లేని సేవలు లేకపోతే ఆర్థిక రంగమేకాదు, మన ప్రజాస్వామ్యం కూడా దెబ్బతింటుందని, కులం వంటి వివక్షలు ఆధునిక రూపాల్ని సంతరించుకుని సామాజిక అశాంతిని పెంచుతాయని జేపీ హెచ్చరిస్తూనే ఉన్నారు. వివక్ష లేకుండా ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలకు నాణ్యమైన విద్యనందించటం కీలకం అని గుర్తిస్తే, ఆంగ్లాన్ని మాతృభాషగా మార్చాలనే అమాయకత్వమో, దురాలోచనో లేకుంటే.. కచ్చితంగా ఈ వాదనల్ని వైఎస్ జగన్ ప్రభుత్వం అంగీకరించాలి, తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్ని కొనసాగిస్తూ, విద్యాప్రమాణాల్ని పెంచేందుకు సమగ్ర చర్యల్ని చేపట్టాలి. ఇందులో భాగంగా.. తెలుగు మాధ్యమాన్ని ఎత్తివేయటంపై వైఎస్ జగన్ ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునస్సమీక్ష చేయాలి. డబ్బున్నవారి స్థాయిలోనివి, కొన్ని ట్రస్టులు, యాజమాన్యాల ప్రత్యేక శ్రద్ధ ఉన్న స్కూళ్లు మినహాయిస్తే చాలా ప్రైవేటు స్కూళ్లలో ఇంగ్లీషు మాధ్యమం ఉన్నా రాష్ట్రంలోని పిల్లలకు మంచి చదువు ఎందుకు

అందటం లేదు? అనే ఆలోచనను జగన్ ప్రభుత్వం చేస్తే, అసలు సమస్య తెలుగు మాధ్యమం కాదు అని తేలిగ్గా అర్థమవుతుంది. ప్రైవేటు స్కూళ్లలో కూడా తెలుగు మీడియం అందుబాటులో ఉండాలనే డిమాండ్‌కు బలం చేకూరుతుంది. వాస్తవాల్ని, సాక్ష్యాల్ని విస్మరించి తాత్కాలిక తాయిలంలా ప్రజాకర్షకమైన ఇంగ్లీషు మీడియాన్ని అమలు చేయాలనుకోవటం నేరపూరిత బాధ్యతారాహిత్యం. ఇప్పటికే ఈ అంశం రాజకీయ, మత (క్రైస్తవ–హిందూ) రంగు పులుముకున్నందున.. నిపుణులతో, భాషావేత్తలతో, రాజకీయ, పౌర సమాజ నేతలతో చర్చించి ప్రామాణిక నివేదిక ఆధారంగా సమగ్ర నిర్ణయం తీసుకోవాలి. ఈ విషయంపై ఏమాత్రం నిర్లక్ష్యంగా, ఏకపక్షంగా వ్యవహరించినా, మాతృభాషాపరంగానే కాకుండా, ఆర్థిక, సామాజిక, సంస్కృతిపరంగా కూడా తెలుగువారికి చాలా నష్టం చేసినవారవుతారు.

## మాతృభాషల్లో చదువు లేకపోవటం వల్ల భారతీయులు ఎంతో కోల్పోయారు- మహాత్మాగాంధీ

మీరు నమ్ముతారో లేదో.. బోంబేలోని ఆ సభల్లో ఎక్కువమంది శ్రోతల్ని ప్రభావితం చేసిన ప్రసంగాలన్నీ కేవలం హిందుస్తానీలో చేసినవే! జాగ్రత్తగా వినండి, అందరూ హిందీ మాట్లాడే బనారస్‌లోకాదు.. బోంబేలో సంగతి నేను చెబుతున్నది. బోంబే ప్రెసిడెన్సీ యాసలు ఒకపక్క, హిందీ మరోపక్క ఉన్నా కూడా.. ఇంగ్లీష్‌కి, భారతీయ సోదర భాషకి మధ్య ఉన్నంత పెద్ద అంతరం వాటి మధ్య కనిపించదు. హిందీలో మాట్లాడిన వక్తల భావాలను కాంగ్రెస్ శ్రోతలు మెరుగ్గా అర్థం చేసుకోగలిగారు. ఈ యూనివర్సిటీకి వచ్చే యువతకు వారి స్థానిక భాషలో చదువు చెప్పేందుకు చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నా. మన భాషలంటే మనల్ని మనం సమీక్షించుకోవటం. అత్యుత్తమ ఆలోచనల్ని వ్యక్తం చేసే శక్తి మన భాషలకు లేదు అంటే.. మనం ఎంత త్వరగా మనుగడను కోల్పోతే మనకు అంత మంచిది అంటాను. ఇంగ్లీష్ ఎప్పటికైనా భారతదేశ జాతీయ భాష అవుతుందని కలలుగనే వారెవరైనా ఉన్నారా? ఎందుకు దేశం మీద ఈ వైకల్యాన్ని రుద్దుతున్నాం? ఇంగ్లీష్ పిల్లతోనో, పిల్లవాడితోనో మన పిల్లలు పోటీపడితే.. సమానత్వం ఏ స్థాయిలో ఉంటుందో ఒక్కసారి ఊహించుకోండి. కొంతమంది పూణె ప్రొఫెసర్లతో సన్నిహితంగా మాట్లాడే సదవకాశం నాకు లభించింది. ఇంగ్లీష్ భాష ద్వారా పరిజ్ఞానాన్ని పెంచుకున్న ప్రతి భారతీయ యువతా తన జీవితంలో కనీసం ఆరు విలువైన సంవత్సరాలను కోల్పోయినట్టని వారు నాకు తేల్చిచెప్పారు. మన స్కూళ్లలో, కాలేజీల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్యతో ఆ సంవత్సరాలను గుణించండి. ఎన్ని వేల సంవత్సరాలను ఈ దేశం కోల్పోయిందో మీకే అర్థమవుతుంది. 'చొరవ లేదు' అన్నది మన మీదున్న ఆరోపణ. మన జీవితంలో విలువైన సంవత్సరాలను ఒక విదేశీ భాషలో ప్రావీణ్యం సంపాదించుకోవటానికే వెచ్చిస్తుంటే.. మనకు చొరవ ఎలా వస్తుంది? ఈ ప్రయత్నంలో కూడా మనం విఫలమయ్యాం. హిగ్గిన్‌బాథమ్ తరహాలో తన శ్రోతల్ని ప్రభావితం చేయటం నిన్న, ఈరోజు ఏ వక్తకయినా సాధ్యమైందా? సభికులను ఆకట్టుకోలేకపోవటం ఆ వక్తల తప్పు కాదు. కావలసినదానికన్నా ఎక్కువ విషయాన్నే వారు  మన కోసం తమ ప్రసంగాల ద్వారా అందించారు. కానీ వారి మాటలు మన ఇంటి దాకా రావు. ఇంగ్లీష్ చదువున్న భారతీయులే ముందున్నారు, నాయకత్వం వహిస్తున్నారు, దేశానికి అన్ని పనులు చేస్తున్నారు.. అని చెప్పుకోవటం నేను విన్నాను. అలాకాకుండా ఇంకోలా అయితే భయంకర ఉపద్రవమేనన్నమాట! మనకు అందుతున్న చదువు.. ఆంగ్ల విద్య మాత్రమే. కచ్చితంగా దాని పట్ల మనం ఎంతోకొంత సానుకూలంగా స్పందించాలి. కానీ ఒక్కసారి ఊహించండి– గత యాభై ఏళ్లుగా మన స్థానిక భాషల్లో మనకు చదువు అందుతుందనుకోండి, ఇప్పుడు ఎలా ఉండేవాళ్లం? మనకు ఏమి సమకూరేది?.. మనకు స్వతంత్ర భారతదేశం ఉండేది, చదువుకున్న స్వదేశీయులుండేవారు, సొంత దేశంలోనే విదేశీయుల్లా కాకుండా భారతదేశ అంతరాత్మతో మాట్లాడుతుండేవాళ్లం. అలాంటి స్వదేశీ విద్యావంతులు అత్యంత నిరుపేదల మధ్య పనిచేస్తుండేవారు. ఈ యాభై ఏళ్లలో వారు సాధించింది దేశ వారసత్వ సంపదగా ఉండేది. ఈవేళ మన భార్యలు కూడా మన అత్యుత్తమ ఆలోచనలో భాగస్వాములు కాలేకపోతున్నారు. ప్రొఫెసర్ బోస్, ప్రొఫెసర్ రే ని చూడండి. వారి పరిశోధనలు సామాన్య ప్రజల ఉమ్మడి ఆస్తి కాకపోవటం అవమానకరం కాదా?



**(1916లో బనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో గాంధీజీ చేసిన చరిత్రాత్మక ప్రసంగంలోని మాటలు)**

# మాతృభాషతో మొదలుపెట్టటమే మేలు

## - రంజిత్ కుమార్, చరిత్ర అధ్యయనకారులు

మాతృభాషపై పట్టులేకుండా వేరే ఏ భాషలోనూ ప్రావీణ్యం సాధ్యంకాదు. పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టాలన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిర్ణయం సరైనది కాదు. తెలుగు విద్యార్థులకు ఆంగ్లం రావాలన్నా తెలుగుపై పట్టు ఉండటం తప్పనిసరి. ఎన్నో పరిశోధనలూ ఇదే విషయాన్ని తేల్చిచెప్పాయి. ఒక భాష మాట్లాడటం రావాలంటే ఆ భాషలో విద్యాభ్యాసం చేయాల్సిన అవసరం లేదు. పాఠశాల స్థాయిలోనే స్పోకెన్ ఇంగ్లీషు తదితర పద్ధతుల్లో ఆంగ్లాన్ని నేర్పిస్తే సరిపోతుంది.

తరగతి గదిలో అధ్యాపకుడు మాతృభాష వాడితేనే పిల్లలకు విషయం స్పష్టంగా అర్థమవుతుంది. ఈ అంశంపై లోతైన పరిశోధన చేశాను. దీనికోసం 10 లక్షలకన్నా ఎక్కువ జనాభా ఉన్న దేశాలను (170) పరిగణలోకి తీసుకున్నాను. పరిశోధనలో బైటపడ్డ కొన్ని ఆసక్తికరమైన అంశాలివి..

- మనం ఇంగ్లీష్‌ను విద్యలో మాధ్యమంగా ఎలా ఉపయోగిస్తున్నామో, అలానే బ్రిటీష్ పాలన అనుభవించిన ఎన్నో ఇతర దేశాలు కూడా ఉపయోగిస్తున్నాయి. ఫ్రెంచ్, స్పానిష్, పోర్చుగల్ వలస పాలన ఉన్నచోట్ల ఫ్రెంచ్, స్పానిష్, పోర్చుగీసు భాషలను ఉపయోగిస్తాయి.
- 2017 వరకూ నోబెల్ బహుమతి (శాంతి బహుమతి మినహా) పొందినవారిలో 98 శాతానికిపైగా మాతృభాషలో విద్యను బోధించే దేశాలకి చెందినవారే.
- కొనుగోలు శక్తి ఆధారిత తలసరి ఆదాయం దృష్ట్యా ప్రపంచంలోని తొలి 30 దేశాల్లో 28 చోట్ల మాతృభాషలోనే విద్యాబోధన జరుగుతోంది. సింగపూర్, హాంకాంగ్ పేరుకు దేశాలే అయినా వాటి జనాభా మన ముంబయి అంత కూడా ఉండదు. కనుక అక్కడి విధానాలు ఈ సందర్భంలో మనకు ఆదర్శం కాదు.
- ప్రపంచీకరణకు ఇంగ్లీషు తప్పనిసరి అనే భావన ప్రజల్లో బలంగా ఉంది. కానీ అందులో నిజం లేదు. కేఓఎఫ్ గ్లోబలైజేషన్ సూచీ-2018లో భాగమైన మొదటి 50 దేశాల్లో 48 మాతృభాషనే వాడుతున్నాయి.
- ఆధునిక పరిశోధనలు చెయ్యడానికి ఇంగ్లీషు తప్పనిసరి అని మరొక భావన కూడా ఉంది. అది కూడా తప్పే. శాస్త్ర సాంకేతిక రంగాల్లో వివిధ దేశాల ఆవిష్కరణల సామర్థ్యాన్ని అత్యంత శాస్త్రీయంగా విశ్లేషించి ఏటా నివేదిక ఇచ్చే 'గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్', 'బ్లూమ్‌బెర్గ్ ఇన్నోవేషన్ ఇండెక్స్' జాబితాలలో మొదటి 40-50 స్థానాలలో ఉండే 90 శాతానికి పైగా దేశాలూ మాతృభాషనే తమ విద్యాబోధనలో ఉపయోగిస్తాయి. జాంబియా, టాంజానియా, ఘనా వంటి ఎన్నో ఆఫ్రికా దేశాలు సైతం మాతృభాషలో విద్యాబోధన మొదలు పెడుతుంటే, మనం మాతృభాషలో బోధిస్తున్న పాఠశాలలను కూడా ఆంగ్ల మాధ్యమంలోకి మార్చడం దురదృష్టకరం.

## మాట్లాడే భాషగా కూడా నాలుగో స్థానానికి తగ్గిన తెలుగు

తెలుగును మాధ్యమంగా తీసేసినా, ఇంట్లో మాట్లాడే భాషగా భేషుగ్గానే కొనసాగుతుందని కొందరు వాదిస్తున్నారు. కానీ ప్రోత్సాహం కరువైతే తెలుగు పరిస్థితి ఆందోళనకరమని గణాకాలు సూచిస్తున్నాయి. తెలుగు రాష్ట్ర ప్రభుత్వమే తెలుగు మాధ్యమం అక్కర్లేదనే ఉత్తర్వు ఇవ్వటం చాలా పెద్ద ప్రతికూల సంకేతమయ్యే ప్రమాదముంది.

2011 జనాభా గణనలో దేశంలోని మాతృభాషల వివరాలను బట్టి.. దేశంలోని అత్యధికులు సంభాషించే మాతృభాషల్లో తెలుగు మూడోస్థానం నుంచి నాలుగో స్థానానికి పడిపోయింది. ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్‌గా విదేశీయులు కీర్తించిన తెలుగు స్థానాన్ని మరాఠీ భర్తీ చేసి మూడో స్థానానికి చేరుకుంది. ప్రస్తుతం దేశ జనాభాలో 96.71 శాతం మంది రాజ్యాంగం గుర్తించిన 22 భాషల్లో ఏదో ఒక దాన్ని తమ మాతృభాషగా నమోదు చేసుకున్నారు. మిగతా 3.29 శాతం మంది ఇతర భాషలను ఎంపిక చేసుకున్నారు. 2001 జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభాలో 7.19 శాతం మంది తెలుగును తమ మాతృభాషగా ఎంచుకోగా 2011 నాటికి ఈ సంఖ్య 6.93 శాతాని (08,11,27,740)కి తగ్గింది. మరాఠీ మాతృభాషగా ఎంపిక చేసుకున్నవారు 7.09 శాతానికి పెరిగారు. తెలుగు మాట్లాడేవారు ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో ఉన్నారు. దేశ జనాభాలో హిందీని మాతృభాషగా ఎంచుకుంటున్నవారు గణనీయంగా పెరిగారు. 2001 లెక్కల ప్రకారం 41.03 శాతమున్న వీరి సంఖ్య 2011 నాటికి 43.63 శాతానికి చేరుకుంది. హిందీ తర్వాత బెంగాలీ ఎక్కువగా మాట్లాడుతున్నారు. 2001లో 8.11 శాతం మంది బెంగాలీని మాట్లాడుతుంటే ఈ సంఖ్య 2011 కల్లా 8.30 శాతానికి పెరిగింది. ఇక రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చిన 22 భాషల్లో సంస్కృతం చివరి స్థానంలో నిలిచింది. ప్రస్తుతం దేశంలో 24,821 మంది మాత్రమే సంస్కృతాన్ని తమ మాతృభాషగా పేర్కొన్నారు. సంస్కృతంతో పోల్చుకుంటే బోడో, మణిపురి, కొంకణి, డోగ్రీ భాషల్ని మాట్లాడేవారు ఎక్కువమంది ఉన్నారు. 2001 లెక్కల ప్రకారం ఆరో స్థానంలో ఉన్న ఉర్దూ భాష ఏడో స్థానానికి పడిపోయింది. జనాభాలో 4.74 శాతం మందితో గుజరాతీ ఆరో స్థానానికి చేరింది. రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో లేని ఇంగ్లీషును దేశంలో దాదాపు 2.6 లక్షలమంది మొదటి భాష (ఫస్ట్ స్పోకెన్ లాంగ్వేజ్)గా పేర్కొన్నారు. వీరిలో దాదాపు లక్షమంది మహారాష్ట్రలోనే ఉన్నారు. ఆ తర్వాతి స్థానాల్లో తమిళనాడు, కర్ణాటక ఉన్నాయి. రాజ్యాంగం గుర్తించని భిలీ/భిలోడీ భాషను రాజస్తాన్‌లోని కోటి మందికిపైగా, గోండీ భాషను 29 లక్షలమంది మాట్లాడుతున్నారు.

# తెలుగు మాధ్యమానికి వ్యతిరేకంగా తప్పుడు సిద్ధాంత ప్రచారం

## - ఆచార్య పులికొండ సుబ్బాచారి

జపాన్, చైనాల్లో తయారైన యంత్రాలను చాలా దేశాల్లో వాడుతున్నారు. తర్ఫీదు ఇవ్వడానికి ఆ రెండు దేశాల నిపుణులు ఆయా దేశాలకు వెళ్తుంటారు. వారంతా ఇంజినీరింగ్, ఇతర కంప్యూటర్ సాంకేతిక విద్యలను వారి భాషల్లో నేర్చుకున్నారు. ఇంగ్లీషును కనీస వ్యాపార లావాదేవీలు, దైనందిన వ్యవహారాలు నడుపుకునే వరకే నేర్చుకుంటారు. మన దేశంలో ఇంజినీరింగ్ కంప్యూటర్ విద్యలను ఆంగ్ల మాధ్యమంలో చదివినవారు ఆ సాంకేతిక రంగంలో వారితో పోటీపడగలుగుతున్నారా? అలాకాక ఇంజినీరింగ్, వైద్య విద్యలను, ఇతర శాస్త్రాలను భారతీయ భాషల్లోనే ఆయా ప్రాంతాలవారు నేర్చుకున్నా- ఇంగ్లీషును ఒక భాషగా నేర్చుకోగలిగితే, ఇటు ఈ శాస్త్రాలనూ సులభంగా అభ్యసించవచ్చు. ఆంగ్లాన్ని ఒక భాషగా అన్ని తరగతుల్లో నేర్చుకోవడం వల్ల ఇతర దేశాల్లోనూ పనిచేయడానికి వీలవుతుంది. సాంకేతిక విద్యలో మనకన్నా చాలా ముందున్న చైనా, రష్యా, జపాన్ దేశస్తులు వారి భాషల్లో విద్యాబోధన సాగిస్తూ మెరుగ్గా రాణిస్తున్న ఉదాహరణ మన ఎదురుగానే ఉంది. ఆంగ్ల మాధ్యమంలో చదివితేనే ఉద్యోగాలు వస్తాయన్నది విడ్డూర వాదన. పౌరుల్లో ఏ వర్గం వారైనా ప్రభుత్వం నుంచి కోరుకోవలసింది- చదువు తెలుగు మాధ్యమంలోనే ఉండాలి కాని, తమకు చక్కటి ఆంగ్లాన్ని పాఠశాల స్థాయిలోనే నేర్పించాలని, అందుకు వీలుగా మంచి శిక్షణ పొందిన ఆంగ్ల ఉపాధ్యాయులను ఇవ్వమని. పైగా తెలుగులో చదువుకుంటేనే శాస్త్రాలు సులభంగా బోధపడి, ఎవరైనా అభివృద్ధిలోకి రాగలుగుతారు. ప్రభుత్వ బడుల్లోనే కాదు, అన్ని ప్రైవేటు పాఠశాలల్లోనూ ప్రాథమికోన్నతి వరకు తెలుగు మాధ్యమంలోనే బోధన సాగాలని భాషావాదులు కోరుతున్నారు. వందేళ్ల క్రితమే ఇంజినీరింగ్, మెడిసిన్ లాంటి సాంకేతిక విద్యను, ఉన్నత విద్యను ఉర్దూ మాధ్యమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం అందించింది. మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి లాంటి వారు ఉర్దూలోనే మెడిసిన్ చదువుకున్నారు. విద్యారంగంలో ప్రైవేటు వ్యాపారం పుంజుకొన్న దరిమిలా ఆంగ్ల మాధ్యమంలో చదువుకుంటేనే ఉద్యోగాలు వస్తాయనే తప్పుడు సిద్ధాంతాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే ప్రయత్నాలు జరుగుతున్నాయి. తెలుగులోనే ప్రభుత్వ పాలన వ్యవహారాలు జరగడానికి అంటే అధికార భాష అమలుకు, ఉద్యోగాలకు, తెలుగు మాధ్యమానికి విడదీయలేని సంబంధం ఉంది. తెలుగువారందరికీ వారి ప్రభుత్వ కార్యకలాపాలు మాతృభాషలోనే జరుపుకోవడం వారికి సంక్రమించిన హక్కు. గ్రామంలో పనిచేసే ప్రభుత్వ కార్యాలయం వేరే భాషలో ఎందుకు పనిచేయాలి? రాజకీయ నాయకులు మామూలు సందర్భాల్లో కాని లేదా ఎన్నికల ప్రచారంలో కాని ఆయా ప్రాంతాల భాష యాసల్లో ఎందుకు మాట్లాడుతున్నారు? తాము చెప్పదలచుకున్నది సూటిగా ప్రజలకు చేరాలనే కదా! ఈ ప్రాథమిక విషయాన్ని ఎందుకు గుర్తించటం లేదు? బాగా అభివృద్ధి చెందిన పలు దేశాలు వారి మాతృభాషలో విద్యాబోధన చేస్తుండగా మనం ఎందుకు గ్రహించడం లేదు? తెలుగు భాషకు అత్యంత అధికంగా ఉత్పాదక శక్తి ఉంది. ఎన్నో పారిభాషిక పదాలు సిద్ధంగా ఉన్నాయి. ఉర్దూ వంటి తక్కువమంది మాట్లాడే భాషలోనే శతాబ్దం క్రితమే ఇంజినీరింగ్, వైద్య విద్యలను బోధించగలిగితే, తెలుగులో ఎందుకు చెప్పలేమని మనవారు ఆలోచించటం లేదు. ఏ భాషలో విద్యాబోధన జరగదో ఆ భాష 40 సంవత్సరాల్లో నశించిపోతుందని యునెస్కో అధ్యయనం శాస్త్రీయంగా చాటిన విషయం గుర్తుపెట్టుకోవాలి. ప్రభుత్వాలు ఇంగ్లీషు మీడియం విద్యను ప్రోత్సహిస్తే రాబోయే కాలంలో తెలుగు కేవలం 'మౌఖిక భాష'గా మిగిలిపోతుంది. చదవడం, రాయడం చేతగాని జాతిగా మిగిలిపోతుంది. పక్క రాష్ట్రాలవారు భాషా వికాసంలో ముందుకెళ్తుంటే, తెలుగు రాష్ట్రాల్లో పరిస్థితి అతి దీనంగా ఉండటం మన దురదృష్టకరం. ఈ స్థితిలో భాషను కాపాడుకునే బాధ్యత ప్రతి పౌరుడిపై ఉంది!

### సూచీల్లో అగ్రస్థానంలో ఉన్న అత్యధిక దేశాల్లో మాతృభాషలోనే విద్యాబోధన

మానవాభివృద్ధి సూచీలో, తలసరి ఆదాయంలో, సాంకేతిక పరిజ్ఞానంలో, అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో అగ్రస్థానంలో ఉన్న అత్యధిక దేశాలు- నార్వే, స్విట్జర్లాండ్, ఐర్లాండ్, జర్మనీ, ఐస్‌లాండ్, హాంకాంగ్, స్వీడన్, నెదర్లాండ్స్, లగ్జెంబర్గ్, కతార్, డెన్మార్క్, జపాన్, దక్షిణ కొరియా, చైనా, రష్యా, ఫ్రాన్స్, ఇటలీ, బ్రెజిల్ తదితరాలన్నీ మాతృభాషలోనే పాఠశాల విద్యాబోధన చేస్తున్నాయి.


# అమ్మ భాషకే 'నోబెల్ సాహిత్య' అందలం

-డాక్టర్ గుజ్జు చెన్నారెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

తల్లి జన్మనిస్తే, తల్లిభాష వికాసాన్ని ఇస్తుంది. అమ్మ సాంగత్యంలో బిడ్డకు కలిగే ఆహ్లాదంలా, అమ్మభాష రచనల్లో అనంత సౌకర్యం కలగజేస్తుంది. మాతృభాషలో మాదిరిగా మరే ఇతర భాషలోనూ సరైన భావాలను పలికించలేం. మాతృభాషలో రాసినవారే ఎక్కువమంది నోబెల్ పురస్కారాలు అందుకోవడం ఇందుకు నిదర్శనం. 2018 సంవత్సరానికి పోలెండ్ రచయిత్రి ఓల్గా టోర్కర్విజ్ మాతృభాష పోలిష్‌లో రాసిన నవలల ఆంగ్ల అనువాదానికి, 2019 సంవత్సరానికి ఆస్ట్రియా నవల, నాటక రచయిత పీటర్ హండ్కే తన మాతభాష జర్మన్‌లో రాసిన సాహిత్యానికి సంబంధించిన ఆంగ్ల అనువాదానికి నోబెల్ సాహిత్య బహుమతులు అందుకున్నారు.

ప్రపంచ సాహిత్య చరిత్రలో 19వ శతాబ్దం ద్వితీయార్థం విక్టోరియా మహారాణి పాలన కాలంలో ఆంగ్లేయ నవలాకారులు చార్లెస్ డికెన్స్, జార్జ్ ఇలియట్, చార్లెటో బ్రాంటే థామస్ హార్డీ, ఎమిలీ బ్రాంటే, శామ్యూల్ బట్లర్ రచనలు విక్టోరియన్ నవలలుగా ప్రసిద్ధిగాంచాయి. వారి రచనల్లో చరిత్ర, సంస్కృతి, పారిశ్రామికీకరణ, మానవ సంబంధాలు ఇతివృత్తాలుగా నిలిచాయి. 20వ శతాబ్దంలో అమెరికన్ నవలాకారులు 'సంక్షిప్తత తెలివికి ఆత్మ' అనే ఆలోచనతో తక్కువ పదాల్లో ఎక్కువ భావాలతో సంక్షిప్త నవలలు రచించి నవలా సాహిత్యాన్ని కొత్త పుంతలు తొక్కించారు. అలా రాసిన నూటపాతిక పేజీల 'ఓల్డ్ మ్యాన్ అండ్ ద సి' అనే బుల్లి నవలకు ఎర్నెస్ట్ హెమింగ్వే నోబెల్ సాహిత్య బహుమతిని అందుకున్నారు. సామాన్య మానవుల జీవితాలను ఇతివృత్తంగా తీసుకుని సంఘటనలు సృష్టించి వారి మాతృభాషలో ఆయా పాత్రలకు ఆయన ప్రాణం పోశారు.

ఓల్గా రాసిన 'బక్స్ ఆఫ్ జాకట్' అనే నవల మూడు మతాలు, అయిదు భాషలు, ఏడు దేశాలను సృజించిన ఒక యూదు ఆధ్యాత్మిక చరిత్రకు అక్షర రూపం. 18వ శతాబ్దంలో పోలెండ్‌లో జరిగిన 'ఫ్రాంకీజం' అనే ఉద్యమానికి రచయిత్రి సజీవ రూపాన్నిచ్చి ప్రపంచ చరిత్రలో కొత్త అధ్యాయానికి నాంది పలికారు. 2017లో మాతృభాష పోలిష్‌లో ఓల్గా రచించిన 'బైగుని' 2018లో ఆంగ్ల భాషలో 'ఫ్లైట్స్'గా తర్జుమా అయి బుకర్ ప్రైజ్ అందుకుంది. తమ దేశ అత్యున్నత సాహిత్య

బహుమానం 'నైకిలిటరరీ'ని ఆమె నిరుడు అందుకున్నారు. నోబెల్ సాహిత్య బహుమతి అందుకున్న మహిళల్లో ఓల్గా పదిహేనోవారు. న్యాయవాద వృత్తిని అర్ధాంతరంగా ముగించి రచయితగా స్థిరపడ్డ పీటర్ రచనలన్నీ ప్రాథమికంగా మాతృభాష జర్మన్‌లోనే సాగాయి. తల్లి ఆత్మహత్య నేపథ్యంలో రచించిన వంద పుటల 'ఎ సారో బియాండ్ డ్రీమ్స్' అనే నవల పాఠకులను బాగా ఆకర్షించింది. ఇందులో పీటర్ తన తల్లి ఆవేదన, మానసిక సంఘర్షణ, మానవ సంబంధాలను హృద్యంగా అక్షరీకరించారు. జర్మన్ రచయిత పీటర్ ఆ దేశ చలన చిత్రాలకు సాహిత్యాన్ని అందించి అనేక బహుమతులు అందుకున్నారు.

ఇప్పటి వరకు సాహిత్యంలో నోబెల్ బహుమతులు 116 మందిని వరించాయి. వీరిలో ఆంగ్లంలో ప్రత్యక్షంగా రాసినవారు 29 మంది, తమ మాతృభాషతోపాటు ఆంగ్లంలో రాసినవారు ముగ్గురు మాత్రమే కావడం గమనార్హం. 1913లో 'గీతాంజలి'కి నోబెల్ సాహిత్య పురస్కారం అందుకున్న రవీంద్రనాథ్ మొదటి ఆసియావాసి. తరవాత ఆ పుస్తకాన్ని ఆయన ఆంగ్లంలోనూ రచించారు. కరేబియన్ దీవులైన ట్రినిడాడ్ టొబాగోకు చెందిన భారతీయ సంతతి వాసి విదియధర్ సూరజ్ ప్రసాద్ నైపాల్ 2011లో నోబెల్ సాహిత్య బహుమతి అందుకున్నారు. 14 మంది చొప్పున ఫ్రెంచ్, జర్మన్ రచయితలు, 11 మంది స్పానిష్, ఏడుగురు స్వీడిష్, ఆరుగురు ఇటాలియన్లు, ఆరుగురు రష్యన్లు, అయిదుగురు పోలిష్, ముగ్గురు డానిష్, ముగ్గురు నైజీరియన్లు, ఇద్దరు చొప్పున చైనీస్, గ్రీస్, జపనీస్ రచయితలు తమ మాతృభాషల్లో రచనలు చేసి నోబెల్ బహుమతులు స్వీకరించారు. ఫ్రాన్స్ నుంచి అత్యధికంగా 16 మంది, అమెరికా నుంచి 12, ఇంగ్లాండ్ నుంచి 11, జర్మనీ, స్వీడన్‌ల నుంచి చెరో ఎనిమిది మంది, పోలెండ్, ఇటలీ, స్పెయిన్‌ల నుంచి చెరో ఆరుగురు, ఐర్లాండ్ నుంచి నలుగురు, డెన్మార్క్, నార్వేల నుంచి

ముగ్గురు చొప్పున నోబెల్ సాహిత్య బహుమతులు అందుకున్నారు.

సాహిత్యంలో అంతర్జాతీయ బహుమతులు అందుకోవాలంటే ఆంగ్లంలోనే రచనలు చేయాలన్న అపోహ భారతీయుల్లో ఉంది. ప్రఖ్యాత భారతీయ ఆంగ్ల రచయితలు సల్మాన్ రష్దీ, అరుంధతీ రాయ్, కిరణ్ దేశాయ్, అరవింద్ అడిగలను వీరు ఉదాహరణలుగా తీసుకుంటారు. నేరుగా ఆంగ్లంలో రచనలు చేస్తున్న భారతీయులు బుకర్ సాహిత్య బహుమతులు అందుకుంటున్నారు. భారతీయులు తమ మాతృభాషల్లో చేసిన రచనలు ఆంగ్ల అనువాదానికి నోచుకోక అంతర్జాతీయ సమాజానికి తెలియడం లేదు. ప్రాంతీయ భాషల్లో పేరెన్నికగన్న గ్రంథాలు సైతం తర్జుమా కావడం లేదు. అనువాద సాహిత్యంలో భారత్ చాలా వెనకబడి ఉంది. ఒక భాష నుంచి వేరొక భాషలోకి అనువాదం కావాలంటే రచయితకు రెండు భాషల్లో సమగ్రమైన అవగాహన అవసరం. రవీంద్రుడు తన బెంగాలీ 'గీతాంజలి' గొప్పదనం ఆంగ్లం భాషలోకి బదిలీ కాలేదని ఆవేదన చెందారు. ఐరోపా, ఆఫ్రికా వాసులు మాతృభాషల్లో చేసిన రచనలు అనతికాలంలోనే ఆంగ్లంలోకి తర్జుమా అవుతున్నాయి. అదే సమయంలో భారతీయులు తమ మాతృభాషల్లో చేసిన రచనలు ఆంగ్లంలోకి అనువాదం కాకుండా వెనకబడి ఉన్నాయి. ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో భాషా విశ్వవిద్యాలయాలు ఉన్నా గురజాడవారి 'కన్యాశుల్కం' ఆంగ్ల అనువాదానికి శతాబ్ద కాలం పట్టడం ఇందుకో ఉదాహరణ. రచనా వ్యాసంగంపై మక్కువ చూపే భారతీయుల సంఖ్య అత్యల్పం. రచనాభ్యాసం గురించి మన పాఠ్యాంశాల్లో మచ్చుకైనా ప్రస్తావన ఉండదు. ప్రాంతీయ భాషల తర్జుమాకు అనువాద విశ్వవిద్యాలయాలు నెలకొల్పాల్సిన ఆవశ్యకత ఉంది. వర్ధమాన రచయితలను వెన్నుతట్టి, అనువాద సాహిత్యానికి పెద్దపీట వేసి అంతర్జాతీయ పురస్కారాల వైపు యువ రచయితలను ప్రోత్సహించాల్సిన గురుతర బాధ్యత విద్యాసంస్థలు, ప్రభుత్వాలపై ఉంది!

**(కర్టెసీ: ఈనాడు)**

---

**డిసెంబర్ 9న అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం సందర్భంగా లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణలోని పలు జిల్లాల్లో 'అవినీతి వ్యతిరేక ప్రచార కార్యక్రమాన్ని' నిర్వహించారు. లోక్‌సత్తా సంస్థ తెలంగాణ కన్వీనర్ బండారు రామ్మోహనరావు, సలహాదారు పి. కోదండరామారావు, మరో సీనియర్ నేత ఎన్.శ్రీనివాస్, 'జ్వాల' తదితర స్వచ్ఛంద సంస్థల బాధ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమాల కొన్ని చిత్రాలివి:**











# సుప్రీంకోర్టు తీర్పుతో అయోధ్య వివాదానికి భరతవాక్యం పలకాలి

**భవిష్యత్‌ను వదిలేసి గతం మీద దృష్టి పెట్టటం వల్లే ఓ స్థానిక సమస్య జాతీయ సమస్యగా మారింది: జేపీ**

**మనం భవిష్యత్తు మీద కాకుండా గతం మీద దృష్టి పెట్టటం వల్లే అయోధ్య చుట్టూ ఒక స్థానిక సమస్య పెద్ద జాతీయ సమస్యగా తయారైందని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. విజ్ఞత గల ఏ సమాజమూ ఈ రకమైన గతం మీద దృష్టి పెట్టదని, సుప్రీంకోర్టు తీర్పుతో అయోధ్యలో మందిరం-మసీదు వివాదానికి శాశ్వతంగా భరతవాక్యం పలకాలని విజ్ఞప్తి చేశారు.**



అయోధ్య వివాదంపై సుప్రీంకోర్టు తుది తీర్పుపై జేపీ హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.

ఉత్తర ప్రదేశ్‌లో ఫైజాబాద్ అనే జిల్లా ఉందనిగానీ, అందులో అయోధ్య అనే ప్రదేశం ఉందనిగానీ, ఆ పక్కనే సరయూ నది, అక్కడే బాబ్రీ మసీదు అనేవి ఉన్నాయనిగానీ తనతో సహా ఈ దేశంలో కోట్లాదిమంది ప్రజలకు తెలియదని, ఒక స్థానిక సమస్యను జాతీయ సమస్యగా తయారుచేసుకుని మనం చేయాల్సిన పనుల నుంచి మన దృష్టిని మరల్చుకున్నామని జేపీ అన్నారు. ఈ స్వయంకృతాపరాధం వల్ల హింస, ప్రాణ నష్టం జరిగిందని, దేశంలో మన, పర విభేదాలు తలెత్తాయని, ఆర్థిక వృద్ధి దెబ్బతిందని అన్నారు. ఈవేళ ప్రపంచ దేశాలతో పోటీ పడే శక్తి లేక ప్రాంతీయ సమగ్ర భాగస్వామ్య ఒప్పందం (ఆర్‌సీఈపీ) మీద సంతకం పెట్టే ధైర్యాన్ని భారత్ చేయలేకపోయిందని, ఈ బలహీనతకు కారణం.. ఇలా మన చర్చ పక్కదోవ పట్టటమేనని అన్నారు. మన పిల్లల్లో ప్రపంచస్థాయిని అందుకోగల తెలివితేటలు లేక కాదు, వాణిజ్య నైపుణ్యాలు అందుకోగల శక్తి లేక కాదు, వ్యవసాయంలో ఏ దేశంలోని వారితోనైనా పోటీపడగల సామర్థ్యం మన రైతులకు లేక కాదు.. కేవలం మనం అనవసర అంశాలను విస్మరించి, దృష్టి మళ్లించి విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాలు, ఉపాధి, లాభసాటి వ్యవసాయం, చట్టబద్ధపాలన, సత్వర న్యాయం వంటి అంశాల మీద దృష్టి పెట్టకపోవటం వల్లే ప్రపంచంతో పోటీలో వెనకపడుతున్నామన్నారు. నాణ్యమైన చదువులేక కోట్ల మంది యువత ఉపాధి అవకాశాల్ని అందుకోలేకపోతున్నారని, ఆరోగ్య సమస్యలతో ఏటా లక్షలాది కుటుంబాలు గుల్లవుతున్నాయన్నారు. హైదరాబాద్‌లో డెంగీ జ్వరాలొస్తే అనేకమంది అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. చట్టం, న్యాయం అందక సామాన్యులు నలిగిపోతున్నారన్నారు. న్యాయం ఎంత ఆలస్యమవుతుందనటానికి ఈ కేసే పెద్ద ఉదాహరణన్నారు. ఈ కీలకాంశాల్ని వదిలేసి దేశం మొత్తం అయోధ్యలో మందిరం–మసీదు అనే ఓ స్థానిక సమస్య మీద దృష్టి పెడితే, ఇక దేశం ప్రపంచస్థాయిని ఎలా అందుకోగలదని, పొరుగున ఉన్న చైనాలాంటి దేశాలతో ఎప్పుడు పోటీపడగలదని ప్రశ్నించారు.

## 70 శాతం పార్టీలు, 30 శాతం ధార్మిక సంస్థలు, మీడియా కారణం

అయోధ్య వివాదాన్ని జాతీయ సమస్యగా మార్చటానికి స్వార్థ రాజకీయ పార్టీలు 70 శాతం కారణమైతే, మిగిలిన 30 శాతం పాపం.. ఉనికి కోసం ప్రజలను ఏదోకరకంగా తమవైపు లాక్కునేందుకు ప్రయత్నిస్తున్న రెండు పక్షాల ఛాందస ధార్మిక సంస్థలదీ, ప్రజలను ఆకర్షించేందుకు విపరీత ప్రచారం చేసిన మీడియాదీ అని జేపీ స్పష్టంచేశారు.

### ప్రజలు కోరుకున్నదికాదీ వివాదం..

అయోధ్య వివాదం ప్రజలు కోరుకున్నది కాదని, కేవలం ప్రజల మధ్య పొరపొచ్చాలు సృష్టించి రెచ్చగొట్టినదని జేపీ అన్నారు. ప్రజల నిత్యజీవితంతో ఈ అంశానికి సంబంధం లేదని, ఓ స్థానిక సమస్య చుట్టూ వివాదాన్ని దేశ ప్రజల నెత్తిన రుద్దారన్నారు. సామాన్య ప్రజలు కోరుకోని అంశం మీద

పొరపొచ్చాలు సృష్టించి జాతి సమస్యగా మార్చారన్నారు. కొన్నేళ్ల క్రితం అలహాబాద్ హైకోర్టు తీర్పు ఇచ్చినప్పుడు ప్రజలంతా ఊపిరిపీల్చుకుని, ఆ విషయాన్ని ఇక మరచిపోవాలనుకున్నారని గుర్తుచేశారు. కానీ కక్షిదారులు రాజ్యాంగంలో ఉన్న హక్కును ఉపయోగించుకుని పైకోర్టుకు వెళ్లారన్నారు. ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పుతో ఇక పై అప్పీలుకు, రాజ్యాంగ ప్రక్రియకు కూడా అవకాశం లేదన్నారు. తీర్పు ప్రతిని తాను చూడలేదని, అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం చూస్తే, న్యాయస్థానం తీర్పులో సమతూకం పాటించే ప్రయత్నం కనిపిస్తోందని.. న్యాయమూర్తులు ఎటువంటి న్యాయసూత్రాలు అనుసరించారు, ఎంత అందంగా చెప్పారు వంటి వాటిని రాబోయే కాలంలో నిపుణులు విశ్లేషిస్తారని, ఇంకా రంధ్రాన్వేషణ చేయకుండా ఈ వివాదానికి ఇంతటితో ఫుల్‌స్టాప్ పెట్టాలన్నారు. ఎవరు గెలిచారు, ఎవరు ఓడారు అనే కోణంలో చూడకుండా దేశ ప్రయోజనాలు గెలవాలి అని ఆలోచించాలని, స్థానిక సమస్యను స్థానికానికే పరిమితం చేయాలని అన్నారు. తమ పిల్లల చదువులు, తమ ఆరోగ్యం, ఉపాధి అంశాల మీద దేశ ప్రజానీకం దృష్టి పెట్టాలన్నారు.

**ఎవరింట్లో వారు**

**ప్రార్థనలు చేసుకోండి..**

హిందూ, ముస్లిం అని తేడా లేకుండా తమకంటే తమ బిడ్డలు ఉన్నతంగా ఉండాలని కోరుకోని భారతీయులు ఉండరని జేపీ అన్నారు. మన బిడ్డలకు మంచి చదువు కావాలంటే.. ఆ పంతులుగారు బాగా బోధించగలరా అని ఆలోచిస్తాం తప్ప వారి కులం, మతం చూడమని, మనకు ఆరోగ్య సమస్య వస్తే.. ఆ డాక్టరుగారు మంచి వైద్యం అందించగలరా అని ఆలోచిస్తాం తప్ప వారి కులం, మతం చూడమని అన్నారు. ఎవరి విశ్వాసాన్ని బట్టి వారు తమకు నచ్చిన దేవుడికి, దేవతకు ప్రార్థనలు చేసుకోవాలని, దీన్ని అందరూ గౌరవించాలని, సామాజికంగా మాత్రం ఉమ్మడి అవసరాలు, ఉమ్మడి భవిష్యత్తు మీద దృష్టి పెట్టాలని కోరారు.

**99 శాతం మౌనం వీడాలి**

మన దేశంలో హిందూ, క్రైస్తవం, ఇస్లాం వంటి మతాలు వచ్చి చేరుతూ దేశ సంస్కృతిలో భాగంగా మారాయని, అన్నింటిలో మనకు నచ్చిన, మంచి అంశాలను స్వీకరిస్తూ కలిసిమెలిసి జీవించటం ఈ దేశ నాగరికతని, ఇలాంటి దేశంలో విభేదాలు ప్రజల సంస్కృతి కాదని జేపీ స్పష్టం



చేశారు. ప్రజల మనోభావాల పేరుతో పైనుంచి వివాదాల్ని, విద్వేషాల్ని రుద్దుతున్నారన్నారు. 99 శాతం మంది మాట నెగ్గుతుందా, 1 శాతం మంది ఆధిపత్యం నెగ్గుతుందా? అందరూ ఆలోచించుకోవాలన్నారు. 99 శాతం మంది మౌనం వీడితే ఈ దేశం నిజమైన అంశాల మీద దృష్టి సారించగలుగుతుందని, ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలు లభిస్తాయని అన్నారు. అయోధ్య చుట్టూ వివాదాన్ని ఇంకా పెంచి పోషించేందుకు పార్టీలు, సంస్థలు ప్రయత్నిస్తే వారికి గుణపాఠం చెప్పాలని తాను బహిరంగంగా పిలుపునిస్తున్నానని జయప్రకాష్ నారాయణ్ ప్రకటించారు.




**"రేపటి రోజున మనమేమిటన్నది మనం నమ్మే మతాన్ని బట్టో, పట్టే జెండాని బట్టో, ఇచ్చే నినాదాన్ని బట్టో ప్రజలు నిర్ధారణకు రారు. మన పని, మన కష్టం, మన త్యాగం, మన నీతి, మన స్వచ్ఛత.. వీటితో తూకం వేస్తారు!**

**-గాంధీజీ**


# ఏడు పదుల్లోకి భారత రాజ్యాంగం.. విఫలం కాలేదు .. అధికార క్రీడలో పడి విఫలం చేసుకుంటున్నాం!

**- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్**


2019 మన రిపబ్లిక్ డెబ్బయ్యవ రాజ్యాంగ దినోత్సవ సంవత్సరం. డెబ్భై ఏళ్ల క్రితం నవంబర్ 26, 1949న మన జాతి నిర్మాతలు స్వతంత్ర భారత రాజ్యాంగానికి ఆమోదం తెలిపారు. ఇంతటి సువిశాల, పేద, భిన్నత్వ దేశం ఎటువంటి ఆధునిక ప్రజాస్వామిక అనుభవం లేకుండా గణతంత్ర వ్యవస్థ ప్రారంభం నుండే వయోజన ఓటుహక్కును, పౌరులందరికీ సమానంగా స్వేచ్ఛల్ని ఇవ్వటం మానవజాతి చరిత్రలోనే మొదటిసారి.

రాజ్యాంగ రచనా సంఘానికి చైర్మన్, రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 60కి పైగా రాజ్యాంగాల్ని అధ్యయనం చేసి మన అశేష ప్రజానీకపు ఆశల్ని, ఆకాంక్షల్నీ, మన సమున్నత స్వాతంత్ర్య పోరాటకారులు, జాతి నిర్మాతల వికాస దార్శనికతనూ మేళవిస్తూ ఉదాత్త సంవిధాన పత్రాన్ని రూపొందించారు.

ప్రజాస్వామ్యం పేరుకి కాకుండా వాస్తవంగా కొనసాగటానికి మూడు పనులు చేయాలని బాబాసాహెబ్ అంబేద్కర్ నవంబర్ 25, 1949న ఇచ్చిన చిరస్మరణీయ ప్రసంగంలో కోరారు. డాక్టర్ అంబేద్కర్ సలహాను మనం చాలామేర పెడచెవిన పెట్టాం. మొదటిది, మన సామాజిక, ఆర్థిక లక్ష్యాలను సాధించుకోవటానికి చేసే నిరసనలు, ప్రతిఘటనలు రాజ్యాంగబద్ధ పద్ధతుల్లో మాత్రమే ఉండాలని, అడ్డుకోవటాలు, అరాచకాలకు దిగవద్దని అంబేద్కర్ విజ్ఞప్తి చేశారు. కానీ మనమేం చేశాం?.. మన ప్రతిఘటనల్ని దాదాపుగా జాతీయోద్యమ పోరాటకాలం నాటి అరాచకపు విధివిధానాల్లోనే కొనసాగిస్తున్నాం. రెండోది, అంబేద్కర్ తన ప్రసంగంలో జె.ఎస్ మిల్‌ను ఉటంకించారు. ఒక వ్యక్తి ఎంత గొప్పవాడైనా అతని ముందు మన స్వేచ్ఛల్ని పాదాక్రాంతం చేయవద్దని హితవు పలికారు. గుప్పెట్లో అధికారం ఉన్న గొప్ప వ్యక్తిని గుడ్డిగా విశ్వసించటం వల్ల మన వ్యవస్థల్ని కూలదోసే అవకాశాన్ని మనమే చేజేతులారా ఇచ్చిన ట్లవుతుందని హెచ్చరించారు. కానీ మనమేం చేశాం?.. అధికారంలో ఉన్న వ్యక్తులు నియంతలుగా మారేందు కు అవకాశాల్ని పళ్లెంలో పెట్టి మరీ అందించాం. ప్రైవేటు జాగీర్లుగా, కు టుంబ ఎస్టేట్లుగా పార్టీల్ని దిగజార్చాం.



మూడోది, కులం, మత విశ్వాసాలు, ప్రాంతం వంటి అసమానతల్ని, విభేదాలని అధిగమించగలిగేలా సామాజిక ప్రజాస్వామ్యాన్ని నిర్మించాలని అంబేద్కర్ మనకు మనవి చేశారు. ఇలాంటి ప్రజాస్వామ్య నిర్మాణం ఉంటేనే సమానత్వం, సౌభ్రాతృత్వం పునాదిగా ఏర్పడిన దేశం వాస్తవ రూపం దాలుస్తుందని, అర్థవంతమవు తుందని వివరించి చెప్పారు. కానీ మనమేం చేశాం?.. తనలోని సామర్థ్యాన్ని వికసింప చేసుకునే అవకాశాల్ని ప్రతి బిడ్డకూ అందే ఏర్పాటు చేయకుండా పుట్టుకతో అసమానతల్ని, కులం చట్రాల్ని నిరంతరంగా కొనసాగిస్తున్నాం. ఒక వికృతమైన, జీవచ్ఛవంలాంటి రాజకీయ సంస్కృతిని సృష్టించటం ద్వారా సమాజంలో విభజనల్ని పెంచుతూ పోతున్నాం. తమ ఉమ్మడి నాగరిక స్వప్రయోజనమేమిటో అర్థం చేసుకోలేని, దాన్ని సాధించుకోవటం కోసం పోరాడలేని ఓటుబ్యాంకులుగా సామాజిక బృందాల్ని తయారుచేశాం.



ఒక దేశంగా మనం చాలా సాధించామనటంలో సందేహం లేదు. అన్ని రకాల అవరోధాలను, అపశకునపు జోస్యాలను తిప్పికొడుతూ ఒకే దేశంగా మనుగడ సాధించటమనే అద్భుతాన్ని మనం సాధించి చూపాం. మన స్వేచ్ఛల్ని నిలబెట్టుకున్నాం. స్వేచ్ఛాయుత ఎన్నికల ద్వారా శాంతియుతంగా అధికార మార్పిడి జరిగే విశ్వసనీయ యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకోగలిగాం. ఒక మోస్తరు అభివృద్ధినీ సాధించాం. కానీ మన సామర్థ్యానికి - విజయాలకు, మన అవసరాలకు - సాధిస్తున్న ఫలితాలకు, మనకు - మనతో పోల్చదగిన స్థాయి అభివృద్ధితో మొదలైన దేశాలకూ మధ్య భారీ అంతరం ఉంది. ఆ అంతరం నానాటికీ పెరుగుతోంది.

బ్రిటిష్‌వాళ్లు మన దేశం వదిలివెళ్లి 72 ఏళ్లు దాటిపోయింది. ఎల్లకాలం మన వైఫల్యాలకు వలస పాలనను నిందించలేం. ఇప్పుడు మనం ఒక కూడలిలో ఉన్నాం. మన ప్రజాస్వామ్యం ఇంకా మెరుగ్గా ఉండవచ్చని, మన విజయాలు ఇంకా ఎంతో గొప్పగా ఉండవచ్చని మనలో చాలామంది తరచూ అనుకుంటుంటాం కూడా.

అంబేద్కరే చెప్పినట్లు, "రాజ్యాంగం ఎంత మంచిదైనా.. దాన్ని అమలు చేసేవాళ్లు మంచివాళ్లు కానట్లయితే, అది చెడ్డ ఫలితాలనిస్తుంది. రాజ్యాంగం ఎంత చెడ్డదయినా.. దాన్ని అమలు చేసేవాళ్లు మంచివాళ్లయితే, అది మంచి ఫలితాలనిస్తుంది".

అంబేద్కర్ చెప్పిందే వాస్తవమయిందా? చెడ్డవ్యక్తులు అధికార పగ్గాల్ని చేపట్టి రాజ్యాంగాన్ని విఫలం చేస్తున్నారా? ప్రతీ సమాజంలో మంచీ, చెడూ ఉంటాయి. మంచితనం, విజ్ఞత గల పౌరులు ప్రజాజీవితంలోకి వచ్చి హేతుబద్ధ, నైతిక మార్గాల ద్వారా ఎదిగే అవకాశం కల్పించటం, ప్రజలకు స్పష్టమైన, సిసలైన ప్రత్యామ్నాయాల్ని కల్పించటం, ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పు నెరవేరే అవకాశాలకు తగిన ప్రోత్సాహకాల్ని అందించటం రాజ్యాంగం,

చట్టాలు చేయాల్సిన పని.

మన రాజ్యాంగం ఉదాత్తమైనది, విశాల జనావళి ఆకాంక్షలకు అద్దం పట్టేది. కానీ నిజమైన ప్రజాస్వామ్యానికి, గొప్ప దేశానికి కేవలం ఒక మంచి రాజ్యాంగం, ఓటుహక్కు, ప్రతిఘటన తెలిపే స్వేచ్ఛ మాత్రమే ఉంటే ఫలితాలు కూడా ఆ మేరకు పరిమితంగానే ఉంటాయి. వాస్తవంలో ప్రజాస్వామ్యం ఒక సంక్లిష్టమైన, కష్టతరమైన వ్యవస్థ. అధికార దళారీల (పవర్ బ్రోకర్ల) పరిమితమైన ప్రజాస్వామ్యం ప్రజల కోసం పనిచేసేలా తగిన పరిస్థితుల్ని మనం నిర్మించుకోవాల్సి ఉంది. ఓటును అర్థం చేసుకుని, వ్యక్తిగత, కుటుంబ స్థాయిలో, తమ జీవితంలో, సమాజంలో మెరుగైన ఫలితాల్ని సాధించుకోవటానికి ఆ ఓటును సంధానం చేసుకునే అవకాశాన్ని ప్రజలకు ఇస్తే.. ప్రజాస్వామ్యం గొప్ప ఫలితాలనిస్తుంది. తాము కట్టే పన్నుల డబ్బుకు, తమకు లభించే ఉమ్మడి సేవలకు మధ్య సంబంధాన్ని ప్రజలకు తెలియచెప్పగలిగితే ప్రజాస్వామ్యం అర్థవంతమవుతుంది. అధికారాన్ని ప్రజలకు అతి దగ్గరగా వినియోగిస్తుంటే, ఓటర్లు పాలనా నిర్ణయాలలో భాగస్వాములవుతారు, తమ నిర్ణయాల పర్యవసానాల్ని రోజువారీగా అర్థం చేసుకుంటుంటారు. దీంతో ప్రజాస్వామ్యం వాస్తవరూపం దాల్చుతుంది.

ఆరోగ్యకరమైన, విజయ వంతమైన ప్రజాస్వామ్యానికి కావలసిన ఈ పరిస్థితుల్ని ఏర్పరచు కోవటంలో మనం చాలామట్టుకు విఫలమయ్యాం. పర్యవసానంగా.. స్వేచ్ఛ ఒక లైసెన్సుగా తయారైంది. అసమానతలు పట్టిపీడించటం కొనసాగుతోంది. కులం, ప్రాంతం, మతం వంటి ఆదిమ భావాలు మనల్ని వెర్రెక్కిస్తూనే ఉన్నాయి. మన మాటల్లో, చేతల్లో ఆవేశకావేషాలు, ఉన్మత్తత, తరచూ హింస చోటుచేసుకుంటున్నాయి. అంబేద్కర్, మన జాతి నిర్మాతల కలల్ని నెరవేర్చాలనుకుంటే మనం మన ప్రజాస్వామ్య పునాదిని పటిష్టం చేసుకోవాలి. కేవలం ఓటు వేయటం, అరవటానికి పరిమితమైతే చాలదు. ఈ పునాదుల్ని మనం ఎలా బలోపేతం చేసుకోగలం? మన రాజ్యాంగాన్ని మన కోసం మెరుగ్గా ఎలా పనిచేయించుకోగలం?



మన ప్రజాస్వామ్యాన్ని మెరుగ్గా పనిచేయించటానికి నాలుగు పనుల్ని కీలకంగా చేయాల్సి ఉంది.

మొదటిది, మన ప్రభుత్వాధికార వ్యవస్థను జవాబుదారీగా మార్చాలి. రోజువారీ సాధారణ, మౌలిక సేవలు ఎవరి జోక్యం, లంచాలు లేకుండా, వాటంతటవే, నిర్ణీత కాలవ్యవధిలో గ్యారంటీగా జరిగే ఏర్పాటు జరగాలి. అన్ని సేవలూ నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేసేలా సిటిజన్స్ చార్టర్లను ఏర్పాటు చేయాలి. అలా సకాలంలో సేవలు అందించలేకపోతే దరఖాస్తుదారునికి పరిహారం చెల్లించాలి. ఈ రకమైన ఏర్పాటు చేస్తే.. రోజూ బిక్కుబిక్కుమంటూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పౌరులు నిజమైన సార్వభౌములవుతారు.

రెండోది, చట్టబద్ధపాలన, చట్టం ముందు అందరూ సమానమే అనే మాటల్ని మనం కాగితాల్లో నుంచి వాస్తవంలోకి మార్చాలి. ఇప్పుడు కర్ర ఉన్నవాడిదే బర్రె. నేర దర్యాప్తు స్వతంత్రంగా, జవాబుదారీతనంతో జరిగేలా చేయాలి. దీనివల్ల పేద, ధనిక, అధికారంలో ఉన్నవారు, బయట ఉన్నవారు.. అందరూ సమానంగా పరిగణించబడతారు. న్యాయం త్వరితగతిన, ఖర్చు లేకుండా అందరికీ అందుబాటులో ఉండేలా చేయాలి. ఇవన్నీ చేసినప్పుడే అందరూ తమ హక్కుల్ని వినియోగిం చుకోగలుగుతారు, అధికారంలో ఉన్నవారు జవాబుదారీగా ఉంటారు.

మూడోది, అధికారం జనం ఇంటి ముందుకు రావాలి. అప్పుడు స్థానికంగా నిర్వహించుకోగలిగే అన్ని విషయాల్లో ప్రజలు పాలుపంచు కోగలుగుతారు, స్థానికంగానే నిర్ణయించుకోగలుగుతారు. వాళ్లు తప్పులు చేస్తే, వాళ్లు మాత్రమే మూల్యం చెల్లిస్తారు. పర్యవసానాల్ని త్వరగా అర్థం చేసుకోగలుగుతారు. అక్కడ మంచి జరిగితే, ఆ నమూనాను ఇతర ప్రాంతాలవారు కూడా అనుసరించగలుగుతారు. చెడ్డ నిర్ణయాల వల్ల నష్టం జరిగితే మాత్రం, ఆ నష్టం స్థానికానికే పరిమితమవుతుంది.

నాలుగోది, మన రాజకీయ సంస్కృతిని, ఎన్నికల వ్యవస్థను మనం మార్చుకోవాలి. ఇప్పుడు మనకు ప్రజాస్వామ్యం పేరుతో ధనికుల రాజ్యం, దోపిడి రాజ్యం నడుస్తున్నాయి. మన ఎన్నికలు చాలామేర ఓట్ల కొనుగోలు, మన పిల్లల భవిష్యత్తును తాకట్టు పెట్టి ఓట్లను ఆకర్షించటానికి ప్రకటించే తాత్కాలిక తాయిలాల పథకాలు, ప్రజలను ఓటుబ్యాంకులుగా మార్చటానికి సమాజంలో విభజనలు, విద్వేషాలను పెంచటం.. అనే స్థాయికి దిగజార్చబడ్డాయి. మన పార్టీలు ప్రైవేటు ఎస్టేట్లుగా తయారై, మన రాజకీయ భాగస్వామ్యానికి ఏమాత్రం పనికిరాకుండా పోయాయి. మనం ఎన్నికల వ్యవస్థను మార్చాలి. ప్రభుతాన్ని నడిపించే నాయకుడు/ నాయకురాలిని ప్రత్యక్షంగా ఎన్నుకోవటం, దామాషా ఎన్నికల పద్ధతిలోకి మారితే ఓట్ల కొనుగోలుకు తెర దించవచ్చు. ఎన్నికల పద్ధతుల్లో ఈ రకమైన మార్పు వల్ల సమర్థులు, నిజాయతీపరులైన వ్యక్తులు రాజకీయాల్లో ఎదగగలుగుతారు, చట్టసభల్లోకి ప్రవేశించగలుగుతారు, ప్రభుత్వంలోకి సామర్థ్యాన్ని తేగలుగుతారు, రోజువారీ అధికార దుర్వినియోగానికి కళ్లెం వేయగలుగుతారు. ఇదేసమయంలో మన రాజకీయ పార్టీల్ని కూడా సంస్కరించి ప్రజల వేదికలుగా వాటిని మార్చాల్సి ఉంది. పార్టీల్లో నాయకత్వం, అభ్యర్థుల ఎంపిక.. నియంతలు, వంశపారంపర్య నేతల హుకుంతో కాకుండా, రహస్య బ్యాలెట్ ద్వారా సభ్యులు మాత్రమే ఎన్నుకోవాలి.

మహారాష్ట్రలో ఇప్పుడు జరుగుతున్న పరిణామాలు చూస్తే మనం ఒక రాజకీయ వ్యవస్థగా వినాశం అంచున ఉన్నామని అర్థమవుతుంది. ఇప్పుడు వెంటనే మౌలిక రాజకీయ, పాలనా సంస్కరణలని చేపట్టటం నేటి చారిత్రకావసరం.

మన రాజ్యాంగం మనల్ని విఫలం చేయలేదు. ప్రజాస్వామ్యాన్ని అధికార క్రీడ స్థాయికి దిగజార్చి మనమే మన రాజ్యాంగాన్ని విఫలం చేశాం. మన ప్రజాస్వామ్యం మనందరి కోసం, ముఖ్యంగా పేద, బలహీన, అణగారిన ప్రజానీకం కోసం పనిచేసేలా పరిస్థితుల్ని మనం పునర్నిర్మించుకోవాల్సి ఉంది. దీన్ని మనం సాధించగలం. కానీ ఇందుకోసం ముందు మనం మేలుకోవాలి, చేసిన తప్పుల్ని గుర్తించాలి. చాలా సమయాన్ని మనం వృథా చేసుకున్నాం. మన వైఫల్యాలకు కోట్లాది ప్రజలు భారీ మూల్యం చెల్లిస్తున్నారు. సమయం పూర్తిగా మించిపోలేదు. అంబేద్కర్ కలల్ని, మన స్వతంత్ర పోరాట యోధుల దార్శనికతను సాకారం చేయాలంటే ఇప్పటి నుంచైనా మనం దిద్దుబాటు చర్యల్ని మొదలుపెట్టాలి.




# నేతలు, ఉన్నతాధికారుల మొత్తం ఆస్తుల లెక్క తీయాలి

## అవినీతి వ్యతిరేక వారోత్సవాల్ని ప్రారంభించిన లోక్‌సత్తా

దేశవ్యాప్తంగా ఉన్నతాధికారులు, రాజకీయ నాయకుల ఆస్తుల్ని పరిశీలించి, ఆదాయానికి మించి ఆస్తులుంటే జప్తు చేసి ప్రభుత్వపరం చేయాలని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ తెలంగాణ కన్వీనర్ బండారు రామ్మోహనరావు డిమాండ్ చేశారు. ఆ అవినీతి కేసుల్ని ఫాస్ట్ ట్రాక్ కోర్టుల్లో విచారణ చేయాలన్నారు. డిసెంబర్ 9న అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం సందర్భంగా 'అవినీతి వ్యతిరేక వారోత్సవాల'ను 3వ తేదీన ఆయన కరీంనగర్‌లో ప్రారంభించారు. అవినీతి అంతానికి రాజకీయ సంకల్పం లేకపోవటం తప్ప వేరేమీ అవరోధం లేదన్నారు. ఆన్‌లైన్ సేవలతోపాటు ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా పౌర సేవల చట్టం, ప్రత్యేక కోర్టుల ఏర్పాటు, అవినీతిపరుల ఆస్తుల జప్తు, నల్లడబ్బు ప్రమేయం లేకుండా ఎన్నికల సంస్కరణలు వంటి సంస్థాగత ఏర్పాట్లతో అవినీతి నిర్మూలన పూర్తిగా సాధ్యమన్నారు. తెలంగాణ రాష్ట్రం అవినీతిలో దేశంలో 5వ స్థానంలో ఉండటం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వమే పలు అవినీతి కేసుల్ని తొక్కిపడుతోందన్నారు. లోకాయుక్త, అంబుడ్స్‌మన్‌ల వ్యవస్థను రాష్ట్రంలో తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు. అవినీతిపై ప్రజలు తిరగబడితే తాము అండగా ఉంటామని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్ అన్నారు. రైతులు ఎదుర్కొంటున్న అవినీతి సమస్యలు, రెవెన్యూ, వినియోగ, మునిసిపల్ విభాగాల్లో అవినీతిపై బి.శ్రీనివాస్, వీరబ్రహ్మం, బి.సత్యనారాయణ, లక్ష్మారెడ్డి, వెంకటరెడ్డి, సువర్ణ, రాజకుమార్, బాలరాజు, దుర్గారెడ్డి, పెంటారెడ్డి, గంగారావు, ఏసురెడ్డి తదితరులు మాట్లాడారు. అవినీతిపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో, విద్యార్థుల్లో చైతన్యం తెచ్చేందుకు రౌండ్‌టేబుల్ సమావేశాలు, సదస్సులు, ర్యాలీలు, ప్లకార్డు ప్రదర్శనలు, గోష్ఠులు, వ్యాసరచన పోటీలు, ప్రముఖులతో ప్రసంగ కార్యక్రమాల్ని ఏర్పాటు చేయాలని రామ్మోహనరావు విజ్ఞప్తి చేశారు. అవినీతికి వ్యతిరేకంగా కార్యాచరణపై కూడళ్లు, బస్టాండులు, రైల్వే స్టేషన్లలో లోక్‌సత్తా ఆధ్వర్యంలో ప్రజాబ్యాలెట్‌ను కూడా నిర్వహిస్తామని తెలిపారు.

### ఏసీబీకి పట్టించిన విద్యార్థికి సన్మానం

తన నానమ్మకు రావలసిన పెన్షన్ కోసం లంచం అడిగిన సబ్‌ట్రెజరీ అధికారిని ఏసీబీకి పట్టించిన వట్టెముల గ్రామ విద్యార్థి ఎన్.రాహుల్‌ను లోక్‌సత్తా ఘనంగా సన్మానించింది. తాను లంచం తీసుకోనని బోర్డు పెట్టి ఇతరులకు ఆదర్శంగా ఉన్న విశాఖ ఏడీ అశోక్‌ను కొడిముంజ సమాచార హక్కు కార్యకర్త బి.లక్ష్మణ్ సన్మానించారు.

### ప్రతిజ్ఞ

లోక్‌సత్తా, వినియోగదారుల మండలి, సీనియర్ సిటిజన్స్, విశ్రాంత ఉద్యోగుల సంఘం, రైతు సేవాసంఘం, సమాచార హక్కు సంఘాల బాధ్యులు 60 మంది తాము అవినీతికి వ్యతిరేకంగా పోరాడతామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. నారాయణ, నాగమోహన్, అరుణ్, గంగాధర్, మనోహర్, ముజఫర్, ఆర్.చంద్రప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలకు ఛార్జీలు పెంచటంతో ముగిసిన ఆర్‌టీసీ సమ్మె

ప్రజలంటే ఎవరు?.. ఇటీవల తెలంగాణలో ఆర్‌టీసీ సమ్మె సందర్భంగా ప్రముఖ పౌరసమాజ నేత కూడా అయిన ఓ ఆచార్యుడు టీవీ డిబేట్‌లో సంధించిన ప్రశ్న! ఆర్‌టీసీ సమ్మెను ప్రజలకు భద్రమైన, నాణ్యమైన, చౌకయిన సేవలను అందించటం అనే చట్రంలో పరిష్కరించాలని, ఆర్‌టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలనే విధానపరమైన అంశాన్ని మినహాయించి మిగతా అంశాలను కార్మికుల సాధారణ డిమాండ్లుగా పరిగణించి రాష్ట్ర ప్రభుత్వం ఉదారంగా చర్చించాలని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ చెప్పటంపై సదరు ప్రొఫెసర్ ఆ ప్రశ్నను వేశారు. రాజకీయ పార్టీలు ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తాయి కాబట్టి, ఆర్‌టీసీ సమ్మె విషయంలో ప్రతిపక్ష పార్టీలన్నీ సమ్మెకు మద్దతు పలికాయి కాబట్టి, తన లాంటి పౌర సమాజ నేతలూ మద్దతు పలుకుతున్నారు కాబట్టి.. సమ్మెలో ప్రజలు పాల్గొంటున్నట్లేనని ఆయన కొత్తభాష్యం చెప్పారు. ఆర్‌టీసీ సమ్మె ముగిశాక ఒక స్పష్టమైన సమాధానం ఆయన ముందే కనిపిస్తోంది. ఎవరైతే ఆర్‌టీసీలో పెరిగిన రేట్లను చెల్లిస్తారో వారే అసలైన ప్రజలు. 52-55 రోజుల పాటు సాగిన ఆర్‌టీసీ సమ్మె చివరకు ప్రజలపై ఛార్జీల పెంపు భారంతో ముగిసింది. ఆర్‌టీసీ సమ్మె విషయంలో న్యాయస్థానాలు చేయగలిగేది పెద్దగా ఉండదని, ప్రభుత్వం, కార్మికులు కూర్చుని చర్చించుకుని ప్రజలకు అసౌకర్యం కలగకుండా వెంటనే పరిష్కరించాలని మొదటి నుంచీ జేపీ చెబుతూ వచ్చారు. కానీ విచిత్రంగా కార్మికుల్లో లేనిపోని ఆశల్ని రేపి సమ్మె పొడిగించటానికి చివరిదాకా కారణమైన శక్తుల్లో ఒకటైన హైకోర్టు బెంచ్ (ప్రధాన న్యాయమూర్తి)కి సమ్మె విరమణ క్రెడిట్‌ను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు కట్టబెట్టారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు, కార్మికుల డిమాండ్లపై చర్చలు వంటివేమీ లేకుండానే సమ్మె సుఖాంతమని చెప్పుకొచ్చారు. ఏరు దాటాక 'ప్రజలంటే ఎవరు?' అని ప్రశ్నిస్తూ తెప్ప తగలేసే బాపతు నేతలున్న ప్రజాస్వామ్యం కాబట్టి, ప్రజలకు ఇంకా తగినంత చైతన్యం లేదు కాబట్టి.. కర్ర ఉన్నవాడిదే బర్రె అవుతోంది. 2014లో తాను ప్రమాణం స్వీకారం చేశాక ఏర్పాటు చేసిన తొలి సమావేశంలో కేసీఆర్ ఓ విషయం చెప్పారు-'మన భారతీయులు వ్యక్తిగతంగా ఏ పనినైనా సాధించి చూపగల సమర్థులు, కానీ ఇతరులతో కలిసి చేసే ఉమ్మడి అవసరాలకు సంబంధించిన పనుల్లో మాత్రం ఘోరంగా



విఫలమవుతుంటారు' అని. ఈ మాటలు ఆర్‌టీసీ సమ్మె విషయంలో కేసీఆర్‌కు పూర్తిగా వర్తిస్తాయి. ప్రజాస్వామ్యాన్ని సమగ్రంగా అమలు చేస్తే ఏ మినహాయింపులూ అవసరం లేకుండానే సమసమాజ నిర్మాణం సాధ్యమవుతుంది. ఎందుకంటే, ప్రజాస్వామ్యం గ్రేటెస్ట్ లెవెలర్. కానీ ఇతరులతో కలిసి పనిచేసే ప్రజాస్వామిక శక్తి లేకపోవటం వల్ల ఆర్‌టీసీ సమ్మెను ఓ సగటు పెత్తందారీ నాయకుడిలా తప్ప ప్రజల నుంచి వచ్చిన ఉద్యమ నాయకుడిలా, సుదీర్ఘ రవాణా సమ్మె సమయంలోనూ ప్రజల అసాధారణ మద్దతు పొందిన ముఖ్యమంత్రిగా కేసీఆర్ పరిష్కరించలేకపోయారు. ప్రభుత్వం ఏం చేయాలన్న విధానపరమైన స్పష్టత, కార్మికుల న్యాయమైన డిమాండ్లు, వారిని చర్చలకు పిలవటం, ఉదారంగా వారి డిమాండ్లను పరిశీలించటం, ప్రజాప్రయోజనాలపై మౌలికంగా రాజీ పడకుండా వాటితో ఉద్యోగుల కోర్కెలను సమన్వయం చేసుకుంటూ పరిష్కరించటం వంటివి చేయకుండా.. చక్రవర్తిలా, పెత్తందారులా నేను చేస్తున్నాను, నాతో సరిగా ఉంటేనే మీకు ఏదైనా లాభం లాంటి పదాల్ని ఉపయోగించారు. ఇక నుంచి యూనియన్లతో సంబంధం లేకుండా ప్రతి డిపో నుంచీ కార్మికులతో మాట్లాడతానని కూడా కేసీఆర్ చెప్పారు. ఇందుకు అభ్యంతరం చెప్పాల్సిన పన్లేదు కానీ.. ఆయన కూడా ప్రజాస్వామిక ముఖ్యమంత్రిగా కాకుండా ఓ యూనియన్ నాయకుడిలానే వ్యవహరిస్తునారు గదా! ఇప్పుడు ఎలాగైతే యూనియన్లతో సంబంధం లేకుండా ఆయన నేరుగా కార్మికులతో సంబంధం పెట్టుకుని వారికి అధికారం ఇవ్వాలనుకుంటున్నారో.. అలాగే తన పాలనను కూడా కేసీఆర్ వికేంద్రీకరించి, జనం చేతికి అధికారాల్ని ఇవ్వాలి. ప్రజలకు-ప్రభుత్వానికి మధ్య అడ్డుగోడలు లేకుండా పాలనను ప్రజల ఇంటి ముందుకు తేవాలి.


## కేసీఆర్‌కు జేపీ లేఖ

ఆర్‌టీసీ సమ్మె విషయంలో ప్రారంభం నుంచీ విధానపరంగా విజ్ఞతగల వాదనను వినిపించటమేకాకుండా, కార్మికులు ఎప్పుడైతే విలీనాన్ని పక్కనపెట్టామన్నారో వెంటనే ముఖ్యమంత్రికి కూడా లేఖ రాసి వారి డిమాండ్లను ఉదారంగా పరిష్కరించాలని జేపీ కోరారు. ఆర్‌టీసీ అనే వ్యాపారసంస్థను విలీనం చేయాలనే డిమాండ్‌ను తెలంగాణ సర్కారు నిర్ద్వంద్వంగా తిరస్కరించటం సిద్ధాంతపరంగా సరైన నిర్ణయమని, ప్రైవేటు రంగంలో వ్యక్తులు పోటీపడి సేవలందించేందుకు ముందుకొచ్చేటప్పుడు ప్రభుత్వమే గుత్తాధిపత్యంతో ఆ పనులు చేయటం సరికాదని అన్నారు. ప్రభుత్వ ప్రధాన బాధ్యతలు.. చట్టబద్ధపాలన, మౌలిక సదుపాయాల కల్పన, అందరికీ మంచి ప్రమాణాల విద్య, ఆరోగ్యాలను అందించటం, ప్రభుత్వ కార్యాలయాల్లో సేవలు సక్రమంగా అందేలా చేయటమని.. ప్రభుత్వం చేయాల్సిన పనులకు వెచ్చించాల్సిన వనరుల్ని, ప్రభుత్వం చేయనక్కర్లేని పనులకు కేటాయించటం వల్ల సామాన్యులు తీవ్రంగా నష్టపోతారని జేపీ తన లేఖలో అన్నారు.

# వైద్య భారం తగ్గితేనే..
# పేదరికం పోతుంది

ప్రతి సామాన్యునికీ నాణ్యమైన వైద్యం ఆర్థిక భారం లేకుండా అందినప్పుడే తెలుగు రాష్ట్రాలు, భారతదేశం పేదరికం నుంచి బైటపడతాయని జేపీ అన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో సరైన వైద్యం అందకుండా చేస్తూ ప్రజలను ప్రైవేటు, కార్పొరేట్ వైద్యం వైపు పాలకులే నెడుతుండటం వల్ల కోట్ల మంది సామాన్య, మధ్యతరగతి ప్రజలు నలిగిపోతున్నారన్నారు. ఇది కేవలం అమానుషమైన విషయం మాత్రమే కాదని, ప్రభుత్వం ఎలా నడపాలో తెలియని అజ్ఞాన పాలనకు నిదర్శనమని అన్నారు. కడప జిల్లా బద్వేలు ప్రభుత్వాస్పత్రిని సురాజ్య యాత్రలో జేపీ సందర్శించారు. సౌకర్యాలను, సిబ్బంది వివరాలను, వైద్యశాలలో జరుగుతున్న కాన్పులు, ఆపరేషన్ల సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు.

ప్రైవేటులో రూ.10,000 జీతమిస్తే, అదే తరహా పనికి చాలా ప్రభుత్వ విభాగాల్లో రూ.40,000-50,000 జీతమిస్తుంటారని, కానీ ప్రాణాలు పోసే వైద్యవృత్తిలో మాత్రం అందుకు విరుద్ధంగా చేస్తున్నారని జేపీ అన్నారు. ప్రైవేటు డాక్టర్‌కి రూ.2-3 లక్షల జీతమొస్తుంటే, ప్రభుత్వం మాత్రం రూ.50వేల లోపు జీతమిస్తోందన్నారు. ప్రజలకు భారం లేకుండా మంచి వైద్యాన్ని అందించే బాధ్యత నుంచి తప్పించుకునేందుకే ఇలాంటి దుర్రాజ్య విన్యాసాలను పాలకులు చేస్తున్నారన్నారు. దీన్ని మార్చటానికే సురాజ్య యాత్ర అన్నారు. బద్వేలు ఆస్పత్రికి కనీసం దారి కూడా సరిగా లేకపోవటం దారుణమన్నారు. ఆస్పత్రిలో సేవలకు తగ్గ నిధులుండవు, కనీసం వచ్చేందుకు రహదారి కూడా సరిగా లేదు.. ఇంకేంటి ఇక్కడ ప్రజాప్రతినిధులు, అధికారులు చేస్తున్నది? అని ప్రశ్నించారు. దాదాపు 1.4కోట్ల నిధులతో నిర్మించి ఈ ఆస్పత్రిలో రూ.7కోట్ల విలువైన సేవలను అందిస్తున్నా రన్నారు. బద్వేలు ఆస్పత్రి సమస్యపై కలెక్టర్, ఇతర అధికారులతో మాట్లాడతానని, కానీ అంతకంటే ముఖ్యంగా వైద్య ఆరోగ్య రంగాన్ని బాగుచేయాల్సిన అవసరముందని జేపీ అన్నారు. విదేశాల్లో 90శాతం వైద్యసేవలను ప్రభుత్వం అందిస్తుంటే, మన వద్ద అందుకు పూర్తి విరుద్ధంగా ప్రజలు జేబులు ఖాళీ చేసుకుని పేదలుగా మారుతున్నారన్నారు. అన్ని హంగులతో ప్రభుత్వం వైద్యం అందిస్తే ప్రజలు ప్రైవేటు ఆస్పత్రుల వైపు వెళ్తారా? అని పాలకులను నిలదీయాల్సుందన్నారు. మన వైద్య ఆరోగ్య సేవల రంగంలో లక్షల కోట్ల డిమాండ్ ఉంది కాబట్టే ప్రైవేటు సంస్థలు ఎగబడుతున్నాయని, ప్రతి వాణిజ్య సదస్సులోనూ ఇదో పెద్ద చర్చనీయాంశమవుతోందని, కానీ ఇదేదో పెద్ద భారమన్నట్టు ప్రభుత్వం నటిస్తోందని అన్నారు. ప్రతి ఒక్కరికీ జేబులో నుంచి ఖర్చు లేకుండా నాణ్యమైన వైద్యాన్ని అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, ప్రాథమిక స్థాయిలో 'ఫ్యామిలీ డాక్టర్' వ్యవస్థతో దీన్ని ఏర్పాటు చేయాలని, మనకున్న నిధులతోనే ఇది పూర్తిగా సాధ్యమని జేపీ స్పష్టం చేశారు. దీనివల్ల కొత్తగా రెండు మూడు కోట్ల ఉద్యోగాలు కూడా వస్తాయన్నారు. ప్రభుత్వం సరైన వైద్య విధానాన్ని అమలు చేస్తే డాక్టర్లు కూడా సేవాభావంతో ప్రభుత్వ ఆస్పత్రుల వైపే మొగ్గుచూపుతారన్నారు.



ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ అశోక్‌కుమార్ రాజు, డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ శిరీష, డాక్టర్ దుర్గాభవానీ, వాసుదేవరెడ్డి, హుస్సేనయ్య, పీఏసీ నేత ఎం.శ్రీకాంత్‌రెడ్డి, హైకోర్టు న్యాయవాది జగన్నాథరావు, ఎన్ఎస్‌యూవై జాతీయ కార్యదర్శి లింగం సతీష్‌కుమార్, ఉపాధ్యాయ సంఘం నాయకుడు పీవీ సుబ్బారెడ్డి, లోక్‌సత్తా, వైబీఐ నేతలు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తరాంధ్ర సాగు, తాగు నీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తిచేయాలి: జేపీ





సాగు, తాగునీటి ప్రాజెక్టుల పట్ల నిర్లక్ష్యం వల్ల ఉత్తరాంధ్ర వ్యవసాయ పరంగా, పారిశ్రామికంగా కూడా వెనుకబాటుతనానికి గురవుతోందని, యువతకు ఉపాధి దెబ్బతింటోందని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఉత్తరాంధ్రలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు ఏ రకమైన చర్యలు చేపట్టాలో తగిన ప్రణాళిక తయారుచేసి రాష్ట్ర ప్రభుత్వానికి అందించేందుకు సమగ్ర వివరాలను రూపొందించాలని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ కార్యనిర్వాహక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీకి సూచించారు.

హైదరాబాద్ కార్యాలయంలో జేపీతో బాబ్జీ సమావేశమయ్యారు. ఉత్తరాంధ్ర చర్చా వేదిక కన్వీనర్, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ ఎం. ధర్మారావు కూడా పాల్గొన్నారు.


రాష్ట్రంలో, ముఖ్యంగా ఉత్తరాంధ్రలో సాగునీరు, తాగునీరు అవసరం పెరిగిందని, బాహుదా, మహేంద్ర తనయ, వంశధార, నాగావళి, సువర్ణముఖి, పెద్దగెడ్డ, చంపావతి, జంఝావతి, సీలేరు, శబరి, గోస్తనీ, శారద, వరహా, తాండవ తదితర నదులు నిత్యం ప్రవాహంతో ఉన్నప్పటికీ, అధిక వర్షపాతం నమోదవుతున్నప్పటికీ ఉత్తరాంధ్ర రైతులకి సాగునీటి సౌకర్యాలు అందించలేకపోవటం ఎంతో బాధ కలిగిస్తోందని జేపీ అన్నారు. ఉత్తర కోస్తాలో దాదాపు 60 లక్షల ఎకరాల విస్తీర్ణం ఉంటే, 30 లక్షల ఎకరాలు సాగుకు అనుకూలం కాగా, ప్రస్తుతం అందులో 8 లక్షల పైచిలుకు సాగునీరు అందుబాటులో లేక వ్యవసాయం దెబ్బతింటోందన్నారు. విజయనగరం జిల్లాలో తారకరామతీర్థ సాగరం, వెంగళరాయసాగర్, జంఝావతి పనులు ఇంకా నత్తనడక నడుస్తున్నాయన్నారు. గత ప్రభుత్వంలో ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకు తగిన నిధుల కేటాయింపు జరగలేదని, బాబూజగ్జీవన్ రాం ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం నేటికీ పూర్తికాలేని దుస్థితిలో ఉందన్నారు. ఉత్తరాంధ్రలో ప్రవహించే నదుల్లో ఎక్కువభాగం ఒడిషాలో పుట్టిన నదులని, కనీసం అంతర్రాష్ట్ర సమస్యలను చర్చించలేని దుస్థితిలో పాలకులున్నారన్నారు.

## త్వరలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు లేఖ

ఉత్తరాంధ్ర జలవనరుల ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేసేలా ప్రస్తుత ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని జేపీ సూచించారు. ఉత్తరాంధ్ర మనుగడకు, పరిశ్రమల అభివృద్ధికి, యువత ఉపాధి కోసం ప్రభుత్వం నడుం బిగించాలని కోరుతూ రోడ్‌మ్యాప్‌తో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి లేఖ రాస్తానన్నారు. ఉత్తర కోస్తా అభివృద్ధి చెందాలంటే నిధులు, అధికారాలతో స్వయంప్రతిపత్తితో నడిచే ప్రత్యేక అభివృద్ధి మండలి అవసరమని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి, ఉత్తరాంధ్ర అభివృద్ధి మండలిని ఏర్పాటు చేయాలని, విద్యాఉపాధి రంగాలు అభివృద్ధి చెందేలా తగిన నిర్ణయాల్ని తీసుకోవాలని జేపీ అన్నారు. ఉత్తరాంధ్ర గిరిజన ప్రాంతాల్లో విషజ్వరాలు పెచ్చుమీరాయని, ఇప్పటికీ గర్భిణీలను డోలీలతో ఆస్పత్రులకు తీసుకెళ్తున్నారని, ఈ విషాదకర పరిస్థితుల్ని మార్చాలని అన్నారు. ప్రాథమిక వైద్యాన్ని బలోపేతం చేయాలన్నారు. విభజన సమయంలో ఇచ్చిన హామీల ప్రకారం వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమకు రావలసిన బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ, ఇతర రాయితీలను సాధించుకునేందుకు లోక్‌సత్తా నేతృత్వంలో స్వతంత్ర నిపుణులు రూపొందించిన నివేదికను ఉపయోగించుకోవాలన్నారు. వీటిపై కూడా దృష్టి పెట్టి అందరినీ కలుపుకుని లోక్‌సత్తా పనిచేయాలని సూచించారు. ఈ అంశాలపై ముఖ్యమంత్రి జగన్‌కు రాసే లేఖలో కోరతానని జయప్రకాష్ నారాయణ్ అన్నారు.




# రాజ్యాంగ సంస్థల పనితీరుపై చెరగని ముద్రవేసిన శేషన్



మన రాజ్యాంగ సంస్థల పనితీరు కొలమానాలపై టి.ఎన్ శేషన్ చెరగని ముద్ర వేశారని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ నివాళు లర్పించారు. శేషన్‌కు ముందు కూడా ఎన్నికల సంఘం నిష్పాక్షికంగానే పనిచేసిందని, అయితే శేషన్ ఈసీకున్న స్వతంత్ర ప్రతిపత్తిని సంపూర్ణంగా వినియోగించి చూపారన్నారు. ఆయన తనకు వ్యక్తిగతంగా కూడా గొప్ప స్నేహితుడని, 1999లో లోక్‌సత్తా ఎలక్షన్ వాచ్ ప్రచారాన్ని ప్రారంభించారని చెప్పారు. శేషన్ మృతి పట్ల జేపీ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.



## కుల నిర్మూలనకు జీవితపర్యంతం కృషి చేసిన కృష్ణన్

పీఎస్ కృష్ణన్ అంకితభావం గల ఐఏఎస్ అధికారి అని, కుల నిర్మూలనకు జీవితపర్యంతం కృషి చేశారని జేపీ అన్నారు. యాదృచ్ఛికంగా జరిగే పుట్టుకను బట్టి కాక ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్యను గ్యారంటీగా అందించే పాలనా వ్యవస్థను మనం ఏర్పరచుకోవాలన్నారు. అందరికీ మంచి విద్యతోనే కుల నిర్మూలన సాధ్యమన్నారు. కృష్ణన్ లేని లోటు పూడ్చలేనిదని జేపీ అంజలి ఘటించారు.

INDIAN DEMOCRACY AT WORK
Annual Conference Series
Inaugural Address by
Shri M. Venkaiah Naidu
Honourable Vice-President of India



Theme 2020
MONEY POWER IN POLITICS
09 - 10 January 2020, ISB, Hyderabad
Politicians, lawmakers, judges, authors, bureaucrats and practitioners will participate in the conference
https://www.indiandemocracyatwork.in/participate/ , Registration Fee: Rs. 3,000 only!
FDR FOUNDATION FOR DEMOCRATIC REFORMS
ISB Bharti Institute of Public Policy
हैदराबाद विश्वविद्यालय
University of Hyderabad

# ఓ పక్క రాజ్యాంగ దినోత్సవం
# మరోపక్క 'మహా' అధికార క్రీడ


## ఇకనైనా ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నికకు మారతామా?

రాజ్యాంగం గురించి తాము చెప్పే మాటలకి, రాజకీయంగా చేసే పనులకు ఎంత అంతరం ఉందో 70వ రాజ్యాంగ దినోత్సవ వేళే బట్టబయలు కావటం జాతీయ స్థాయిలోని మోదీ ప్రభుత్వానికి, బీజేపీకి తలవంపులు తెచ్చింది. ప్రజల్లో చాలామంది ఇంకా వార్తాపత్రికలను తెరకవముందే, వాటిల్లో వచ్చిన హెడ్‌లైన్లను తారుమారు చేస్తూ మహారాష్ట్రలో బీజేపీ సర్కారు తెల్లవారుజామున ప్రమాణస్వీకారం చేసింది. మళ్లీ 80 గంటల్లోనే దేవేంద్ర ఫడణవీస్ నేతృత్వంలోని ఆ ప్రభుత్వం గద్దె దిగాల్సి వచ్చింది. చివరికి మళ్లీ పత్రికల్లో మొదట వచ్చిన పతకాశీర్షిక వార్తే నిజమైంది. సుప్రీంకోర్టు ఉత్తర్వుతో మొదలైన పరిణామాల మధ్య శివసేన, ఎన్‌సీపీ, కాంగ్రెస్‌ల కూటమి 'మహా వికాస్ ఆఘాడీ' ప్రభుత్వం ప్రమాణస్వీకారం చేసింది. ఉద్ధవ్ ఠాక్రే ముఖ్యమంత్రి అయ్యారు. ఈ షాకింగ్ పరిణామాల పట్ల ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ స్పందిస్తూ.. చట్టసభ పనుల్లో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాల్సి రావటం రాజ్యాంగ స్ఫూర్తికి, ప్రజల తీర్పుకి కూడా అవమానమని, ఇలాంటి పరిస్థితి నుంచి రాజకీయం బైటపడాలని అన్నారు. సుప్రీంకోర్టు చరిత్ర సృష్టించిందని కొందరు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని, చట్టసభల్లో బలపరీక్షకు సంబంధించి న్యాయస్థానం జోక్యం ఇదేమీ మొదటిసారి కాదని స్పష్టం చేశారు. చట్టసభల్లో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితులను చరిత్ర సృష్టించటంగా ఇంకా ఎన్నిసార్లు, ఎన్నేళ్లు మనం మాట్లాడుకుంటాం? అని ప్రశ్నించారు. ఐదేళ్లు సుస్థిర ప్రభుత్వం అందించిన బీజేపీ, శివసేన కూటమి తర్వాతి ఎన్నికల్లో కూడా కలిసి పోటీ చేసి, మెజారిటీకి తగ్గ సీట్లను మళ్లీ సాధించి, ఆ తర్వాత విడిపోవటం లాంటి ఉదంతం బహుశా దేశ రాజకీయ చరిత్రలోనే లేదన్నారు. శివసేన చేసింది తప్పుడు రాజకీయమన్నారు. ఆ తర్వాత తమకు రాజకీయ ప్రత్యర్థిగా ఉన్న శివసేనతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటానికి ఉమ్మడి ప్రాతిపదిక ఉండాలని కాంగ్రెస్, ఎన్‌సీపీ సమయం తీసుకోవటం సరైన చర్యగానే చూడాలన్నారు. ఇక్కడిదాకా హుందాగా వ్యవహరించిన రాష్ట్ర గవర్నర్, బీజేపీ.. తీరా శివసేన, కాంగ్రెస్, ఎన్‌సీపీ కలిసి సర్కారును ఏర్పాటు చేసే సమయంలో తెల్లవారుజామున రాష్ట్రపతి పాలన ఎత్తివేసి ప్రమాణస్వీకారం చేయటం దిగజారుడు రాజకీయమన్నారు. గవర్నర్ తప్పు చేయటంతోపాటు అందులో ప్రధానమంత్రి జోక్యంతో రాష్ట్రపతిని కూడా భాగస్వాముల్ని చేశారన్నారు. ఎవరో ఒకరు ఈ తప్పుకు మూల్యం చెల్లించాలని, గతంలో ఆంధ్రప్రదేశ్‌లో రామ్‌లాల్‌ను చేసినట్లు గవర్నర్ భగత్‌సింగ్ కోశ్యారీని కూడా తొలగించాలన్నారు. ఎంతో ప్రాధాన్యత గల మహారాష్ట్రలో ఏర్పడిన కొత్త ప్రభుత్వంలోని పార్టీలు.. తమ మనుగడ కోసమైనా సరైన పాలన అందించే ప్రయత్నం చేస్తాయని ఆశిద్దామన్నారు. మహారాష్ట్రలో ఇప్పుడు బీజేపీ చేసినట్లే గతంలో పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ కూడా చేసిందని, మనం పార్టీల దృష్టిని దాటి పరిష్కారాల్ని ఆలోచించాలన్నారు. ఎన్నికల హామీల్ని నెరవేర్చేరీతిలో ప్రభుత్వం ఏర్పాటు, పాలన, ఆరోగ్యకరమైన పోటీనిచ్చే ప్రతిపక్షం వంటి అంశాలకు పటిష్ట సంస్థాగత సంస్కరణల్ని తెచ్చుకోవాలన్నారు. గవర్నర్లు కేంద్ర ప్రభుత్వాల తాబేదార్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. ఒకవేళ గవర్నర్ చెప్పిన మాట వినకపోతే గతంలో తమిళనాడులో సుర్జీత్‌సింగ్ బర్నాలా విషయంలో చేసినట్లు తెల్లారేసరికల్లా తొలగిస్తారన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల సంస్కరణలే కీలకమని, ముఖ్యంగా పాలనకు, రాజకీయానికి కేంద్రబిందువులైన రాష్ట్రాల్లో ప్రభుత్వాధినేతల ప్రత్యక్ష ఎన్నికల పద్ధతిని ప్రవేశపెట్టాలన్నారు. దీనివల్ల రాజ్యాంగం ఆశిస్తున్నట్లు అధికారాల విభజన జరిగి, ముఖ్యమంత్రి పాలనకు, ఎమ్మెల్యేలు చట్టసభలకు పరిమితమవుతారని, ఫిరాయింపులు, ఎన్నికల్లో కోట్లు ఖర్చు పెట్టటాలు అదుపులోకి వస్తాయన్నారు. ముఖ్యమంత్రి నియంతగా మారకుండా చట్టసభకు జవాబుదారీగా ఉంటారన్నారు. గవర్నర్ల వ్యవస్థ అవసరముండదన్నారు. ఈ మార్పు జమిలి ఎన్నికలకు కూడా ఉపయోగపడుతుందన్నారు. ఇలాంటి సంస్కరణలు లేకుండా ఒట్టి జమిలి ఎన్నికల వల్ల ఫలితం ఉండదన్నారు. జాతీయ స్థాయిలో కూడా అందరూ కోరుకుంటే జాతీయస్థాయిలో కూడా ప్రభుత్వ సారథిని ప్రత్యక్షంగా ఎన్నుకోవచ్చుని, దామాషా పద్ధతిని అనుసరించవచ్చని అన్నారు. రాజకీయ వైఫల్యాల్ని, అధికార క్రీడల్ని విమర్శిస్తూ పరిష్కారాలకు మాత్రం మోకాలడ్డే ధోరణినే ఇంకా కొనసాగిస్తామా, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక పద్ధతికి మారతామా?



FDR
FOUNDATION FOR
DEMOCRATIC REFORMS

# INTERNSHIP @ FDR




## Do you feel that the system is flawed? Let us fix it together.

- An opportunity to study governance reforms, public policy, democratic and constitutional institutions in India
- Real-time projects in Research, Analysis and Communication
- Gain exposure with professionals from all-over India

Apply Online at http://www.fdrindia.org/online-application/
Contact- Ph: 91-40-2341 3 061
email: communications@fdrindia.org

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2018-2020 Published on 10th December, 2019 Posting Date 15 &16th of every month




# BOOK POST

## PRINT MATTER

*If undelivered please return to:*

*LOKSATTA UDYAMA SAMSTHA,*
*Tulips Apartments, 6-3-655,*
*Flat.No. 407,*
*Behind civil supplies office,*
*Somajiguda,*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, Tulips Apartments, 6-3-655, Flat.No. 407, Behind civil supplies office, Somajiguda, Hyderabad - 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020**